ఆంధ్రజ్యోతి

సోమవారం | 8-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 264 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ. 3.47 వరకు తదుపరి అష్టమి; నక్షత్రం: హస్త రా. 1.46 వరకు తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 9.47-11.25; దుర్ముహూర్తం: మ. 12.44-1.29, మ. 2.57-3.41; అమృతఘడియలు: రా. 7.37-9.15; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.53 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

కరువుకు చెక్

ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తే మా లక్ష్యం

27లో ఆరు ప్రారంభం.. మరో ఐదు రెడీ

మార్చి ఆఖరుకల్లా 16 ప్రాజెక్టులు ప్రారంభిస్తాం

సహజ వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలి

బ్యాంకులో డబ్బులా పొదుపుగా వాడుకోవాలి

అనంతలో సౌరవిద్యుత్ స్టోరేజ్ ప్లాంట్

జవాబుదారీతనం పెంచేందుకే జన్మభూమి

కర్నూలు జిల్లా జన్మభూమిలో సీఎం వెల్లడి

సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభం


కర్నూలు జిల్లా సిద్ధాపురంలో వాలీబాల్ ఆడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కర్నూలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సహజ వనరులను సంరక్షించి సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఏరువాక, జలసిరికి హారతి, వనం-మనం, సూర్యారాధనను ప్రాధాన్యంగా తీసుకున్నామని.. నీరున్న ప్రాంతానికి కరువు రాదని పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురంలో రూ.115 కోట్లతో నిర్మించిన సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అక్కడ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం 'జన్మభూమి-మా ఊరు' సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో 27 ప్రాధాన్య ప్రాజెక్టులను చేపట్టి.. ఇప్పటికే 6 ప్రారంభించామని, మరో 5 ప్రాజెక్టులు పారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 16 ప్రాజెక్టులను మార్చి ఆఖరులోగా పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ దూరదృష్టితో పునాది రాళ్లు వేసిన ప్రాజెక్టులను తాను పూర్తి చేసి ప్రారంభించడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. ఆయన హంద్రీ-నీవా, తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని, గాలేరు-నగరి ద్వారా కడపలోని గండికోటకు 20 టీఎంసీల నీటిని తీసుకెళ్లిన ఘనత తమదేనని అన్నారు. ఐదో విడత జన్మభూమిలో రోజుకో అంశంపై అవగాహన కల్పిస్తున్నామని గుర్తుచేశారు. అందులో భాగంగా

మిగతా 14వ పేజీలో...

పోలవరంలో కీలక అడుగు

నేడు జెట్ గ్రౌటింగ్ పనులు ప్రారంభించనున్న సీఎం


గంటకు 600 టన్నుల కాంక్రీటు సిద్ధం చేసే అగ్రిటెక్ కూలింగ్ ప్లాంట్

ఐటీ హుషార్!



కలిసొస్తున్న 'వాతావరణం'

చిప్ డిజైనింగ్ శిక్షణకు 'వేదా'.. రిక్రూటింగ్ ఏజెన్సీ 'హ్యాపీ మైండ్స్'

పెట్టుబడులకోసం ఏంజెల్ నెట్‌వర్క్.. గుంటూరులో మకుట గ్రాఫిక్స్

ఐటీ అనుబంధ సంస్థలూ రాక.. అమరావతికి 'బాహుబలి' సంస్థ

నాలుగు టవర్లు ఇప్పటికే ఫుల్.. విస్తరణ బాటలో పలు సంస్థలు

ఈ నెల 17న ప్రారంభం కానున్న మరో 12 కొత్త కంపెనీలు

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో మెల్లమెల్లగా ఐటీ రంగం జోరందుకుంటోంది. ఐటీ కంపెనీలతో పాటు... వాటిని పెట్టాలనుకునేవారికి పెట్టుబడులు సమకూర్చే సంస్థలు, వాటిలో పనిచేయాలనుకునే యువతకు శిక్షణ ఇచ్చే ఏజెన్సీలు... ఇలా అన్నింటితో కూడిన సమగ్రమైన 'ఐటీ వాతావరణం' వస్తోంది. అమెరికాలో ప్రసిద్ధి చెందిన 'గ్లోబల్ ఫౌండేషన్' రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఇన్‌వేకాస్‌కు అనుబంధంగా ఉన్న వేదా ఐఐటీ, మకుట సంస్థలు అమరావతికి వస్తున్నాయి. 'వేదా ఐఐటీ' దేశంలో చిప్ డిజైనింగ్‌లో పేరొందింది. ఈ సంస్థ చిప్ డిజైనింగ్‌లో ఎంటెక్ కోర్సులను ఆఫర్ చేస్తోంది. అలాగే... బాహుబలి సినిమాకు గ్రాఫిక్స్ చేసిన 'మకుట' ఈ రంగంలో

మిగతా 11వ పేజీలో...

ప్రపంచం దృష్టికి అమరావతి

రేపు ఢిల్లీలో అంతర్జాతీయ మీడియా సదస్సు 11



భూమిని బట్టి ఎరువులు

పొలం, పంటకు తగినట్టుగా కచ్చితమైన మోతాదు

భూ ఆరోగ్య కార్డుల ఆధారంగా రైతులకు సరఫరా

కేంద్ర సర్కారు సూత్రప్రాయ నిర్ణయం

సాగు వ్యయం తగ్గించి, పంటల ఉత్పత్తి పెంచే లక్ష్యం

తొలి దశలో ఏపీ, తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో అమలు

11

ఇక పెయ్యలే పుడతాయ్!

పశుసంవర్ధక శాఖలో సరికొత్త విధానం

పిండోత్పత్తి ద్వారా మేలుజాతి ఆవుల అభివృద్ధి

విశాఖ, పులివెందులలో వెటర్నరీ ల్యాబ్‌లు

ఒక్కో దూడకయ్యే ఖర్చు రూ.15 వేలు

రూ.10 కోట్లతో 7 వేల దూడల ఉత్పత్తి లక్ష్యం

పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ సోమశేఖరం వెల్లడి



11



గ్రంథస్థమైన జ్ఞానమే నిజమైన ప్రజ్ఞ కాదు



పరంజ్యోతి

వేదాంత చక్రవర్తిగా పేరొందిన జనక మహారాజు గొప్ప జ్ఞాని. గుర్రం ఎక్కడానికి వాడే రికాబులో కాలు పెట్టేంత సమయంలో ఆత్మజ్ఞానం పొందవచ్చు అన్న ప్రమాణం ఆయన విన్నాడు. క్షణకాలంలో వేదాంత పరిజ్ఞానం అనుభవంలోకి తెచ్చే సుజ్ఞాని కోసం వెతికాడు. దానికి అష్టావక్రుడే సరైనవాడన్నారు పండితులు. అష్టావక్రుడు తల్లిగర్భంలో ఉన్నప్పుడు.. గొప్ప పండితుడైన తన తండ్రి రోజూ వేదాలు వల్లిస్తుంటే విని ఒక రోజు గర్భంలోంచే పలికాడు. "వేదాన్ని కేవలం వల్లెవేయడం వల్ల ప్రజ్ఞను నీవు కనుక్కోలేవు. సత్యానికి దాన్ని జోడించు. అది మన అంతరంగంలో ఉంటుంది" అన్నాడు. గర్భస్థ శిశువు మాటలతో అహం దెబ్బ తిన్న ఆ తండ్రి.. 'అష్ట వంకరలతో జన్మిస్తావు' అని కొడుక్కి శాపమిచ్చాడు. అలా జన్మించినవాడే అష్టావక్రుడు. వేదాంత జ్ఞానం తెలపడానికి జనకుని సభకు వచ్చిన అష్టావక్రుని చూసి అందరూ నవ్వారు. వెంటనే ఆయన ఆత్మజ్ఞాన ప్రబోధాన్ని ప్రారంభించాడు. 'మీరు చర్మాన్ని, ఎముకల గూడును చూసి నవ్వుతున్నారా? ఎంత అజ్ఞానం? అంతఃకరణ పొందని వారు ఎన్నటికీ పండితులు కాలేరు' అన్నాడు. దీంతో సభలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. జనకుడు అష్టావక్రుని పాదాలపై పడి తనకు పూర్ణ ప్రజ్ఞను ప్రసాదించమని వేడుకున్నాడు. అప్పుడు అష్టావక్రుడు 'భౌతిక దృష్టి గలవారు కంటికి కనిపించేవాటికి ప్రాధాన్యతనిచ్చి అస్తిత్వాన్ని వదిలివేస్తారు. గ్రంథస్థమైన జ్ఞానం మాత్రమే నిజమైన ప్రజ్ఞ కాదు. అది ఒక సాధనం మాత్రమే. ప్రజ్ఞ అనేది ఒక అగ్నిజ్వాల అయితే.. ఈ భౌతిక పరిజ్ఞానం దాన్నుంచి పుట్టిన బూడిద. అసలు తత్వాన్ని గ్రహించి జీవించడమే ప్రజ్ఞ. కానీ జీవులు విషయ వాంచలతో నిరంతరం పుడుతుంటారు, మరణిస్తుంటారు. కోరికలు, కోపం, ద్వేషం, అసూయ వంటివి నిత్యమరణాలు. కాబట్టి విముక్తి కోరేవారు విషయవాంఛలను విషంలా త్యజించాలి. క్షమాగుణం, నిష్కాపట్యం, ప్రేమ, దయ, సంతృప్తి, అహంకారం వదలడం, మమకారం లేకుండా బతకడం అనేవాటిని అమృతంలా స్వీకరించాలి" అంటూ ప్రవచించాడు. అదే అష్టావక్ర గీత. భగవద్గీత తర్వాత ఆత్మజ్ఞానం ప్రబోధించే విషయంలో అష్టావక్రగీత అసమాన వేదాంత గ్రంథం. - డాక్టర్ పి.భాస్కర యోగి

లోకం తీరు



ఏం పర్లేదు మేం ముందుకే వెళ్తున్నాం.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	13.5	29.4
ఏలూరు	14.0	29.0
విశాఖపట్నం	14.4	28.0
చిత్తూరు	14.4	29.5
గుంటూరు	15.0	31.0
అనంతపురం	16.0	30.4
కడప	17.2	32.4
ఒంగోలు	19.5	30.4
నెల్లూరు	20.6	31.8
విజయవాడ	21.1	29.5

కొనసాగుతున్న చలి తీవ్రత

విశాఖపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలి గాలులతో ప్రజలు వణుకుతున్నారు. తెలంగాణలో పలుజిల్లాలు, కోస్తాలో ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు చలి ఉంటోంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. ఆదివారం ఆదిలాబాద్‌లో తొమ్మిది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటలు కూడా చలి ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని, అయితే దీని ప్రభావం కోస్తాపై వుండదని పేర్కొంది.

ముగ్గులమ్మ.. ఈ లచ్చుమమ్మ



ఈ అవ్వ పేరు లచ్చుమమ్మ. వయసు 72 ఏళ్లు. ఈ అవ్వను ఎరిగిన వారంతా ముద్దుగా 'ముగ్గులమ్మ' అని పిలుచుకుంటారు. ఎందుకంటే.. ఈ అవ్వ జీవనాధారం ముగ్గులు గీయడమే. హైదరాబాద్‌లోని చందానగర్ పరిసర ప్రాంతాల్లో నివసించే లచ్చుమమ్మ రోజూ అక్కడి 15 ఇళ్ల ముందు ముగ్గులు గీస్తుంది. అందుకుగాను ఒక్కొక్క ఇంటి నుంచి నెలకు రూ.250 వేతనంగా తీసుకుంటుంది. చేతివేళ్లను కుంచెగా మలచి ముగ్గులు గీసి జీవించే లచ్చుమమ్మ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ముగ్గులపోటీలో పాల్గొంది. "ముగ్గులు మంచిగ గీస్తావు కదా! నీవు కూడా ముగ్గుల పోటీలో పాల్గొను' అని నేను పనిచేసే ఇంటి అమ్మ చెప్పింది. అందుకే ఇక్కడికి వచ్చా. ముగ్గుల పోటీలో పాల్గొనడం సంతోషంగా ఉంది' అని పేర్కొందామె.



కనిగిరిలో జరిగిన ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు



విశాఖలో వేసిన ముగ్గులు

నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రజ్యోతి-టాటా జెమినీ టీ ముగ్గుల పోటీలు

87 కేంద్రాల్లో పాల్గొన్న 11 వేల మంది మహిళలు

ముందే వచ్చిన సంక్రాంతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి శోభ ముందే వచ్చింది. ముగ్గులతో తెలుగు నేలంతా కళకళలాడింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న టాటా జెమినీ టీ ముత్యాల ముగ్గుల పోటీలు (టేస్ట్ పార్టనర్: గోల్డ్‌డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్: డిగ్ సెల్, హెల్త్ పార్టనర్: అమృత బిందు) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 87 కేంద్రాల్లో కన్నులపండువగా జరిగాయి. 11 వేలమందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో 800 మంది మహిళలు పాల్గొనడంతో సుమారు మూడెకరాల స్థలం రంగవల్లులతో నిండిపోయింది. గుంటూరు జిల్లాలో ముగ్గుల పోటీలకు 700 మందికి పైగా మహిళలు తరలి వచ్చారు. వీరిలో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు కూడా ఉన్నారు. వారంతా ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం విశేషం. కృష్ణా జిల్లాలో విజయవాడ, గుడివాడ, తిరువూరుల్లో నిర్వహించిన పోటీల్లో 400 మందికిపైగా మహిళలు ముత్యాల ముగ్గులు వేశారు. కొన్ని కేంద్రాల్లో ముగ్గుల పోటీలు శుక్ర, శని వారాల్లో పూర్తికాగా, అత్యధిక కేంద్రాల్లో ఆదివారం జరిగాయి. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.5,000, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000 చొప్పున అందజేశారు. పలు కేంద్రాల్లో పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకూ కన్సొలేషన్ బహుమతుల్ని అందజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి సాధించిన వారి నుంచి ఒకరు జిల్లా స్థాయిలో ఎంపికవుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి ఒక్కొక్కరు చొప్పున... మొత్తం 15 మందికి విజయవాడలో ఈ నెల 10న ఫైనల్స్ జరుగుతాయి. 31 తెలంగాణ జిల్లాల విజేతలకు ఈ నెల 12న హైదరాబాద్‌లో ఫైనల్స్ జరుగుతాయి. హైదరాబాద్, విజయవాడల్లో ఫైనల్స్ విజేతలకు రూ.1,76,000 బహుమతులు, మరెన్నో గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి.

దుర్గగుడి ఈవో బదిలీ

- పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం.. జీఏడీలో చేరాలని ఆదేశం
- ఆలయ బాధ్యతలు చేపట్టిన దేవాదాయ శాఖ కమిషనర్

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బెజవాడ కనక దుర్గమ్మ గుడిలో అనధికార పూజలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఈవో సూర్య కుమారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలనా విభాగంలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధకు కనక దుర్గ ఆలయ కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. దీనిపై శనివారమే నిర్ణయం తీసుకున్నా.. ఉత్తర్వులు మాత్రం ఆదివారం వెలువడ్డాయి. ఆదివారమే సూర్యకుమారి తన బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ఆమె స్థానంలో అనూరాధ ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. డిసెంబరు 26వ తేదీ రాత్రి దుర్గగుడిలో అనధికారికంగా పూజలు జరిగినట్లు ఆరోపణలు వెలువడిన సంగతి తెలిసిందే. ద్విసభ్య కమిటీ దీనిపై విచారణ జరపగా.. అనధికార పూజలు నిజమే అని నిర్ధారణ అయింది.

చల్ చల్ గుర్రం



పెద్ద పండగ వచ్చేస్తోంది. జనమంతా అప్పుడే పండగ జోష్‌లోకి వెళ్లిపోయారు. దీనిని రెట్టింపు చేసేలా తూర్పు గోదావరి జిల్లా టి.తిమ్మాపురంలో ఆదివారం గుర్రపు పందేలు నిర్వహించారు. ఎన్నడూ చూసి ఎరగని ఈ పందేలను వీక్షించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో జనం తరలివచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 24 గుర్రాలు పాల్గొనగా.. విశాఖ జిల్లా రాయపురాజుపేటకు చెందిన అశ్వం ప్రథమస్థానం దక్కించుకుంది.

- తుని

'సెట్స్' షెడ్యూల్ నేడే

- ప్రశాంతంగా నీట్ ఎగ్జామ్

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్) షెడ్యూల్ సోమవారం విడుదల కానుంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాయలంలో మంత్రి గంటా శ్రీనివాస్ తేదీలను ప్రకటిస్తారు. ఏ ప్రవేశ పరీక్ష, ఏ వర్సిటీ నిర్వహిస్తుందో కూడా చెబుతారు. ఎంసెట్‌ను ఏప్రిల్ చివరి వారంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. అన్ని పరీక్షలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లోనే జరగనుంది. కాకినాడ జేఎన్‌టీయూ, అనంతపురం జేఎన్‌టీయూ, శ్రీ వేంకటేశ్వర వర్సిటీలలో ఏదో ఒకదానికి ఎంసెట్ నిర్వహణ అప్పగించే వీలుంది. కాగా, దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పీజీ నీట్ ఏపీలో ప్రశాంతంగా జరిగింది. ఈ సారి ఒకేసారి మెడికల్, డెంటల్ ప్రవేశ పరీక్షను పూర్తి చేశారు. వీటి ఫలితాలను ఫిబ్రవరిలో ప్రకటిస్తారు.

నన్నయ వర్సిటీలో 34 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

దివాన్‌చెరువు(రాజమహేంద్రవరం), జనవరి 7: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 34 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు ఆదివారం తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో 23 పోస్టులు, కాకినాడ క్యాంపస్‌లో 11 పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. దరఖాస్తు వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వివరించారు.

సుప్రీం బరిలో పందెం కోడి!

- డింకీ పందేలకు అనుమతి కోరతా: రఘురామకృష్ణరాజు

భీమవరం, జనవరి 7: కోడి పందేల నిర్వహణకు అనుమతి కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ వేయనున్నట్లు బీజేపీ నేత, పారిశ్రామికవేత్త కనుమూరి రఘురామకృష్ణరాజు చెప్పారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన సంక్రాంతి సంప్రదాయాలపై స్థానిక పెద్దలతో చర్చించారు. హైకోర్టు ఆదేశాలపై ఆయన స్పందిస్తూ.. పండుగ సంప్రదాయంలో కోడిపందేలు కీలకమన్నారు. ఈనెల 8, 9 తేదీల్లో సుప్రీంకోర్టులో పిల్ వేస్తానని చెప్పారు. డింకీ (పుంజులకు కత్తులు కట్టకుండా) పందేలకు అనుమతి కోరతానన్నారు.

'మాకూ టెట్, డీఎస్సీకి అవకాశం కల్పించండి'

విజయవాడ, జనవరి7, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2017-18 విద్యా సంవత్సరంలో హిందీ పండిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు టెట్, డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని హిందీ సేవాసదన్ వ్యవస్థాపకుడు, ఏపీ హిందీ ప్రచారసభ కార్యదర్శి ఎస్.గైబువల్లి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు నెలల్లో విద్యా సంవత్సరం పూర్తి కాబోతున్న నేపథ్యంలో తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆ పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పించాలని పత్రికాముఖంగా మంత్రి గంటా శ్రీనివాసరావును ఆయన కోరారు.

ఉపాధ్యాయ విద్య.. మిథ్య!

- జాడ లేని 'టీచర్ ఎడ్యుకేషన్' వర్సిటీ
- కమిటీ నివేదిక సమర్పించి రెండేళ్లు
- ఉపాధ్యాయ విద్యపై పర్యవేక్షణ కరువు

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గురువులు సుశిక్షితులైతేనే విద్యార్థులకు నాణ్యమైన బోధన లభిస్తుంది. ఉపాధ్యాయ విద్యపైనే పాఠశాల విద్య నాణ్యత ఆధారపడి ఉంటుంది. ఇందుకోసం ఉపాధ్యాయ విద్యకు ప్రత్యేకంగా ఓ విశ్వవిద్యాలయం అవసరం. జాతి నిర్మాణంలో కీలకపాత్ర వహించేలా మెరుగైన ఉపాధ్యాయలోకాన్ని తయారు చేసేందుకు 'టీచర్ ఎడ్యుకేషన్' యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్న ఏపీ ప్రభుత్వ ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. రాష్ట్రంలో 1000 వరకు బీఎడ్, డీఎడ్, లాంగ్వేజ్ పండిట్ కాలేజీలు ఉన్నప్పటికీ, వాటిని పర్యవేక్షించే ఏజెన్సీల మధ్య సమన్వయం లేకపోవడంతో ఉపాధ్యాయ విద్య లోపభూయిష్టంగా తయారైంది. ఉపాధ్యాయ విద్య కాలేజీలకు అనుమతులు ఇవ్వడం వరకే ఎన్‌సీటీఈ పరిమితమవుతోందే తప్ప ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, ఎంఈడీ కాలేజీలకు సంబంధిత వర్సిటీలు అఫిలియేషన్లు ఇస్తుండగా, డీఈడీ, లాంగ్వేజ్ పండిట్ కాలేజీలకు మాత్రం ఎస్‌సీఈఆర్‌టీ అఫిలియేషన్ మంజూరు చేస్తోంది. ఇలా ఒక్కో తరహా ఉపాధ్యాయ విద్య కళాశాలకు ఒక్కో ఏజెన్సీ అనుమతులు, అఫిలియేషన్లు ఇస్తున్నాయి. కాలేజీల పనితీరు నానాటికీ అధ్వానంగా తయారవుతున్నా అజమాయిషీ లేకుండా పోయింది. ఫలితంగా ఉపాధ్యాయ విద్యలో నాణ్యత లేకుండా పోయిందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సమర్థ బోధన జరగకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ క్రమేపీ పడిపోతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సరిగ్గా ఉండదన్న అభిప్రాయంతో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించడానికే ఆసక్తి చూపుతున్నారు. నవ్యాంధ్రలో ఇప్పటికే సబ్జెక్టు ఆధారిత విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇదే కోవలో టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన రావడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఐదుగురు విద్యావేత్తలతో కమిటీని ఏర్పాటు చేసింది. ప్రొఫెసర్ ఎస్.పద్మనాభయ్య, ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు, ప్రొఫెసర్ డి.రామకృష్ణయ్య, ప్రొఫెసర్ ఘంటా రమేశ్, డాక్టర్ కె.లక్ష్మీనారాయణలతో ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 27న కమిటీని నియమించింది. సదరు కమిటీ విస్తృత అధ్యయనం చేసి, పలు సిఫారసులు చేస్తూ గత ఏడాది మార్చి 15న నివేదిక సమర్పించింది.

కమిటీ సిఫారసులు ఏమిటంటే..

- టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ద్వారా వివిధ స్థాయిల్లో నాణ్యమైన విద్యనందించేలా ఉపాధ్యాయులను తయారు చేయవచ్చు.
- జాతి నిర్మాణంలో కీలకపాత్ర వహించేలా వారిని భాగస్వాములను చేయవచ్చు.
- థియరీ, ప్రాక్టికల్స్‌కు మధ్య సమన్వయం చేయవచ్చు. అంటే ఇన్‌సర్వీస్, ప్రీసర్వీస్ టీచర్లు ఎలా పనిచేస్తున్నారో అధ్యయనం చేయవచ్చు.
- ఉపాధ్యాయ విద్యలోకి పాఠశాల విద్య రావాలి.
- పరీక్షల నిర్వహణ, డిగ్రీల అవార్డు, పనితీరు మదింపు, అనుమతుల మంజూరుకు వర్సిటీ అవసరం.

కమిటీ రెండేళ్ల క్రితంనివేదికను సమర్పించినా, టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ గురించి మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పూనం కౌర్‌కు 'కత్తి' ప్రశ్నలు





పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 7: పవన్ కల్యాణ్‌పై విమర్శలు గుప్పిస్తోన్న సినీ విమర్శకుడు కత్తి మహేష్.. నటి పూనంకౌర్‌కు ఆరు ప్రశ్నలు సంధించారు. ఇటీవలి విమర్శల నేపథ్యంలో పవన్, పూనంలను బహిరంగ చర్చకు ఆహ్వానించిన మహేష్.. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో మాట్లాడారు. ఇదే సమయంలో ఆయనపై దాడికి పవన్ కల్యాణ్ అభిమానులు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. 'పవన్ అభిమానులు ఉన్మాదుల్లా ప్రవర్తిస్తున్నారు. ఫ్యాన్స్‌ను నియంత్రించలేని వ్యక్తి రాష్ట్రాన్నెలా ఉద్ధరిస్తాడు? 4 నెలలుగా పవన్ ఫ్యాన్స్ నన్ను వేధిస్తున్నారు. నా భార్య, తల్లిని తిడుతున్నారు. నా వ్యక్తిగత వివరాలను వెబ్‌సైట్లలో పెడుతున్నారు. ఓ ఫ్యాన్ అయితే.. సామాజిక బహిష్కరణ విధించాలన్నారు. ఒక దళితుడిగా ఎన్నో సామాజిక బహిష్కరణలు ఎదుర్కొన్నాను' అని ఆయన అన్నారు.

ఆరు ప్రశ్నలివే..


- పూనం కౌర్‌కు ఏపీ చేనేత బ్రాండ్ అంబాసిడర్ పదవి ఎవరి వల్ల వచ్చింది?
- తిరుమలలో పవన్ కల్యాణ్‌తో కలిసి నిలబడి మీరు ఒకే గోత్ర నామాలతో పూజ ఎందుకు చేయించుకున్నారో చెబుతారా?
- పవన్ మోసం చేశాడనే బాధతో మీరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే కాపాడిందెవరు. మీరు ఏ ఆసుపత్రిలో చికిత్స పొందారు.. ఆ బిల్లులు కట్టిందెవరు?
- మీ అమ్మను కలిసిన పవన్ ఏమని ప్రమాణం చేశారు..అది ఇప్పటివరకు నెరవేర్చారా.. లేదా?
- దర్శకుడు త్రివిక్రమ్ అంటే ఎందుకు కోపం?
- క్షుద్ర మాంత్రికుడు నర్సింగం చేసిన తాంత్రిక పూజలో త్రివిక్రమ్, పవన్‌లతో కలిసి మీరు అక్కడ ఏం చేశారో చెప్పగలరా?



కర్ణాటక సీఎం హిందువైతే గోవధను నిషేధించాలి

కర్ణాటక రాష్ట్రంలో ఆటవిక న్యాయం సాగుతోంది. హనుమజ్జయంతి జరుపుకోడానికీ అవకాశం ఇవ్వడం లేదు. సమాజానికి చెడు చేసే ఎంతో మంది జయంతులకు అనుమతులు ఇస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, సిద్దరామయ్యకు ఎన్నికలు వచ్చినప్పుడే హిందుత్వం జ్ఞాపకం వస్తుంది. గుజరాత్ ఎన్నికల వేళ మఠాలు, ఆలయాలకు వెళ్లడమే విధిగా రాహుల్‌గాంధీ భావించారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య ఇటీవల తానూ హిందువునేనని చెప్పుకుంటున్నారు. హిందుత్వంపై అంతటి విశ్వాసం ఉంటే కర్ణాటకలో గోవధను సంపూర్ణంగా నిషేధించాలి.

- బెంగళూరు సభలో యూపీ సీఎం యోగి



యోగీ.. మమ్మల్ని చూసి నేర్చుకోండి

మా రాష్ట్రానికి రావాలని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఆహ్వానిస్తున్నా. మీరు మా నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఇక్కడికొచ్చి ఇందిర క్యాంటీన్, రేషన్ షాపులను పరిశీలించండి. గతంలో మీ రాష్ట్రంలో సంభవించిన ఆకలి చావుల సమస్య పరిష్కారానికి ఇది దోహదపడుతుంది.

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య

శ్రీవారి సర్వదర్శనానికి 8గంటలు

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి 8, దివ్యదర్శనానికి సుమారు 2గంటల సమయం పడుతోంది. మంగళవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో సోమవారం లాటరీ ద్వారా జారీచేసే టికెట్లు.. కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25 ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి w w i n లో సంప్రదించాలి. . c

- ఆంధ్రజ్యోతి, తిరుమల

Dwaraka



లోకేశ్‌ను సన్మానిస్తున్న కిడారి సర్వేశ్వరరావు, గిడ్డి ఈశ్వరి

రియల్ టైం గవర్నెన్స్‌తో

పరిష్కారం వేగవంతం

- అన్ని పంచాయతీలకు 10 స్టార్ రేటింగే లక్ష్యం
- 3,300 కోట్లతో వాటర్‌గ్రిడ్, ఇంటింటికీ కొళాయి: లోకేశ్

అనంతగిరి/అనంతగిరి రూరల్ (విశాఖ జిల్లా), జనవరి 7: ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రియల్ టైం గవర్నెన్స్‌ను అమలుచేస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్-గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖ ఏజెన్సీ అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ బగ్మారవలస గ్రామంలో ఆదివారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1100 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటూ, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామా ల్లో ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో రూ.3,300 కోట్లతో వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటుచేస్తున్నామని వెల్లడించారు. 2019 మార్చి నాటికి అన్ని పంచాయతీలకు పది స్టార్లు వచ్చేలా ప్రణాళికలను అమలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ అంత్యోదయలో భాగంగా దేశంలో 83 పంచాయతీలకు మంచి రేటింగ్ ఇవ్వగా, వాటిలో 33 పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం మనకు గర్వకారణమని తెలిపారు.

బాక్సైట్ జోలికి వెళ్లబోం

విశాఖ మన్యంలో బాక్సైట్ ఖనిజం తవ్వకాలకు అనుమతి ఇవ్వడం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకులోయ (పెదలబుడు పంచాయతీ)ను దత్తత తీసుకున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా సత్యదూరమని లోకేశ్ స్పష్టంచేశారు. బాక్సైట్ తవ్వబోమని సీఎం ప్రకటించారని, మాట తప్పే ప్రసక్తేలేదని ఆయన స్పష్టం చేశారు.

మద్యం మింగిన ప్రాణం

- స్కూటీని ఢీకొన్న కారు
- జూనియర్ ఆర్టిస్ట్ మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- జూబ్లీహిల్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. నిందితుడి అరెస్టు

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్నేహితులు ఇచ్చిన పార్టీలో పీకలదాకా మద్యం తాగిన వ్యక్తి.. అర్ధరాత్రి కారును తీసుకొని రోడ్డు మీదికొచ్చాడు. ఎలా నడుపుతున్నాడో.. ఎటు వెళ్తున్నాడో తెలియనంతంగా మత్తులో కారును వేగంగా పోనిచ్చాడు. అలా అడ్డగోలుగా డ్రైవ్ చేస్తూ ఎదురుగా వెళుతున్న స్కూటీని బలంగా ఢీ కొట్టాడు. మృత్యుశకటంలా దూసుకొచ్చిన కారు తాకిడికి ఆ స్కూటీపై వెళుతున్న ముగ్గురు యువతులు తలో దిక్కు ఎగిరిపడ్డారు. తలకు బలమైన గాయమై, తీవ్ర రక్తస్రావం కావడంతో ఒక యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మిగతా ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో ఒకరు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విధంగా తప్పతాగి వాహనం నడిపిన ఒక్కడి నిర్లక్ష్యం మూడు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది! హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో శనివారం అర్ధరాత్రి ఈ ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. నిందితుడిని పంజగుట్టకు చెందిన విష్ణువర్ధన్‌గా గుర్తించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెంకు చెందిన మస్తానీ జూనియర్ ఆర్టిస్టు. పలు సినిమాల్లో నటించినట్టు సమాచారం. శ్రీనగర్‌కాలనీలో స్నేహితురాళ్లు వైజాగ్‌కు చెందిన



మృతురాలు మస్తానీ



కోమాలో అనూషా రెడ్డి

అనూషా రెడ్డి, ప్రియతో కలిసి ఉంటోంది. రెండు రోజుల క్రితం మస్తానీ కూకట్‌పల్లిలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లింది. శనివారం రాత్రి ప్రియ, అనూషారెడ్డి స్కూటీ మీద కూకట్‌పల్లికి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి ముగ్గురు కలిసి శ్రీనగర్ కాలనీకి వచ్చేందుకు స్కూటీ మీద జేఎన్‌టీయూ, మాదాపూర్ మీదుగా బయలు దేరారు. అనూష వాహనాన్ని నడుపుతుండగా.. మధ్యలో మస్తానీ, వెనుక ప్రియ కూర్చున్నారు.

పది నిమిషాల్లో చేరుకుంటారనగా..

మరో పదినిమిషాల్లో ముగ్గురు గమ్యస్థలానికి చేరుకుంటారనగా ఘోరం జరిగిపోయింది. అర్ధరాత్రి 1:30 గంటలకు జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10 డైమండ్ హౌస్ ప్రాంతంలో వీరు వెళుతున్న స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. తర్వాత అదే వేగంతో దూసుకెళ్లి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మస్తానీ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందింది. అనూష,



ప్రమాదానికి కారణమైన కారు



విష్ణువర్ధన్

ప్రియలకు తీవ్ర గాయాలయ్యాయి. అనూష కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. అనూష పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. కాగా ప్రమాదానికి కారణమైన విష్ణువర్ధన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు హిమాయత్‌నగర్‌లో ఓ ప్లే స్కూల్ నిర్వహిస్తున్నాడు. మాదాపూర్‌లో స్నేహితులు ఇచ్చిన పార్టీకి హాజరై ఆ మత్తులో కారు నడిపిన్నట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయగా 206 బ్లడ్ ఆల్కాహాల్ కంటెంట్ ఉన్నట్టు తేలింది. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు మస్తానీ, గాయపడిన అనూష, ప్రియలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



తిరుపతిలో రతన్‌టాటాకు స్వాగతం పలుకుతున్న కేశినేని నాని

తిరుమలలో రతన్ టాటా

- స్వాగతం పలికిన ఎంపీ కేశినేని

తిరుపతి/తిరుమల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టాటా గ్రూప్స్ మాజీ చైర్మన్ రతన్‌టాటా ఆదివారం తిరుమలకు చేరుకున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని తిరుపతి విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు రతన్‌టాటాతో మాట్లాడటానికి ప్రయత్నించగా తాను వ్యక్తిగత పనిపై తిరుపతికి వచ్చానని ఆయన తెలిపారు. ప్రత్యేకించి చెప్పడానికి ఏమీ లేదని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. రతన్‌టాటాతోపాటు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, టాటా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్. వెంకటరమనన్ కూడా తిరుమల పర్యటనకు రావడంతో టాటా గ్రూప్ సంస్థల ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలపై చర్చించే అవకాశం ఉంది. టాటా గ్రూప్ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలోని 265 గ్రామాలను దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎంపీ కేశినేని నానితో చర్చించే అవకాశం ఉంది. అలాగే కొన్ని నెలల క్రితం టీటీడీ భాగస్వామ్యంతో తిరుపతిలో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మించడానికి టాటా గ్రూప్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన భూమిని టీటీడీ ఉచితంగా ఇచ్చింది. దీనిపై కూడా టీటీడీ అధికారులతో రతన్‌టాటా చర్చించే అవకాశం ఉంది.

'ఎయిమ్స్'కు శంకుస్థాపన

- 6 కోట్లతో తాత్కాలిక భవనాలు

అమరావతి, (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కోసం రూ.6 కోట్లతో తాత్కాలిక పరిపాలన భవనం, తరగతి గదులను ప్రభుత్వం నిర్మిస్తోందని, వైద్య విద్యార్థుల కోసం చేస్తున్న కృషిని అభినందిస్తున్నానని స్పీకర్ కోడెల శివప్రసాద్ అన్నారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నిర్మించదలచిన ఎయిమ్స్ తాత్కాలిక భవనాలకు మంత్రి కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ కళాశాలల్లో సిద్ధార్థ మెడికల్ కాలేజీది బెస్ట్‌గా గుర్తింపు పొందిందన్నారు. జన్మభూమి స్ఫూర్తితో రూ.10లక్షల వ్యయంతో వైద్య విద్యార్థుల కోసం అత్యాధునిక జిమ్ ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను అభినందించారు. త్వరలో సిద్ధార్థ ఎయిమ్స్ తరగతులను ప్రారంభిస్తామని కామినేని చెప్పారు.

సాగు కలిసిరాకే వలసలు

- అనుబంధ పరిశ్రమలతో మార్కెటింగ్ అవకాశాలు: పాలేకర్

గుంటూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో గ్రామాల నుంచి యువత, వ్యవసాయ కూలీలు, రైతులు పట్టణాలకు వలస వెళుతున్నట్లు ప్రకృతి సేద్యం, పెట్టుబడిలేని సాగు సృష్టికర్త సుభాష్ పాలేకర్ అన్నారు. గుంటూరులో ఆదివారం ఎనిమిదో రోజు శిక్షణా తరగతుల్లో వ్యవసాయ రంగం పటిష్ఠంగా ఉంటే ఎంతో మందికి ఉపాధి సౌకర్యాలు మెరుగుపడతాయని చెప్పారు. అనుబంధ పరిశ్రమలు స్థాపించి రైతులే నేరుగా మార్కెట్‌లో అమ్ముకునే అవకాశాలు ఉన్నాయని పాలేకర్ వివరించారు. మహారాష్ట్రలో ప్రకృతి సేద్యం, పెట్టుబడి లేని వ్యవసాయంపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని గవర్నర్ చెన్నమనేని విద్యాసాగరరావు ప్రకృతి సేద్యం సృష్టికర్త సుభాష్ పాలేకర్‌ను ఆహ్వానించారు. గుంటూరులో ఉన్న పాలేకర్‌తో ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు.

పాలేకర్ వ్యాఖ్యలు సరికాదు: ఏఈవోలు

అమరావతి, జనవరి7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాస్త్రం, శాస్త్రవేత్తలను కించపరిచేలా మాట్లాడిన ప్రకృతి సేద్య నిపుణుడు సుభాష్ పాలేకర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఏపీ వ్యవసాయ విస్తరణాధికారుల అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆయన వ్యాఖ్యలు అర్థరహితమని, గతంలో కాకినాడ, తిరుపతిలో ప్రకృతి సేద్య శిక్షణల్లో కూడా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అవసరం లేదన్నట్లు మాట్లాడారన్నారు.

కాలేయ వ్యాధి బాధితురాలికి

ఏపీఎండీసీ 24 లక్షలు



కాలేయ వ్యాధిపై ఏపీఎండీసీ ఎండీకి వివరిస్తున్న బాధితురాలి తల్లి హరిత

ఓబులవారిపల్లె, జనవరి.7: గనుల ప్రభావిత ప్రాంతాల్లో నివాసం కారణంగా కాలేయ వ్యాధికి గురైన ఓ బాలికకు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) చేయూత అందించింది. కడప జిల్లా ఓబుళవారిపల్లె మండలం మంగంపేట పునరావాస కాలనీకి చెందిన మినుకు హరిత కుమార్తె సుధారాణి కాలేయ వ్యాధితో బాధపడుతోంది. చికిత్సలకు రూ.24లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆదివారం మంగంపేట వచ్చిన సంస్థ ఎండీ వెంకయ్య చౌదరి దృష్టికి ఆమె తన కుమార్తె సమస్యను తీసుకెళ్లింది. అక్కడికక్కడే స్పందించిన ఆయన.. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.17 లక్షలు, ఏపీఎండీసీ ద్వారా రూ.7 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

12న నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ40

శ్రీహరికోట(సూళ్లూరుపేట), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) విజయాశ్వం పీఎస్ఎల్వీ వాహకనౌక ఈనెల 12న నింగిలోకి దూసుకుపోనుంది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ ప్రథమ ప్రయోగ వేదిక నుంచి ఉదయం 9.28 గంటలకు ఈ ప్రయోగం జరపనున్నారు. ఇందులో భాగంగా పీఎస్ఎల్వీ-సీ40 కౌంట్‌డౌన్‌ను 11న ఉదయం 5.28 గంటలకు ప్రారంభిస్తారు. ఈ రాకెట్ ద్వారా మనదేశ భూ పరిశీలన ఉపగ్రహం కార్టోశాట్-2ఈఆర్‌తో పాటు ఒక మైక్రో, మరో నానో ఉపగ్రహాన్ని, 28 విదేశీ నానో ఉపగ్రహాలను రోదసిలోకి చేరవేయనున్నారు. భూ పరిశీలనను మరింత బలోపేతం చేసే దిశగా ప్రస్తుతం ప్రయోగిస్తున్న ఉపగ్రహంలోని ఆధునికమైన మల్టీ స్పెక్ట్రల్ కెమెరా అత్యంత స్పష్టమైన దృశ్యాలను అందజేయనుంది. రక్షణరంగం అవసరాలకు కూడా దీన్ని వినియోగించనున్నారు.

కవిత్వమే వెన్నెముక అయిన కవి



మాతో పెట్టుకోకండి
మేం కవులం (హెచ్చార్కె: అబద్ధం-పుట 46)

కవి, కథకుడూ, విమర్శకుడూ, పాత్రికేయుడూ అయిన రచయిత హెచ్చార్కె. 1970 తర్వాత మార్క్సిస్టు దృక్పథంతో ఆధునిక తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారు హెచ్చార్కె. కవి నిర్వహించవలసిన సామాజిక కర్తవ్యం, కవికి ఉండవలసిన నిబద్ధత, వస్తువును కవిత్వంగా మలచుకునే రసాయనిక విద్య, కవి అభిప్రాయాన్ని పాఠకునికి చేరవేయగల శిల్పకళ- వీటన్నిటిపట్ల హెచ్చార్కె నిరంతరం మెలకువతో ఉండే కవి. తానేమి రాస్తున్నాడో, తానెందుకు రాస్తున్నాడో తెలిసిరాసే కవి జ్ఞాత శిల్పి. హెచ్చార్కె అలాంటి జ్ఞాతశిల్పి. 'గుండె దండోరా' (1979) మొదలుకొని 'రగిలే వీలుందని' (2015) దాకా దాదాపు పది కవిత్వ సంపుటాలలో గత అయిదు దశాబ్దాల సామాజిక పరిణామాలకు కవిత్వ రూపం ఇచ్చారు హెచ్చార్కె. సామాజిక వాస్తవికతను ఎత్తిచూపడం వరకే అయితే ఇవాళ హెచ్చార్కె కవిత్వాన్ని గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉండేదికాదు. ఆయన కవిత్వంలో ప్రశ్న, ప్రతిఘటన, నిలదీత, హెచ్చరిక వంటివి పాఠకుణ్ణి తాకుతూ ఉంటాయి. వాటికి సమకాలీన ప్రాసంగికత ఉంది. అందుకే ఆయన కవిత్వాన్ని ఇవాళ చర్చించుకోవాలి.

"యేం- యెందుకంత ఆశ్చర్యం?/ పొలం దున్నడానికి నాగలి పట్టిన వాడు/ పంటను కాసుకోడానికి వడిసెల పట్టడా/ పోట్లగిత్తలకు ముకు తాడేసినవాడు/ అంతెకురాని రాజ్యం కొమ్ములు వంచడా?" (నకులుని ఆత్మకథ: పుట 41)

ఉద్యమ కవిది తిరుగుబాటు తత్వం. ఆ తిరుగుబాటు కూడా సైద్ధాంతికంగా, తార్కికంగా ఉంటుంది. ఉడుకుమోతుగా, దుందుడుకుగా ఉండదు. ఉద్యమ కవి కోరుకునేది సమాజంలో మార్పు. పాత వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థ. ఉన్న దానిని నిర్మూలించడం, కొత్త దానిని నిర్మించడం అంత సులభమైన పని కాదు. మొన్నటికి మొన్న చూశాం. తెలంగాణ రాష్ట్రం వేలమంది యువకుల బలిదానంతోనే ఏర్పడింది. చండీయాగాల వల్లకాదు. అలాంటిది ఒక సమాజమే సమూలంగా మారాలంటే ఎందరో త్యాగం చేయాలి. ఉద్యమ కవి త్యాగాలకు కావాల్సిన భావసంస్కారాన్ని ప్రచారం చేస్తాడు.

"వెదురు వనాలు డిస్టర్బ్ కాకుండా/ లోకానికి వేణువులుండవు/ త్యాగాల చాళ్ళు పోస్తేగాని/ సేద్యం చేయడానికి లేదు.../ క్షతగాత్రుడు కానివాడు/ రణ తంత్రం నేర్వలేడు" (అబద్ధం: పుట 44)

సామాజిక పరివర్తనను కోరే కవి, మరో ప్రపంచాన్ని ఆహ్వానించే కవి, వర్తమానంలో మానవ క్రౌర్యం సృష్టించే బీభత్సాన్ని సహించడు. వర్తమాన సామాజిక రుగ్మతలను ఎండగట్టడం ద్వారానే భవిష్యత్ సమాజ నిర్మాణానికి కవి పునాది వేస్తాడు. భారతదేశ లౌకిక స్వభావాన్ని హత్యచేసిన ఉదంతాలలో గుజరాత్ మారణకాండ ప్రధానమైనది. జాతీయస్థాయిలో గుజరాత్ అయితే, అంతర్జాతీయ స్థాయిలో సద్దాం ఉరితీత మహాక్రౌర్యం. హెచ్చార్కె 'గుజరాత్' కవితలో అప్పటి అమానవ పరిణామాన్ని తీవ్రంగా విమర్శించారు.

"యిదిగో యిక్కడ కొన్ని యిళ్ళు వుండేవి... ... ...
యిక్కడ వొక వూరుండేది" (నకులుని ఆత్మకథ: పుటలు 89, 90) అంటూ హెచ్చార్కె గుజరాత్ బీభత్సాన్ని చిత్రించిన తీరు పాఠకుని తీవ్రంగా చలింపచేస్తుంది. అలాగే ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న సమయంలో హెచ్చార్కె సద్దాం హుసేన్‌కు మద్దతుగా కవితలు రాశారు: "యిరాక్‌లో జరుగుతోంది ఒక మామూలు యుద్ధం కాదు/ ప్రథమ ప్రపంచ స్వాతంత్ర్య సంగ్రామం" అని నిర్వచించారు. అమెరికా నియంతృత్వం, దానిని అతిచిన్న దేశమైన ఇరాక్ ప్రతిఘటించడం-- మొత్తం ఈ కవితలో అక్షరాకృతి ధరించాయి.

ప్రపంచీకరణ భారతీయుల బతుకుల్లోకి నెట్టుకొచ్చి స్థిరపడిపోయిన నేపథ్యంలో చాలామంది రచయితలు తమ గ్రామీణ మూలాలను వెతుక్కున్నారు. హెచ్చార్కె 1970లనుంచీ ఉద్యమ కవితలు రాస్తున్నా 2012లో తన పల్లెలోకి మారి 'ఇంకేమీ వద్దు' కవిత రాశారు. అమ్మ పొలంలోకి పోతూ తన కొడుక్కి జాగ్రత్తలు చెప్పి వెళ్ళడమే ఈ కవిత. ఈ కవితలో పిల్లలు ఆటలు మరిగి ఇంటిని నిర్లక్ష్యం చేసే ధోరణి ఒక వైపు. తన బిడ్డల కోసం తల్లి చేసే శ్రమ, ఆమె పడే తపన ఇంకో వైపు ఏక కాలంలో ఆవిష్కరించాడు కవి:

"కలుపు తీసే అమ్మ, గడ్డి కోసే అమ్మ/ నీ ధ్యానాల్ని ధ్యానిస్తూ, నీ కలలను కంటూ/ కొడవలి పిడి రాపిడి చేతులతో వచ్చేసరికి/ తన కోసం ఇల్లు కొంచెం శుభ్రంగా ఉంచు" (గొడ్డలి బుజం: పుట 50)

హెచ్చార్కె కవిత్వంలో అంతర్జాతీయ చరిత్ర వస్తువై వుంటుంది. అది అందరు పాఠకులకూ తెలిసినది కాదు. అలా తెలియని ప్రదేశాల చిత్రణల్ని దాటుకొని ఇలాంటి కవిత దగ్గరికి చేరుకున్న పాఠకుడికి 'అమ్మయ్యా! కవి నా దగ్గరకు వచ్చాడు' అని అనిపిస్తుంది. ప్రతీకలు, భావ చిత్రాలు, పదచిత్రాలు ఉపయోగించే కలం పాటవంగల హెచ్చార్కె అవేవీ లేకుండానే కవిత రాసి పాఠకుణ్ణి ఆలింగనం చేసుకోగలడనడానికి ఇలాంటి కవితలు నిదర్శనాలు.

హెచ్చార్కెకు ఉద్యమ జీవితముంది. ఉద్యమేతర జీవితమూ ఉంది. ఆయన కవిత్వంలో ఈ రెండు పార్శ్వాలూ కనిపిస్తాయి. ఏ కవిత్వం రాస్తున్నా ఆయన దృక్పథంలో ఒక అవిచ్ఛిన్నత కొనసాగుతూనే వస్తున్నది.

ఒక ప్రాంతానికి చెందిన కవి ఎన్ని జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ విషయాల మీద కవిత్వం రాసినా, తాను పుట్టి పెరిగిన ప్రాంతం గురించి రాయకుండా ఉండడం సాధ్యం కాదు. కర్నూలు జిల్లాలో పుట్టిన హెచ్చార్కె కవిత్వానికి అంతర్జాతీయ భూమిక ఉంది. రాయలసీమ భూమిక అందులో ఒక భాగం. 'రాయి రాయి రాసుకుంటున్నాయి' కవిత రాయలసీమ కరువు, ఫాక్షనిజాలను చిత్రిస్తూ, ఇంకా రాతికి సంబంధించిన అనేకాంశాలను ప్రస్తావించింది: "ఉద్రిక్త సాయంత్రాలు మిద్దెల మీద కుప్పలుకుప్పలుగా చేరి/ మిద్దె నుంచి మిద్దెకు రక్త రాయబారాలు నడిపించే రాళ్ళు (వానలో కొబ్బరి చెట్టు: పుట 40) - అన్న వర్ణన కడప కర్నూలు జిల్లాల్లో తొలినాటి ముఠా కక్షలను ధ్వనిస్తున్నది. రాయలసీమ సమస్య అవకాశవాదులపరం కాకూడదని ఆయన ఆకాంక్ష. "వాడు అమ్మితే వీడికి, వీడు అమ్మితే వాడికి దత్తమై పోవద్దని" రాయలసీమ దత్తమండలంగా మారిన ప్రహసనాన్ని దెప్పిపొడిచారు.

మనుషులు అనేక కారణాల చేత అనేక రకాలుగా మరణించడం నిరంతర ప్రక్రియ. మరణాలలో ఆత్మహత్యలు కృత్రిమ మరణాలు. ప్రజా దృక్పథం గల కవి ఆత్మహత్యల్ని ఆమోదించడు, అభినందించడు. గత ముప్ఫై ఏళ్ళలో ప్రపంచీకరణ మాయ కమ్మిన భారత దేశంలో రైతులు మొదలు అనేక రంగాల ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. హెచ్చార్కె భౌతికవాద, మానవీయ కవిగా బలవంతపు చావుల్ని వ్యతిరేకిస్తూ, వారిస్తూ 'చనిపోయిన వాళ్ళు చూస్తుంటారు' కవిత రాశారు.

"నువ్వు వుండాల్రా నాయనా నువ్వు వుండాలి/ నీ అద్భుత అమాయకత్వం బతికుండాలి.../ వీర స్వర్గం లేదు అమరత్వం లేదు/ పోరాటవే గెలుపు లేదా ఓటమి/ ఓడిపోతే మళ్ళీ పోరాడాలి/ పోరాడడం కోసం నువ్వుండాలి" (వానలో కొబ్బరిచెట్టు: పుట 40)

- తల్లి ఉగ్గుపాలతో శౌర్యం నూరిపోసినట్లు కవిత రాయడం హెచ్చార్కె దగ్గర ఎక్కువ కనిపిస్తుంది.

మానవత్వం గల కవి జీవితాన్ని గాఢంగా ప్రేమిస్తాడు. అందుకే ఆ కవి నిరంతరం జీవన సంక్షోభాన్ని దృశ్యాలు దృశ్యాలుగా వర్ణిస్తాడు. కష్టజీవుల జీవన వేదనను రాగాలు రాగాలుగా వినిపిస్తాడు. సరిగ్గా అర్థం చేసుకోకుంటే అది నిరాశావాదమేమో అనుకునే ప్రమాదముంది. హెచ్చార్కె కవిత్వం నిండా బాధామయ జీవుల ఆర్తనాదాలు వినిపిస్తాయి. వాళ్ళతో ఆయన మాట్లాడతాడు. వాళ్ళతో మాట్లాడిస్తాడు. శ్రామికుల్ని కవి రెండు పాదాల్లో మన కళ్ళముందుంచాడు 'తలలు తెగిపడుతున్నప్పుడు' కవితలో: "కళపెళ మరుగుతున్న బతుకు కల్వంలో పనే పద్యం, పనే మనిషి,/ పనికి పనికి మధ్య కాసేపు ఆగి చెమట తుడుచుకోడానికి కబుర్లు" (రగిలే వీలుందని: పుట 83) - పనిని పద్యంగా భావించడం శ్రమ జీవన సౌందర్య కథనమే.

కవి సత్యాన్ని నమ్ముకొని బతుకుతాడు. సత్యాన్ని కల్పనతో జోడించి కవిత కడతాడు. పాలకులు సత్యాన్ని దాచిపెట్టి కవులను అసత్యవాదులని నిందిస్తారు. వీలయితే నిర్బంధిస్తారు. కవి శ్రుతిమించాడనిపిస్తే తుదముట్టిస్తారు. పాలకులకు దబోల్కర్, గోవింద పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్ వంటి వాళ్ళ రాతలన్నీ అబద్ధాలే. అందుకే వాళ్ళను ముగించేశారు. కవికి రచయితకు, మేధావికి సత్యమైనది అసత్యవాదులకు నచ్చదు.

"కవులు ఊహాలోక విహారులు/ నిజాలు చెప్పలేరు" (రగిలే వీలుందని: పుట 78) - అని హెచ్చార్కె 'నువ్వు' కవితలో అనడంలో పెద్ద ధ్వని ఉంది. అధిక్షేపముంది.

హెచ్చార్కె కవిత్వంలో అందమైన కంఠస్వరం వినిపిస్తూ ఉంటుంది. అది కంటికి కనిపించే సామాజికాంశాన్ని వ్యాఖ్యానించి పాఠకుని కదిలిస్తుంది. ఆయన కవిత్వాన్ని చారిత్రక క్రమంలో చదివితే సామాజికంగా గత నాలుగున్నర దశాబ్దాలలో వచ్చిన పరిణామాలు కవిత్వాక్షరాలై దర్శనమిస్తాయి. రెండోది, కవిగా హెచ్చార్కె ఎలా పరిణామం చెందారో అర్థమౌతుంది. ఆయన మాటల్లో ఆయనలో పద్యముందని తెలుసు. ఆయన పద్యాన్ని కంటున్నానని తెలిసి పద్యాన్ని కంటారు. రైతు మంచి విత్తనాలను సేకరించినట్లు, హెచ్చార్కె మంచి కవితల్ని రాయడానికే ప్రయత్నిస్తారు. ఎన్ని కవిత్వపు పాటలు పాడినా అలసిపోని కోయిలే కవి. హెచ్చార్కె అలాంటి కవి. ఆయన కవిత్వం అమాయకుల పక్షం. అమ్ముడుపోయే వాళ్ళ పక్షం కాదు:

కవి ఎవరికీ వీరపత్ని కాడు
వారికీ వీరికీ వీరతిలకాలు దిద్ది
యుద్ధభూములకంపడానికి
పట్టెమంచం, పసుపు ముద్ద చూపి
ఉన్మత్తశిఖరాలెక్కించడానికి
కవి దధీచి
కవిత్వం వాడి వెన్నెముక (అబద్ధం: పుట42)

■ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

చిన్నప్పటి బడి

నలభై ఏళ్ళ తర్వాత
మళ్ళీ ఇక్కడికివస్తాను
ఎప్పటిలానే నది ఒడ్డు మీద
నిలబడ్డ వూడల మర్రి.

పియానో నించి రాలిపడ్డ స్వరాల్లా
దీర్ఘ వృత్తాకార పత్రాలగుసగుసలు

శలవ రోజు కాబోలు
ఖాళీ అయిపోయిన
వాద్య నిలయంలా వుంది బడి.

అదే దృశ్యం
ద్వీప సమూహంలా నిలబడ్డ చెట్లు
చెట్ల కొమ్మల గ్రంథాలయాల నిండా
కొత్తగా ప్రచురింప బడ్డ ఆకులు
నా బాల్యపు ప్రాంగణం ముందు
వణుకుతూ నిలబడ్డ హల్లులా నేను.

మాసిన గడ్డం లాటి పచ్చిక మీద
వరి కంకుల జడలు వేసుకుని
ఆటలాడిన ఆడపిల్లలు
అతకని సంధిలా జారిపోయే నిక్కర్లని
పైకి లాక్కుంటూ మగ పిల్లలు
రూపకాలన్నీ బహిష్కరించినా
ఎంతకీ వదలని బాల్యపు జ్వరం.

ఈ బడి ఆవరణం నించి మొదలై
సముద్రమంత వ్యాపించిన జిల్లాలా
ఆకాశమంత వ్యాపించిన రాష్ట్రంలా
కవిత్వంగా రూపాంతరం చెందిన నా బాల్యం.

గత రుతువు పంటను
ఇపుడు నూరుతున్న రైతులా
ఆకులకన్నా ఎక్కువ కాలం
బతికిన ఒక్కో గాయాన్నీ
బయటకు తీసి
పేర్చుకోడం కన్నా పెద్ద శిక్ష ఏముంటుంది ?

ఇసక లంకల్లో
కాలవ మలుపుల్లో
ఆడుకుంటున్న అచ్చులన్నిటినీ
కవిత్వంగా రాయడం కన్నా
పెద్ద పరీక్ష ఏముంటుంది?

■ ఆకెళ్ళ రవి ప్రకాష్



యువ కవి సమ్మేళనం

అలిశెట్టి ప్రభాకర్ యాదిలో 'తెలంగాణ సాహితి' ఆధ్వర్యంలో 'యువత-భవిత' అంశంపై యువకవి సమ్మేళనం జనవరి 9 సా.5.30ని.లకు షోయబ్ హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్ నందు జరుగుతుంది. అధ్యక్షత అనంతోజు మోహన్ కృష్ణ, ముఖ్య అతిథి జయధీర్ తిరుమల రావు.

- తెలంగాణ సాహితి

చాసో స్ఫూర్తి సాహితీ పురస్కారం

చాసో 103వ పుట్టిన రోజు సందర్భంగా చాసో స్ఫూర్తి పురస్కారాన్ని ప్రసిద్ధ ఒడియా రచయిత గౌరహరి దాస్ అందుకొంటారు. పురస్కార ప్రదానం జనవరి 17 సా.6గం.లకు చాసో సాహితీ వేదిక, గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం, విజయనగరం నందు జరుగుతుంది. సభలో శ్రీరమణ, జి.వి. పూర్ణచందు, బిమ్మేశ్వర్ సాహు తదితరులు పాల్గొంటారు.

- చాగంటి తులసి

కొత్తపల్లి నరేంద్రబాబు స్మారక పురస్కారం

ఫేస్‌బుక్ వేదికగా 'కవిసమ్మేళనం సాహిత్య వేదిక' స్థాపించిన కొత్తపల్లి నరేంద్ర బాబు మరణించారు. ప్రతి యేటా వారి పేరుతో ఇవ్వనున్న పురస్కారానికి 2016-2017 సంవత్సరాలలో వచ్చిన కవిత్వ సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. జనవరి 31లోగా నాలుగు ప్రతులను: కొత్తపల్లి సురేష్ (అక్షర మాలి), ఇం.నెం.6-1-149-1, జన్మ భూమి రోడ్డు, లక్ష్మీనగర్, అనంతపురం-515001కు పంపాలి. విజేతలకు ఫిబ్రవరి రెండవ వారంలో బహుమతి ఉంటుంది.

- కవిసమ్మేళనం సాహిత్య వేదిక

చెన్నరాయ కిశోర్ పురస్కారం

నెలవంక నెమలీక సాహిత్య మాసపత్రిక, మహేంద్ర భారతి సంయుక్త నిర్వహణలో కీ.శే. చెన్నరాయ కిశోర్ పురస్కారానికి కవితలకు, సాహిత్య విమర్శనా వ్యాసాలకు ఆహ్వానం. మూడు ఉత్తమ కవితలకు, విమర్శనా వ్యాసాలకు రూ.1016, జ్ఞాపిక, శాలువలతో సత్కారం ఉంటుంది. కవితలు, వ్యాసాలు జనవరి 15లోగా ఎడిటర్, నెలవంక నెమలీక సాహిత్య పత్రిక, 15-140, పి అండ్ టి కాలనీ, శ్రీకోదండరామనగర్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ 500060కు పంపాలి. వివరాలకు 98661 71648.

- లక్కరాజు దేవి

ప్రాణపుష్పం

గుండె పుష్పాన్ని ఆత్మ జ్వాల మీదా వొంచి
రాత్రంతా కలల్ని తోడి
దేహపు రూప రేఖల్ని రోజూ ధ్వంసం చేసుకుంటూ
నిబద్ధ దుఃఖాన్ని ఖురాన్ మడతల్లో దాచి
నిద్ర స్తంభాన్ని నిర్భయంగా కూల్చుకుని
ప్రాణ అమరికల రహస్యాన్ని మూటగట్టి
ఆత్మ దీపపు వెలుగుని మాకోసమే వొంచి
నీవు మాత్రం శిలారాసులతో స్నేహం చేస్తూ
ఆకలిని నవ్వు పుష్పాలతో అలంకరించుకుని
మన ఇంటికి దీప తోరణమైనావు

అమ్మీ...
భగవంతుడు నాకు అన్నీ ఇచ్చాడు
హే అల్లా... శుక్రియా అని
సహనంతో నిరీక్షణ గలదానివై ప్రార్థించావు

కానీ అమ్మీజాన్!
ఆ నాలుగ్గోడల మధ్య నుంచి బయటికొచ్చి
ఈ ఆకాశపు కప్పు కింద నిలబడే
హిమ్మత్‌ని నీ అల్లా ఎందుకివ్వలేదో?
ప్రేమవాకిలి లోపల నీవుంటే
తలుపు తట్టే శక్తిలేని వాళ్ళమై
నువ్వు ఊదిన ఊపిరి ఛాయలతో
నిర్భయంగా బతికి పోతూ
నువ్వు రాల్చిన పుప్పొడి కాంతిలో తిరిగి
ఆ గది గోడల మూలాల్ని వెతకలేని దౌర్భాగ్యులం
నీ నిద్రని శాఖలుగా చీల్చి మా మీద కప్పి
నువ్వు మాత్రం రాత్రికి పగటికీ తేడా తెలీకుండ
ఈ మట్టి బొమ్మలు పగల కూడదని
నీ కన్నీటి బిందువుల్ని తావీజుల్లో చుట్టి
మా కంఠాల్ని అలంకరించావు

అమ్మీ! ఇంత చేసినా ఇంద్రధనుసులో
నీ జ్ఞాపకాల సుర్మా రంగు ఎందుకు లేదో!
నీ ప్రాణ హారాన్ని మాకు బహుమతిగా ఇచ్చి
అలావా లాంటి హృదయాన్ని
హఠాత్తుగా ఆర్పుకుని ఎలా నిష్క్రమించగలిగావ్
ప్రాణం రోజూ తెగుతున్నా కూడా
బ్రతుకు ముల్లుని ముద్దాడి సంచరించావు
ప్రాణ సంచిలోని పావురాన్ని
రాతిగుమ్మం అవతలి నుంచి
అంత నిర్భయంగా ఎలా ఎగురవేయగలిగావు తల్లీ!

నువ్వెళ్ళిన తరువాత ఓ రోజు
భయం భయంగానే నీ గదిని చీల్చి
నీ యాపిల్ పళ్ళ చెక్క పెట్టెలోని
రహస్యాన్ని చూశాను
రెండు చీరల ఆత్మ, ఒక్క
బురఖా దేహమూ తప్పించి
మరిక ఏదీ మిగలని నీ దీనత్వమే కనిపించింది

నువ్విచ్చిన వెన్నెముక చీలి
కంఠంలో గుచ్చుకుంటోంది తల్లీ
నాకిప్పటికీ అర్థం కాదు
నీ గదిలో అత్తా, పిన్నమ్మ, అక్క
మీరు ముగ్గురు కలిసి కూలిపోతున్నప్పుడు
వినిపించే అసహాయ ఘోషలు
ఎంతటి విషాదాన్ని ప్రకటించేవో
ఆ వేదన ఇప్పుడు నన్ను
దుఃఖపు పేగుతో ఉరి వేస్తున్నది

కానీ అమ్మీజాన్!
మక్కా చూడాలనే నీ ఆఖరి ఖాయిష్ ని
పూర్తి చేయలేని ఈ వ్యర్థుణ్ణి
మాఫ్ కరో అమ్మీ!

■ షేక్ ఖాదర్ షరీఫ్

(డిసెంబర్ 25, 2017న గుండెపోటుతో అకాలమరణం పొందిన కవి ఖాదర్ షరీఫ్ చివరి కవిత ఇది.)



భయమైనా, రహస్యమైనా వ్యవస్థ సృష్టే!



రేవతి కుట్టి

కుట్టి రేవతి. పేరున్న తమిళ కవి. సిద్ధ మెడిసిన్ డాక్టరు, గీత రచయిత. ఇరవైయ్యేళ్లుగా కవిత్వం రాస్తున్న ఈమె రచనలు ఇప్పటివరకు పదహారు పుస్తకాలుగా వెలువడ్డాయి. అందులో పదకొండు కవితా సంకలనాలు. స్త్రీ దేహం చుట్టూ వుండే పితృస్వామ్య సంస్కృతినీ, రాజకీయాల్నీ రేవతి కవిత్వం బట్టబయలు చేసింది. 2002లో వచ్చిన 'ములైగళ్' (రొమ్ములు)తో రేవతి సంచలన రచయితగా తమిళ సాహిత్యాన్ని కుదిపింది. ఆమె కవిత్వంలో వుపయోగించిన రొమ్ములు, యోని, స్వీయమైథునం వంటి పదాలతో నిండిన భాషని తట్టుకోలేక రేవతిని కొరడాలతో కొట్టాలనీ, చెన్నై మౌంట్ రోడ్‌లో పుస్తకంతో పాటు ఆమెని కూడా తగలబెట్టాలని ఛాందస వాదులు పిలుపునిచ్చారు. ఒక సాయంత్రం ఆమెతో గడిపే అదృష్టం దక్కినప్పుడు జరిగిన సంభాషణ ఇది:

మీ కవిత్వంలో చాలావరకు శరీరాన్ని, దాని ఉనికిని సెలబ్రేషన్‌లా వ్యక్తపరుస్తారు. ఎందుకు?

ఈరోజుల్లో ఆడవారు ఫేస్బుక్‌లో ఋతుక్రమాన్ని ఆడవారికి ఒక శాపంగా రాస్తున్నారు. ఋతుక్రమం అనేది మన శరీర నిర్మాణంలో భాగం. స్త్రీల్లో రుతుస్రావం అనే ప్రక్రియ ఉండాలి. స్రావం జరిగి ప్రతీనెలా ఆ స్థితి నుంచి బయటపడాలి. అలానే కాన్పు. మనం కాన్పును నొప్పిగా చూస్తాము. కానీ అది physiology, cycle of growth. 'Breasts' అని నా మొదటి సంకలనం విడుదలైనప్పుడు నాకు పాతికేళ్లే. అప్పటికి ఇంత అవగాహన కూడా లేదు. కానీ ఇప్పుడు నాకు నలభై ఏళ్ళు దాటాక అర్థమవుతున్నది--నా రచనలన్నీ ఈ సృష్టి సత్యాల ఆధారంగా వచ్చినవేనని.

నిజమే.. శరీరం ఒకటే మనం మన స్వంత ఆస్తిగా చెప్పుకోగలిగింది. మన దేహం మనను మోసే ఒక వాహనం అనుకోవాలి. ఎటువంటి దేహం కావాలో కోరుకోవడానికి ఛాయస్ ఉండదు. మన దేహం పెరిగి పెద్దదయ్యి, కొందరిని సృష్టించి, కొన్ని పనులు చేసి నెమ్మదిగా వడిలిపోతుంది. సిద్ధ మెడిసిన్ ఒక మాట చెబుతుంది: "నీ దేహం ఒక ఆలయం, నువ్వే దైవానివి" అని. ఆడవారు సహజంగా సృష్టికర్తలు. పరిణామ ప్రక్రియలో మన దేహానికి ఎంతో సంబంధం ఉంది. అందుకే శరీరాన్ని సెలెబ్రేట్ చేసుకోవడం ముఖ్యం. మన శరీరాన్ని మనం తెలుసుకోగలగాలి, దాని అవసరాలను తెలుసుకోవాలి. మన దేహంలో జరిగే మార్పులను గమనించుకోగలగాలి.

ఋతు సంబంధిత విషయాల కన్నా మనం పోరాడవలసినవి మరెన్నో ఉన్నాయి. ఉదాహరణకు మేధస్సును ఉపయోగించే సందర్భాలలో మనం పదేపదే నియంత్రించబడతాము, చాలావరకు ప్రాథమిక స్థాయిలోనే త్రుంచి వేయబడతాము. నెలలో ఒకసారి వచ్చే నొప్పి దీనితో పోలిస్తే చాలా చిన్నది. స్త్రీ తన మేధస్సు పరిపూర్ణంగా ఉపయోగించుకునే అవకాశం చాలా తక్కువ. సాహిత్యంలో, రాజకీయాల్లో, ఎక్కడైనా మన ఆలోచనా సామర్థ్యం ఎప్పుడూ సరిపోదనుకుంటారు. మన పోరాటం అటువైపు సాగాలి.

శరీరాన్ని దేవాలయంలా చూడాలని మన ప్రాచీన వాఙ్మయమూ చెబుతుంది. ఆ ప్రభావం మీమీద ఉందా ?

నేను భౌతికవాదిని, మతపరమైన విషయాలకు దూరంగా ఉండాలనుకుంటాను. అవన్నీ అధికారంలో ఉన్న మగవారిచే రాయబడ్డాయి. మహాశ్వేతాదేవి నా అభిమాన రచయిత్రి. ఆమె కూడా ఎన్నో పౌరాణిక పాత్రలను వాడి స్త్రీని అర్థం చేయించడానికి ప్రయత్నించింది. కానీ నాకు సీత, సావిత్రుల దగ్గరకు వెళ్లి వారిని అర్థం చేసుకునే ఉద్దేశం లేదు. నేను సరికొత్త పాత్రలను సృష్టించదలచాను. ఇంకా చెప్పాలంటే నాకు ఈ పౌరాణిక పాత్రలకన్నా మా అమ్మమ్మని అర్థం చేసుకునే ప్రయత్నమే సబబుగా అనిపిస్తుంది. ఇదివరకటి రోజుల్లో ఆడవారికి మనలా వేరే దారులు లేవు - కవితలు రాయడమో లేక మనసుకు నచ్చిన వారితో కాసేపు మాట్లాడడం వంటివో. భర్తతో పడక పంచుకున్నా మనసులో మాటలను పంచుకోలేకపోయారు.

సాధారణంగా ఆడవారు ఫీల్ అయినా బయటపెట్టని భావాలను మీరు చెబుతారు...

(...మధ్యలోనే అందుకొని) ఆడవారిలో స్వతహాగా దాచే ధోరణి లేదు. కానీ వ్యవస్థ వారి మీద ఒత్తిడిని పెడుతుంది, కనుక దాచాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలా అది రహస్యమైపోతుంది. రచనలైనా అంతే... ఆడవారు కొన్ని విషయాలు రాయడానికి భయపడతారు. భయమైనా, రహస్యమైనా వ్యవస్థ సృష్టించినదే కాని లోపల నుంచి వచ్చినది కాదు. కానీ కాలం మారుతోంది. ఇదివరకటి రోజుల్లో కొన్ని విషయాలు ప్రస్తావించడానికే భయపడేవారు. వాళ్ళు మాట్లాడలేకపోయిన విషయాలు ఇప్పుడు మనం మాట్లాడుతున్నాం అంతే.

అందుకు మనలోని అడవిని యథేచ్ఛగా పెరగనివ్వాలి. భూమి మీద మానవ మనుగడ మారుతున్నట్లే లైంగికతకు నిర్వచనాలు ప్రతీసారీ మారుతున్నాయి! లైంగికతను పనోరోమిక్ వ్యూ (panoramic view)గా చూడొచ్చు. నిర్దిష్టంగా ఇక్కడ ఆగిపోతుంది అనుకోవడానికి లేదు. స్త్రీ పురుషులు శారీరకంగా వేరైనా లైంగిక పరంగా ఒకటే. వ్యవస్థ వారిని ఒకరి నుంచి ఒకరిని దూరంగా ఉంచడానికి, మగ శరీరాన్ని ఆడ శరీరాన్ని బట్టి కొన్ని విలువలని సిద్ధాంతాలని ఆపాదించింది. దీనివలన లైంగికతలో పవర్ డైనమిక్స్ ఏర్పడ్డాయి. సాధారణంగా ఆడ-మగ సంబంధంలో మగవారు అధికారాన్ని కలిగివుంటే దాన్ని మగతనపు అంశగా చూస్తారు, కానీ అదే మగవాడు దయగా ఉంటే ఆడతనపు కోణాలు ఎక్కువగా ఉన్నాయి అంటారు. కానీ ఇది నిజం కాదు. వ్యవస్థలో ఉన్న అవకాశాలను బట్టి ప్రవర్తన మారుతుంది.

కవిత్వంలో మీ పదాల వరస ఎన్నెన్నో పొరలు కదిపే విధంగా ఉంటుంది. లైంగికతకు మనం ఇచ్చే నిర్వచనాల మూలమే కదిలిపోయేట్లుగా...

మన పరిస్థితులు, సందర్భాలు, అవకాశాలను బట్టి అవసరాలు మారిపోతుంటాయి. విపరీతమైన శారీరక శ్రమలో మునిగేవారిలో, అంతగా లైంగిక వాంఛ ఉండకపోవచ్చు, ఎందుకంటే ఆ శ్రమ తరువాత విరామమే వారికి రిలాక్సేషన్. అలానే కొందరికి మాటలు, మరికొందరికి స్పర్శ. కొందరికి మేధోపరమైన ప్రేరణ సరిపోతుంది. నీ మేధస్సుని మెచ్చుకుంటే కూడా నీకు అటువంటి భావప్రాప్తి రావచ్చు. ఇవేవి కావు- కొన్నిసార్లు శారీరక సుఖమే సరిపోవచ్చు.

మన శరీరంలో ఒక్కో భాగానికి ఒక్కో అవసరం ఉంటుంది. కొన్ని భాగాలకు ఆలోచనలు కావాలి, కొన్నిటికి పని కావాలి, కొన్నిటికి కదలికలు కావాలి. అందుకే లైంగికమైన అంశాలని వ్యక్తిగతంగా నిర్వచించలేము. అలానే ఒకే ధోరణిలో ఎప్పటికీ నిలిచి ఉంటాయని కూడా చెప్పలేము. కొన్నిసార్లు చాలా అద్భుతంగా అనిపించిన భాగస్వామి మనతోపాటుగా ఆలోచనలలో ఎదగక పోయినా, మనకు ఇబ్బంది ఎదురుకావొచ్చు.

ఇందాక మీరు ప్రస్తావించిన పవర్ డైనమిక్స్ గురించి ఒక ప్రశ్న - రచనలు చేసేవారు రెండువర్గాలుగా మాట్లాడ్డమే ఎక్కువ కదా.. అలాంటి సందర్భంలో మీరు చూపిన స్థాయి అవగాహన సాధ్యమవుతుందా ?

ఇక్కడో హయరార్కి(hierarchy) ఉంది. మనం రాసే సమయాలలో వ్యక్తిగతమైన లైంగికతను విశ్వజనీయం చేయలేము. ఉదాహరణకు కమలాదాస్. ఆమె మీద గౌరవంతో ఇది వరకు ఒక డాక్యుమెంటరీ కూడా చేసాను. కానీ ఈ మధ్య ఆమెను చదువుతున్నప్పుడు గమనించినదేంటంటే, ఆమె వ్యక్తిగతమైన లైంగికతకు గుర్తింపు కోరుకున్నట్లు అనిపిస్తుంది. అది నాకు నచ్చట్లేదు. ఆమె ఒక అగ్రకుల, ఆర్థికంగా వెసులుబాటు కలిగిన మహిళ, ఆమె రచనలు పాఠకులు అందుకే బాగా ఇష్టపడ్డారు. కానీ ఇస్మత్ చుగ్తాయ్ అలా కాదు. ఆమె రాసినప్పుడు ఆమె ప్రతీ ఆడమనిషి పవర్‌ని ఒక వృత్తంలోకి తీసుకువస్తుంది. కత్తిని వాడినట్లు ఆమె కథలను వాడి ఆడవారి మధ్యలో ఉన్న పవర్ డైనమిక్స్‌ని అందంగా, సృజనతో చెప్పగలిగింది. ఆందుకే రచనలలో అణచివేత గురించే కాదు, వాటికి మూలమైన విషయాలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలు- వీటి పై కూడా దృష్టిపెట్టాలి. కానీ ఆ రచన చేస్తున్నప్పుడు మనం ఉద్వేగాలకు లోనైనా ఆ ఉద్వేగమే రచనను మింగేసేలా ఉండకూడదు.

ఇంటర్వ్యూ ■ అపర్ణ తోట
thota.aparna@gmail.com



ఉద్యోగానికి తొలి మెట్టు..
ఇంటర్న్‌షిప్

ప్రస్తుతం ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ చేయడం తప్పనిసరిగా మారింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జాబ్ రెడీ స్కిల్స్, రియల్ టైం ఎక్స్‌పీరియన్స్‌ను అందించేవి ఇంటర్న్‌షిప్స్. తరగతి గదుల్లో బోధించిన అంశాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించగలిగే అవకాశం ఇంటర్న్‌షిప్స్ ద్వారా లభిస్తుంది. సంబంధిత రంగంలోని ఆధునిక ధోరణులపై అవగాహన ఏర్పడుతుంది. కోర్సు పూర్తయ్యే నాటికి ఇండస్ట్రీ రెడీగా తీర్చిదిద్దుకునేందుకు ఇంటర్న్‌షిప్స్ మంచి వేదిక. అందుకే ఇంటర్న్‌షిప్స్‌ను ఉద్యోగానికి మొదటి మెట్టుగా భావిస్తున్నారు. కెరీర్‌పరంగా నిర్ణయాత్మక మలుపుగా నిలుస్తోన్న ఇంటర్న్‌షిప్స్ గురించి తెలుసుకుందాం..

విద్యార్థులకు, ఇటీవలే చదువు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లకు, కెరీర్ మార్పు దిశగా ఆలోచిస్తున్న వారికి సంబంధిత రంగంలోని వాస్తవిక పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు ఇంటర్న్‌షిప్స్ తోడ్పడతాయి. వీటి వ్యవధి సాధారణంగా ఆరు నుంచి ఎనిమిది వారాలపాటు ఉంటుంది. చాలా వరకు కంపెనీలు సమ్మర్‌లో ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తుంటాయి. అంటే వేసవి సెలవుల్లో తమ సంస్థల్లో ఇంటర్న్‌గా తీసుకుంటున్నాయి. అలాంటి కంపెనీలను గుర్తించి ఇప్పటి నుంచే వాటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్స్ అకడమిక్ షెడ్యూల్‌లో భాగంగా ఉంటాయి. మరికొన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్స్‌కు క్రెడిట్ స్కోర్ కూడా ఇస్తున్నారు. వీటి ద్వారా తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. కొద్ది రోజుల పాటు వాస్తవ పని వాతావరణం, పరిస్థితుల గురించి అనుభవ పూర్వకంగా తెలుసుకోవడం, అవసరమైన నైపుణ్యాలపై అవగాహన పొందడం వంటి అంశాలు ఇంటర్న్‌షిప్‌ను ప్రయోజనకరంగా మారుస్తున్నాయి. అంతేకాకుండా కంపెనీలు ఇంటర్న్‌గా చేరినవారి సామర్థ్యాన్ని కూడా పరీక్షిస్తాయి. అవసరమైన ప్రతిభ ఉందంటే ఉద్యోగావకాశం కూడా కంపెనీలు కల్పిస్తున్నాయి.

అవకాశం ఉన్న విభాగాలు: బీఈ / బీటెక్, ఎంసీఏ / పీజీడీసీఏ, ఎంబీఏ, లా, గ్రాడ్యుయేషన్ (బీసీఏ, బీకామ్ తదితరాలు), పీజీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, తదితరాలు)

ఆఫర్ చేస్తున్న రంగాలు: ఐటీ / ఐటీఈఎస్, మాన్యుఫాక్చరింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, కన్సల్టింగ్ సంస్థలు, ఆర్ అండ్ డీ.

ప్రాధాన్యం వీటికే..

దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం రాదు. కంపెనీలు దరఖాస్తుదారుల్లోని నైపుణ్యాలను పరిశీలించి మరీ ఇంటర్న్‌గా చేరేందుకు అంగీకరిస్తాయి. ఇందుకు పరిగణనలోకి తీసుకుంటున్న అంశాలు..

- ఎల్లప్పుడూ నేర్చుకోవడానికి సిద్ధంగా, ఫ్లెక్సిబుల్ ఆటిట్యూడ్‌తో ఉండే వారికి ఇంటర్న్‌గా అవకాశం లభిస్తుంది. ఎందుకంటే ఇటువంటి వారిని అవసరాలకు అనుగుణంగా సులువుగా తీర్చిదిద్దుకోవచ్చనే భావనలో కంపెనీలు ఉంటాయి.
- అప్పగించిన బాధ్యతలను సరిగా నిర్వహించే సామర్థ్యం ఉందా లేదా అనే అంశం కూడా నిర్ణయాత్మకంగా మారుతుంది. ఇంటర్న్‌షిప్ సమయంలో విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలను మెరుగుపరచుకునే నేర్పు ఉందా లేదా అనే అంశాన్ని నిశితంగా పరిశీలిస్తారు. ఎందుకంటే ఇంటర్న్‌గా అవకాశం కల్పించడానికి కంపెనీ ఎంతో సమయం, డబ్బు వెచ్చిస్తుంది. కాబట్టి ఆ సమయంలో కంపెనీతోపాటు ఇంటర్న్‌గా ప్రయోజనం పొందాలనే ఉద్దేశం దాగి ఉంటుంది. సీరియస్‌నెస్ ఉన్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ అంశానికి ప్రాధాన్యం ఇస్తారు.
- ఇచ్చిన పనిని బాధ్యతాయుతంగా నిబద్ధతతో నిర్వర్తించే లక్షణం ఉన్న వారికే అవకాశం లభిస్తుంది. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో సంస్థకు చెందిన డేటాను తస్కరించడం లేదా నష్టపరచడం వంటి పనులను ఇంటర్న్‌లు చేస్తుంటారు. ఇలాంటి అంశాల జోలికి వెళ్లకుండా ఇచ్చిన పనిని సమర్థంగా నిర్వహించేవారిని ఇంటర్న్‌గా తీసుకుంటాయి.

ప్రయోజనాలివే

ఒక అభ్యర్థి ఇంటర్న్‌గా చేరిన తర్వాత వారి పనితీరు, దృక్పథం ఆధారంగా ఉద్యోగం కల్పించే వెసులుబాటు కంపెనీలకు లభిస్తుంది. పని, వాతావరణం, సంస్థ విధానాలు అన్నీ కుదిరితేనే ఉద్యోగంలో చేరే అవకాశం అభ్యర్థులకు ఉంటుంది. ఉద్యోగికి కావాల్సిన అర్హతలు, లక్షణాలు పెంపొందించుకోవడంతోపాటు, వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకోవడానికి ఇంటర్న్‌షిప్ ఉపకరిస్తుంది. సంబంధిత విభాగంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఏర్పడుతుంది. సీనియర్లతో కలసి పని చేయడం వల్ల ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచుకునే వీలుంటుంది.

కంపెనీలు ఎందుకు ప్రోత్సహిస్తాయి?

- రోజువారీ బాధ్యతల కారణంగా డిపార్ట్‌మెంట్ హెడ్స్ / మేనేజర్లు వారికి వచ్చిన వినూత్న ఆలోచనలను అమలు చేయడం ఒక్కోసారి సాధ్యం కాదు. అలాంటి ఆలోచనలపై పని చేయడం, వాటి ద్వారా ఎదురయ్యే పరిస్థితులను పరిశీలించడానికి కంపెనీలు ఇంటర్న్‌గా చేరినవారి సేవలను వినియోగించుకుంటాయి. అంతేకాకుండా ఇంటర్న్ ఫ్రెష్ మైండ్‌తో ఉంటారు. తద్వారా సంబంధిత రంగంలో సృజనాత్మక ఆలోచనలు చేసే అవకాశం ఉంటుంది. ఇవి నూతన ఆవిష్కరణలకు దోహదం చేస్తాయి. కాబట్టి కంపెనీలు కూడా ఇంటర్న్‌షిప్స్‌ను ప్రోత్సహిస్తాయి.
- ఒక సంస్థలో చాలా ప్రాజెక్టులు ఉంటాయి. వీటిని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలి. అయితే ఇందుకు తగిన సిబ్బంది అందుబాటులో లేని పరిస్థితుల్లో ప్రతిభావంతులైన ఇంటర్న్‌లను ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడానికి కంపెనీలు వినియోగించుకుంటాయి. తద్వారా ఇంటర్న్ ప్రతిభను పరీక్షించే అవకాశం కూడా కంపెనీలకు ఉంటుంది.
- చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి సంస్థకు నేడు బ్రాండింగ్ తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో కంపెనీలు తమ బ్రాండ్‌ను ప్రమోట్ చేసుకోవడానికి కూడా ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తుంటాయి.
- తమకు కావల్సిన ప్రతిభావంతులను రిక్రూట్ చేసుకునే క్రమంలో ఇంటర్న్‌షిప్స్‌ను కంపెనీలు ఒక మార్గంగా భావిస్తాయి. అవసరమైన నైపుణ్యాలు, ఇంటర్న్‌షిప్ సమయంలో పనితీరు, దృక్పథం, చురుగ్గా కంపెనీ సంస్కృతిలో కలిసిపోవడం వంటి అంశాలను కంపెనీలు ఇంటర్న్‌లో నిశితంగా గమనిస్తాయి. ఈ సమయంలో తమ స్కిల్స్‌తో ఆకట్టుకునేవారికి ఉద్యోగావకాశం కూడా కంపెనీలు కల్పిస్తాయి.

ఎలా ఎంచుకోవాలి

ఇంటర్న్‌షిప్ చేయడానికి ఒక కంపెనీ / సంస్థను ఎంచుకునే ముందు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవి..

- ముందుగా చేరబోయే కంపెనీ గురించి సమగ్ర అవగాహన ఏర్పర్చుకోవాలి.
- పనితీరు, స్టయిఫండ్ వంటి విషయాల్లో స్పష్టతతో ఉండాలి. ఒక ఇంటర్న్‌గా కంపెనీ నుంచి ఏమి ఆశిస్తున్నారు, కంపెనీ మీ నుంచి ఏమి కోరుకుంటుంది వంటి అంశాలను క్షుణ్నంగా పరిశీలించాలి.
- ఇంటర్న్‌గా చేరే ముందు కాలేజీ, సంబంధిత ఫ్యాకల్టీ అనుమతి తీసుకోవాలి. ఎందుకంటే కొన్నిసార్లు ఇంటర్న్‌షిప్ ద్వారా క్రెడిట్స్ లభిస్తాయి.

ఇలా తెలుసుకోవాలి

ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తున్న కంపెనీల గురించి తెలుసుకోవడానికి చాలా మాధ్యమాలు ఉన్నాయి. ఇందుకు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు..

- **ఆసక్తి - ప్రదేశం:** ఆసక్తి ఉన్న అంశం, చేయాలనుకుంటున్న ప్రదేశం (లోకేషన్) ఆధారంగా కంపెనీల / ఎంప్లాయర్స్ జాబితాను సిద్ధం చేసుకోవాలి. అందులోంచి ఆసక్తికి అనుగుణంగా ఉండడంతోపాటు సంబంధిత రంగంలోని ఉద్యోగాలను, ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తున్న వాటిని ఎంపిక చేసుకోవాలి. ఆయా కంపెనీలు నిర్దేశించిన విధంగా దరఖాస్తు చేసుకోవాలి.
- **కెరీర్ పోర్టల్స్/ బ్లాగ్స్/ వెబ్‌సైట్స్:** ప్రస్తుతం ఇంటర్నెట్‌లో ఇంటర్న్‌షిప్స్ గురించి సమాచారాన్ని అందజేసే ఎన్నో వెబ్‌సైట్స్ / బ్లాగ్స్/ పోర్టల్స్, ఆన్‌లైన్ ఫోరమ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా ఇంటర్న్‌షిప్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. అవసరమైతే రిఫరెన్స్‌ను కూడా ఇవి ఇస్తాయి. ఆన్‌లైన్ జాబ్‌లిస్టింగ్ వెబ్‌సైట్ల ద్వారా కంపెనీలు ఇంటర్న్‌షిప్స్ కోసం ప్రకటనలను జారీ చేస్తుంటాయి. వీటి ద్వారా నేరుగా కంపెనీలకే దరఖాస్తు చేసుకునే లింక్ కూడా ఉంటుంది. ఇలాంటి వెబ్‌సైట్స్‌ను తరుచూ వీక్షిస్తుండాలి. వీటిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే సంబంధిత వివరాలను అలర్ట్స్ రూపంలో పంపిస్తుంటాయి.
- **కాలేజీ - నెట్‌వర్క్:** కాలేజీలోని కెరీర్ సర్వీస్ విభాగం / ప్లేస్‌మెంట్ ఆఫీస్ ద్వారా ఇంటర్న్‌షిప్స్ సమాచారాన్ని పొందొచ్చు. అదేవిధంగా కాలేజీ ఆలుమ్ని, ప్రొఫెసర్లు ఇలా మనకు తెలిసిన వారందరితో నిత్యం ఈ విషయం గురించి సంభాషిస్తూ ఉండాలి. తద్వారా ఏదైనా అవకాశం ఉంటే రిఫర్ చేస్తారు.
- **సెర్చింగ్:** పరిశోధనల్లో నిమగ్నమైన సంస్థలు తరచుగా ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తుంటాయి. గూగుల్, యాహూ వంటి సెర్చ్ ఇంజిన్ల ద్వారా సమాచారాన్ని పొందొచ్చు. నాస్కామ్, సీఐఐ, వంటి సంస్థల వెబ్‌సైట్ల ద్వారా ఇంటర్న్‌షిప్స్ గురించి తెలుసుకోవచ్చు.

ఇలా చేయాలి..

- నైపుణ్యాలను, ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు ఎక్కువ అవకాశాలను కల్పించే సంస్థలను ఎంపిక చేసుకోవాలి.
- అప్పగించిన బాధ్యతను పూర్తి చేసేందుకు నూతనంగా ఆలోచించాలి.
- సమస్యను పరిష్కరించే క్రమంలో ఏవైనా సందేహాలు వస్తే ఎటువంటి సంకోచం లేకుండా సీనియర్ల సలహాలు తీసుకోవాలి.
- ఇంటర్న్‌షిప్‌లో ఎన్నో కార్యకలాపాలు ఉంటాయి. కాబట్టి చిన్న, పెద్దా అని తేడా లేకుండా ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించడానికి ప్రయత్నించాలి. ఇంటర్న్‌గా రోజువారీగా నిర్వహించిన కార్యకలాపాలను రికార్డ్ చేసుకోవడం ప్రయోజన కరం.
- ఇంటర్ పర్సనల్ బిహేవియర్, కమ్యూనికేషన్ స్కిల్స్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి.
- ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రొఫెసర్లు, ఇండస్ట్రీ నిపుణుల సహకారం తీసుకోవాలి.
- స్టయిపెండ్ గురించి ఆలోచించకుండా మంచి ఇంటర్న్‌షిప్ అవకాశం ఉంటే చేసేందుకు సిద్ధంగా ఉండాలి.

జాబ్ కార్నర్

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ - సైంటిఫిక్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌కు ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్స్‌ని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ట్రైనింగ్ స్కూల్స్ నిర్వహిస్తాయి.

- ట్రైనింగ్ ప్రోగ్రామ్స్: OCES (Scheme 1), DGFS (Scheme 2)

OCES (Scheme 1)

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్, సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఈ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

- స్కీమ్ వ్యవధి: ఏడాది
- క్యాంపస్‌లు: బార్క్ - ముంబై, ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఆటమిక్ రీసెర్చ్ - కల్పక్కం, రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ - ఇండోర్, న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్ - హైదరాబాద్, ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ - హైదరాబాద్
- స్టయిపెండ్: నెలకు రూ.35,000తో పాటు బుక్ అలవెన్స్ కింద రూ.10,000 ఇస్తారు.

DGFS (Scheme 2)

ఎంటెక్/ పీజీ (కెమికల్ ఇంజనీరింగ్) కోర్సుల్లో అడ్మిషన్ తీసుకొన్న ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్, ఫిజిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఈ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

- స్కీమ్ కాలవ్యవధి: రెండేళ్లు
- క్యాంపస్‌లు: ఐఐటి - బాంబే/ ఢిల్లీ / గువహటి / కాన్పూర్ / ఖరగ్‌పూర్ / మద్రాస్ / రూర్కీ, బిహెచ్‌యు- వారణాసి, నిట్ - రూర్కెలా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ - ముంబై
- స్టయిపెండ్: ఎంచుకున్న కోర్సు ట్యూషన్ ఫీజుతోపాటు నెలకు రూ.35,000 ఇస్తారు. బుక్ అలవెన్స్ కింద రూ.10,000, కంటిజెన్సీ గ్రాంట్ కింద రూ.25,000 చెల్లిస్తారు.
- అర్హత: ఇంజనీరింగ్ విభాగానికి 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్/ బిఎస్సీ - ఇంజనీరింగ్/ అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (మెకానికల్ / కెమికల్ /మెటలర్జికల్/ మెటీరియల్స్ / సివిల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ / కంప్యూటర్ సైన్స్ / న్యూక్లియర్ ఇంజనీరింగ్ / న్యూక్లియర్ టెక్నాలజీ / న్యూక్లియర్ సైన్స్ & టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్ విభాగానికి బిఇ/ బిటెక్/ బిఎస్సీ - టెక్నాలజీ/ ఎమ్మెస్సీ / ఎంటెక్ (ఫిజిక్స్/ అప్లయిడ్ ఫిజిక్స్ / కెమిస్ట్రీ / బయోసైన్సెస్ / జియో ఫిజిక్స్/ అప్లయిడ్ జియో ఫిజిక్స్ / జియాలజీ / అప్లయిడ్ జియాలజీ/ జియో కెమిస్ట్రీ / ఫుడ్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
- ఎంపిక: గేట్ 2017/ 2018 స్కోరు లేదా సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తారు. దాని ఆధారంగా ఇంటర్వ్యూ ఉంటుంది.
- ఇంటర్వ్యూ కేంద్రాలు: ముంబై, హైదరాబాద్
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 4, 2018
- గేట్ అప్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018
- వెబ్‌సైట్: www.barconlineexam.in

పార్టీ ఫిరాయింపులు నిరోధక చట్టం..
లోటుపాట్లు

పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్

అధికారం ఎక్కడ ఉంటే నేతలు ఆ పార్టీలో ఉంటారనే స్థితికి నేటి రాజకీయాలు దిగజారుతున్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వాతలు పెడుతున్నా గోడదూకుళ్లకు కళ్లెం పడటం లేదు. చట్టాల్లోని లొసుగులు తెలిసిన నేతలు పార్టీలు మారుస్తూ పదవుల్లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులు నిరోధక చట్టం, లోటుపాట్లు తెలుసుకుందాం..

స్వాతంత్ర్య అనంతరం రెండు దశాబ్దాలపాటు కేంద్రంలో, రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఏకఛత్రాధిపత్యం కొనసాగించింది. అయితే 1967లో 16 రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే కేవలం ఒక్క రాష్ట్రంలోనే మాత్రమే కాంగ్రెస్ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. మిగతా రాష్ట్రాల్లో ఇతర పార్టీల సహకారంతో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీంతో తక్కువ సీట్లు పొందిన పార్టీలు కూడా ప్రభుత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయి. ఫలితంగా అధికారమే పరమావధిగా మారిపోయింది. 1967-71 మధ్య 142 మంది ఎంపీలు, 1500మందికిపైగా శాసనసభ్యులు పార్టీలు ఫిరాయించారు.

52వ సవరణతో

ఫిరాయింపులకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో 1985లో రాజ్యాంగానికి 52వ సవరణ చేసి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని 10వ షెడ్యూల్‌లో చేర్చారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం 1985 మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చింది. ప్రకరణలు 102 (2), 191 (2) పార్లమెంట్, శాసనసభ సభ్యుల అనర్హతలను వివరిస్తున్నాయి.

అనర్హతకు దారితీసే పరిస్థితులు

- శాసన/పార్లమెంట్ సభ్యుడు స్వచ్ఛందంగా తన పార్టీ ప్రభుత్వాన్ని వదులుకున్న సందర్భంలో, పార్టీ విప్‌ను ధిక్కరిస్తే అనర్హునిగా ప్రకటించవచ్చు.
- స్వతంత్ర అభ్యర్థి ఎన్నికల్లో గెలిచిన తరవాత ఏదైనా పార్టీలో చేరితే అనర్హునిగా ప్రకటించవచ్చు. నామినేటెడ్ సభ్యులు ప్రమాణస్వీకారం చేసిన ఆరు నెలలలోపు ఏదైనా పార్టీలో చేరొచ్చు. తరవాత చేరితే అనర్హునిగా ప్రకటించవచ్చు.

మినహాయింపులు

ఒక పార్టీ, మరో పార్టీలో విలీనమైతే అనర్హత నుంచి మినహాయింపు లభిస్తుంది. అయితే విలీనమయ్యే పార్టీ ప్రజాప్రతినిధుల్లో మూడింట రెండొంతుల మంది విలీనానికి సమ్మతి తెలపాలి. తొలుత మూడింట ఒకవంతు సభ్యులు అనుమతి తెలిపితే సరిపోయేది. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఉద్దేశంతో 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా మార్పులు చేశారు. మూడింట రెండొంతుల మంది విలీనానికి సమ్మతించాలనే నిబంధనను చేర్చారు. సభాపతి, ఉప సభాపతి బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారు తమ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నా వారిపై అనర్హత వేటు వేసే వీలు లేదు. గుర్తింపు పొందని పార్టీ నుంచి వెళ్లినా ఫిరాయింపు వర్తించదు.

91వ రాజ్యాంగ సవరణ

2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి కొన్ని సవరణలు చేశారు. అవి..పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ద్వారా అనర్హులుగా ప్రకటించిన వారిని మంత్రులుగా లేదా లాభదాయక పదవుల్లో నియమించరాదు. 10వ షెడ్యూల్‌లో పార్టీ ఫిరాయింపు అనర్హతలకు మినహాయింపుగా పేర్కొన్న "చీలిక" అనే పదాన్ని తొలగించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ద్వారా అనర్హులుగా ప్రకటించే నిర్ణయం పూర్తిగా సభాపతులకే ఉంటుంది. ఇందులో న్యాయస్థానాల జోక్యానికి వీలులేదు. నిర్ణయానంతరం అందులో ఏవైనా తప్పిదాలు ఉంటే సమీక్షించే హక్కు న్యాయస్థానానికి ఉంది.

న్యాయస్థానాన్ని చేరిన కేసులు

- **కిహోటా హోలోహన్ వర్సెస్ జాచిలూ:** పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రజాప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ఉందని, సభాపతుల అనర్హతను నిర్ణయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాదనల తరవాత సర్వోన్నత న్యాయం స్థానం "10వ షెడ్యూల్ పూర్తిగా రాజ్యాంగబద్ధమైంది, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రజాప్రతినిధుల భావ ప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామిక హక్కులకు ఏమాత్రం అవరోధం కాదు" అని వెల్లడించింది. సభాపతుల అధికారాల్లో జోక్యం చేసుకోలేమని, వారి నిర్ణయాల్ని మాత్రం సమీక్షించగలమని పేర్కొంది.
- **జి.విశ్వనాథన్ వర్సెస్ తమిళనాడు శాసన సభాపతి:** ఎవరైనా శాసనసభ్యుణ్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసినా 10వ షెడ్యూల్ ప్రకారం అతణ్ని సంబంధిత పార్టీ సభ్యునిగానే పరిగణించాలి. సస్పెండ్ చేశారని వేరే పార్టీలో చేరితే స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లుగానే పరిగణించి అనర్హునిగా ప్రకటించవచ్చని సుప్రీం కోర్టు పేర్కొంది.



- **రవి నాయక్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా:** ప్రజాప్రతినిదిగా ఎన్నికైన వ్యక్తి పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడాన్ని విస్తృత అర్థంలో చూడాల్సి ఉంటుంది, పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్న వారిపై అనర్హత వేటు సరైందేనని సుప్రీం కోర్టు పేర్కొంది.

విమర్శలు

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ద్వారా పార్టీలకు తమ సభ్యులపై పట్టు పెరిగింది. అదే సందర్భంలో ఈ చట్టంపై కొన్ని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రజాప్రతినిధుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తుందనే వాదన బలంగా వినిపిస్తుంది. ప్రభుత్వం తీసుకొచ్చే చట్టాల్లో ఏవైనా లోటుపాట్లున్నా అధికార పార్టీ నేతలు విమర్శించే అవకాశం లేకుండా పోతుందనే భావన కూడా ఉంది. అర్థవంతమైన చర్చ జరగకుండా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అవరోధంగా నిలుస్తుందనే అభిప్రాయ వ్యక్తమవుతుంది. విప్ అధికారాల్ని పరిమిత సందర్భాలకే వర్తింపజేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పారిభాషిక పదాలు

- **క్రాసింగ్:** ఒక రాజకీయ పార్టీ నాయకుడు మరో రాజకీయ పార్టీలో చేరడమే క్రాసింగ్.
- **ఫ్లోర్ క్రాసింగ్:** ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు అధికార పక్షంలోకి మారడమే ఫ్లోర్ క్రాసింగ్.
- **కార్పెట్ క్రాసింగ్:** అధికార పక్ష సభ్యులు ప్రతిపక్షంలోకి ఫిరాయించడమే కార్పెట్ క్రాసింగ్.
- **హార్స్ ట్రేడింగ్:** అధికారాన్ని కాపాడుకోవడం కోసం ధనం ఆశగా చూపి ప్రజాప్రతినిధుల్ని కొనుగోలు చేయడమే హార్స్ ట్రేడింగ్.

సభాపతి పాత్ర

సభాపతులు బాధ్యతలరీత్యా పార్టీలకు అతీతంగా వ్యవహరించాలి. సాధారణంగా అధికార పార్టీ సభ్యులే సభాపతులుగా ఎన్నికవుతున్నారు. 1996లో మాత్రమే విపక్ష కాంగ్రెస్ సభ్యుడు పీఏ సంగ్మా స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సభాపతిని పార్టీలకు అతీతంగానే చూడాలి. కానీ పరిస్థితుల అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. యూపీఏ-1 ప్రభుత్వంలో సీపీఎం భాగస్వామి. అయితే అమెరికాతో అణు ఒప్పందం విషయంలో కాంగ్రెస్‌తో విభేదించి ప్రభుత్వం నుంచి తప్పుకుంది. అప్పుడు లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న కమ్యూనిస్ట్ పార్టీ నేత సోమ్‌నాథ్ ఛటర్జీ మాత్రం అలాగే కొనసాగారు. ఈ సందర్భంలో 2008లో యూపీఏ-1 ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొని నెగ్గింది. ఆ వెంటనే సీపీఎం సోమ్‌నాథ్ చటర్జీని పార్టీ నుంచి బహిష్కరించింది. ప్రభుత్వానికి సహరించినందుకుగాను తరవాత స్పీకర్‌కు ఉన్నత పదవులు దక్కిన సందర్భాలు ఉన్నాయి. 1975లో అప్పటి ప్రభుత్వం స్పీకర్ జి.ఎస్. దిల్లాన్‌తో రాజీ నామా చేయించి వెంటనే నౌకాయాన మంత్రి పదవి ఇచ్చింది.

వివిధ కమిటీల సూచనలు

- **వెంకటాచలయ్య కమిషన్:** పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ద్వారా ప్రజాప్రతినిధుల్ని అనర్హులుగా ప్రకటించే అధికారాన్ని సభాపతి నుంచి మినహాయించి రాష్ట్రపతి, గవర్నర్‌కు కల్పించాలని వెంకటాచలయ్య కమిషన్ 2002లో సూచించింది. పార్టీ విప్ ధిక్కరించి లేదా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంతో అనర్హ వేటుపడిన సభ్యుల ఓటును పరిగణనలోకి తీసుకోకూడదని ఈ కమిషన్ పేర్కొంది. ఆ సభ గడువు పూర్తయ్యే వరకూ ఎలాంటి మంత్రి పదవులు, లాభదాయక పదవుల్ని చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడింది.
- **దినేశ్‌గోస్వామి కమిటీ:**విశ్వాస, అవిశ్వాస తీర్మానాల సమయంలోనే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని వర్తింప చేయాలని ఈ కమిటీ సూచించింది.
- **లా కమిషన్:** ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో ఉన్నప్పుడే మాత్రమే పార్టీలు విప్ జారీ చేయాలని లా కమిషన్ పేర్కొంది. ఎన్నికల ముందు ఏర్పడే కూటములలను రాజకీయ పార్టీలుగా గుర్తించాలని సంబంధిత సమాచారాన్ని ఎలక్షన్ కమిషన్ తెలిపేలా నిబంధనల్లో మార్పులు చేయాలని అభిప్రాయపడింది.



మల్లవరపు బాలలత
2016 సివిల్స్ ర్యాంకర్

గంగలో గుడి.. వేపదారు లింగం


సంగమేశ్వర క్షేత్ర విశేషం



కృష్ణా జలాల్లో కలుస్తున్న సంగమేశ్వర ఆలయం

ని-దర్శనం

Nidarshanam



వేపదారు లింగం

గంగ పొంగితే... జలాధివాసం! మిగిలిన సమయంలో భక్తులకు దివ్యదర్శనంతో అనుగ్రహం! వేపచెట్టు కాండమే శివలింగం!... ఇది కర్నూలు జిల్లాలో నల్లమల అడవుల్లో కొలువైన సంగమేశ్వర క్షేత్ర విశేషం. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరథి, భవనాశి అనే ఏడు నదులు సంగమించే దివ్య ధామం సప్తనదీ సంగమేశ్వరం. ఈ ప్రాంతంలో ద్వాపర యుగాంతంలో పాండవులు విడిది చేశారట! ఆ సమయంలో ధర్మరాజు శివలింగాన్ని ప్రతిష్ఠించాలని భావిస్తాడు. కాశీకి వెళ్లి లింగం తీసుకురమ్మని భీముడిని ఆదేశిస్తాడు. కానీ... ముహూర్త సమయానికి భీముడు తిరిగిరాకపోవడంతో ఆందోళనకు గురవుతాడు. శ్రీకృష్ణ పరమాత్ముని సూచన మేరకు పశ్చిమ దిశలో ఉన్న భారీ నింబదారు వృక్షాన్ని (వేపవృక్షం) ఖండించి, దాని మొదలునే శివలింగంగా ధర్మరాజు ప్రతిష్ఠించాడని చెబుతారు. ఇదీ ఇక్కడి క్షేత్ర పురాణం! ఇప్పటికీ అక్కడ వేప చెట్టు కాండమే లింగరూపంలో భక్తుల పూజలను, అభిషేకాలను అందుకుంటోంది. శ్రీశైల జలాశయ నిర్మాణం పూర్తయిన తర్వాత 1980లో సప్తనదీ సంగమేశ్వరం కృష్ణమ్మ గర్భంలోకి చేరుకుంది. అప్పటి నుంచి 24ఏళ్ల పాటు ఆలయం గంగ ఒడిలోనే ఉన్నాడు. 2003లో బయల్పడి భక్తులచే పూజందుకున్నాడు. విచిత్రమేమిటంటే... అన్నేళ్లపాటు నీటిలో ఉన్నప్పటికీ వేప లింగం మాత్రం చెక్కుచెదరదు. ఇప్పటికీ... శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864 అడుగులకు చేరుకుంటే, సంగమేశ్వర ఆలయం గోపుర కలశం దాకా నీటిలో మునిగిపోతుంది. నీటిమట్టం 826 అడుగులకు దిగిపోతే... సంగమేశ్వరాలయం ద్వీపకల్పంలా మారుతుంది. గుడిలోకి వెళ్లి పూజలు చేసేందుకు వీలు కలుగుతుంది. అంటే... భారీ వర్షాలు, ఎగువ నుంచి వచ్చే జలాలు, డ్యామ్‌లో నీటిమట్టాన్ని బట్టే సంగమేశ్వరుడి 'జలాధివాసం' ఆధారపడి ఉంటుంది. 2003 తర్వాత 14 ఏళ్లలో ఎనిమిదిసార్లు మాత్రమే మహాశివరాత్రి పర్వదినానికి సంగమేశ్వరుడు పూజలు అందుకున్నాడు. ఒకవైపు నల్లమల అడవులు... మరోవైపు కృష్ణా నది! ఈ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శిస్తే ప్రకృతి అందాలను కూడా వీక్షించవచ్చు. కర్నూలు జిల్లా ఆత్మకూరు నుంచి 42 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. సొంత వాహనాల్లో నేరుగా ఇక్కడికి చేరుకోవచ్చు. లేదా... ఆత్మకూరు నుంచి ఆర్టీసీ బస్సుల్లో కపిలేశ్వరం వరకు (37 కిలోమీటర్లు) వెళ్లవచ్చు. అక్కడి నుంచి సంగమేశ్వరానికి వెళ్లడానికి ఆటోలు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ వైపు... మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మీదుగా సోమశిల వరకు వచ్చి, అక్కడి నుంచి జల మార్గంలో క్షేత్రానికి చేరుకోవచ్చు.

- ఆత్మకూరు



100 కోట్ల గుండు కథ

వెంకన్నకు కురుల సిరులు.. తలనీలాలు సమర్పించే మూడో వంతు భక్తులు

గుండుకీ ఒక కథ ఉంది. అది... సుదీర్ఘమైన కథ. విశ్వాసాలతో పెనవేసుకున్న కథ. ఒక విషాదానికి చిహ్నంగా భావించే గుండు తిరుమల కొండ ఎక్కేసరికి పవిత్రమైన ఆచారంగా మారిపోయింది. తిరుపతికి వచ్చే ప్రతి ముగ్గురు భక్తుల్లో ఒకరు గుండు చేసుకునే కొండ దిగుతున్నారు. దీంతో టన్నుల కొద్దీ తలనీలాలు తిరుమలలో పోగవుతున్నాయి. ఈ 'శిరులు' సిరులు కురిపిస్తున్నాయి. ఏడుకొండల వాడికి ఏటా వందకోట్ల ఆదాయం తెచ్చి పెడుతున్నాయి.

తిరుమల లడ్డుకు ఎంత ప్రాధాన్యముందో గుండుకూ అంతే ప్రాముఖ్యం ఉంది. పుట్టు వెంట్రుకలు సమర్పించడం అనే సంప్రదాయం మన దేశంలో ఉన్నా ఆలయాల్లో ఒక మొక్కుగా తల వెంట్రుకలు సమర్పించే ఆచారం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది మాత్రం తిరుమలతోనే. తిరుమలలోనూ తలనీలాల ఆచారం వందేళ్ల లోపుదే అని భావిస్తున్నారు. టీటీడీ లెక్కల ప్రకారం తిరుమల యాత్రకు వచ్చే ప్రతి పది మంది భక్తుల్లో ముగ్గురు తలనీలాలు సమర్పించుకుంటున్నారు.



1960 ప్రాంతంలో శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్దే తలనీలాలు సమర్పించేవారు. అప్పట్లో ఈ వెంట్రుకలను టీటీడీ సేకరించడం, విక్రయించడం జరిగేది కాదు. తిరుపతికి చెందిన కొంత మంది చిన్న వ్యాపారులు నేరుగా క్షురకుల వద్దకు వెళ్లి పొడవైన వెంట్రుకలకు ఎంతో కొంత డబ్బు ఇచ్చి కొనుక్కునేవారు. అప్పట్లో సవరాల తయారీ తిరుపతిలో ఒక కుటీర పరిశ్రమలా ఉండేది. ఆ తరువాత చెన్నై వ్యాపారులు రంగంలోకి దిగారు. 1980వ దశకంలో తలనీలాల విక్రయాన్ని టీటీడీ స్వయంగా చేపట్టింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను గమనించి 2000 సంవత్సరంలో వెంట్రుకలను గ్రేడింగ్ చేయడం ప్రారంభించింది. ఈ-వేలం నిర్వహించడంతో ఆదాయం అనూహ్యంగా పెరిగింది. 2013-14మధ్య కాలంలో తలనీలాల ఆదాయం 250 కోట్ల వరకు చేరుకుంది. 2013-14 టీటీడీ స్థూల ఆదాయంలో తలనీలాల ద్వారా సమకూరిన ఆదాయం 25%వరకు ఉండటం విశేషం.



ప్రత్యేక సెటప్

తిరుమలలో టీటీడీ కల్యాణకట్టల్లో 1400 మంది క్షురకులు పనిచేస్తున్నారు. ప్రధాన కల్యాణకట్టతో సహా మొత్తం 9 చిన్న కల్యాణ కట్టలున్నాయి. మొక్కుల రూపంలో సమకూరిన తలనీలాలను గ్రేడింగ్ చేయడం కోసం టీటీడీ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రేడింగ్ పనిలో ప్రస్తుతం 50 మంది ఉన్నారు. ఏప్రిల్ నుంచి అక్టోబరు మధ్య కాలంలో యాత్రికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆ రోజుల్లో అదనంగా మరో 20 మందిని నియమిస్తారు. విక్రయాల్లో నిర్దిష్టమైన విధానం ఉంటుంది. ప్రతి నెలా మొదటి గురువారం ఈ-వేలంలో కేశాలను విక్రయిస్తారు. గ్రేడింగ్‌లో కూడా కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నారు. తాజాగా వెంట్రుకల చిక్కు విడదీయడానికి యంత్రాలను ప్రవేశపెట్టాలని టీటీడీ భావిస్తోంది.

మహిళలే అగ్రస్థానం

టీటీడీకి ఏడాదికి వంద కోట్ల ఆదాయం తలనీలాల నుంచి వస్తోంది. ఇందులో 90% మహిళల తలనీలాల నుంచి లభిస్తున్నదే. తిరుమలలో ఏటా 2.25 లక్షల మంది మహిళలు స్వామివారికి తలనీలాలు సమర్పిస్తున్నారు. తలనీలాలను టీటీడీ ఐదు గ్రేడ్లుగా విభజిస్తుంది. మొదటి రకం 32 అంగుళాలకుపైగా పొడవున్నవి. రెండో రకం 16 నుంచి 30 అంగుళాలు, మూడోరకం 10 నుంచి 15, నాలుగో రకం 5 నుంచి 9 అంగుళాలు. ఈ ఐదు గ్రేడ్ల తలనీలాలు ఏటా 135 టన్నులు పోగవుతున్నాయి. మొదటి గ్రేడు వెంట్రుకలు కిలో రూ.22,494. రెండో రకం రూ.17,223. మూడోరకం రూ.2,833 ధర పలుకుతోంది. నాలుగో రకం రూ.1195. పొట్టిగా ఉండే ఐదోరకం తలవెంట్రుకలు ఏటా 200 టన్నులు వస్తున్నాయి. ఇవి పురుషులవి. వీటి ధర కిలో రూ.24 మాత్రమే!

ఎందుకు తలనీలాలు?

"తలనీలాలు సమర్పించడం అంటే తనలోని అహాన్ని తొలగించుకోవడం. తలపై భాగం శని స్థానం. నీలం శని వర్ణం. తల వెంట్రుకలు అహానికి ప్రతీకలు. నేను, నాది అనే రజోగుణానికి సంకేతాలు. అలాంటి శిరోజాలను స్వామి వారికి సమర్పించడం వల్ల శని దోష నివారణ జరుగుతుంది."

- విష్ణుభట్టాచార్యులు, టీటీడీ ఆగమ సలహాదారు

ఐరోపా మాంద్యంతో తగ్గిన ధరలు

కేశాల మార్కెట్‌లో టీటీడీ వాటా 80 శాతం. కేశాల వినియోగంలో ఐరోపా దేశాలదే అగ్రస్థానం. ఇక్కడి ప్రజలు ఆరు నెలలకోసారి హేర్ స్టైయిల్ మార్చుతారు. ఈ క్రమంలో విగ్గులు విపరీతంగా వినియోగిస్తారు. రెండేళ్ల క్రితం వరకు టీటీడీ నుంచి కొనుగోలు చేసిన కేశాలు బ్రెజిల్‌కు చేరేవి. అక్కడ విగ్గులు తయారు చేసి ఐరోపా దేశాలకు ఎగుమతి చేసేవారు. అయితే... ఆ దేశంలో పన్ను పెరగడంతో వెంట్రుకలను దిగుమతి చేసుకోవడంలో చైనా అగ్రస్థానంలోకి వచ్చింది. కానీ, ఐరోపాలో ఆర్థిక మాంద్యం నేపథ్యంలో విగ్గుల మార్కెట్ కూడా తగ్గింది. మూడు, నాలుగేళ్ల కిందటితో పోల్చితే టీటీడీకి తలనీలాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయం 50శాతానికి పైగా పడిపోయింది.

(ఆంధ్రజ్యోతి, తిరుపతి)

ఇక చాక్లెట్లు ఉండవ్!



చాక్లెట్ పేరు చెబితేనే పిల్లలకు నోటిలో నీళ్లు ఊరుతాయి. ఇక పెద్దలు కూడా చాక్లెట్‌ని చూడగానే పిల్లలతో పోటీపడతారు. అయితే మీరు ఏ చాక్లెట్ తింటారో..ఎన్ని వెరైటీలు తింటారో ఇప్పుడే తినేయండి! ఎందుకంటే 30 ఏళ్ల తర్వాత చాక్లెట్లు ఉండవంటున్నారు నిపుణులు! చాక్లెట్ తయారీలో అతి ముఖ్యమైన కొకొవా మొక్కలు.. మునుపటిలా పండే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు. వచ్చే 30 ఏండ్లలో భూ ఉష్ణోగ్రతలు 2.1 డిగ్రీలు పెరిగినా..కొకొవా మొక్కలు బతకవనీ..ఈ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా చాక్లెట్ పరిశ్రమపై పడుతుందని అమెరికా జాతీయ సముద్ర- వాతావరణ విభాగం పేర్కొంది. అధిక తేమ, సంవృద్ధిగా వర్షపాతం ఉంటేనే కొకొవా మొక్కలు పెరిగి..చాక్లెట్ గింజలు లభిస్తాయి. భూతాపం పెరిగేకొద్దీ నేలలో తేమ తగ్గిపోతుంది. దీంతో 2050 నాటికి కొకొవా మొక్కలు పెరగడం కష్టమే అని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రపంచంలో 70శాతం కొకొవా గింజలు.. ఘనా వంటి పశ్చిమ ఆఫ్రికా దేశాల్లోనే పండుతాయి. అక్కడ ఉష్ణోగ్రతలు మరింత పెరిగి..కరవు పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.90వ దశకం నుంచి చైనా, ఇండోనేసియా, బ్రెజిల్ కూడా చాక్లెట్ మార్కెట్లోకి వచ్చాయి. అయితే వాతావరణ మార్పులతో కొకొవా మొక్కలు తరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్ జనాభాకు తగ్గట్టుగా చాక్లెట్ల తయారీ అసాధ్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రానున్న సంవత్సరాల్లో ఏటా లక్ష టన్నుల చాక్లెట్ల కొరత తప్పదని స్పష్టం చేస్తున్నారు.

వైర్‌లెస్ వెలుగులు

కేబుల్స్ లేకుండానే కరెంటు.. గాలిలోనే మానవరహిత విమానాలు రీచార్జ్



ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నప్పుడే..మీ జేబులోని స్మార్ట్‌ఫోన్ చార్జ్ అయిపోతుంది. టీవీ ఆన్ చేయాలంటే ప్లగ్ పెట్టక్కర్లేదు. ఫ్యాన్ తిరగాలన్నా వైర్లు కనెక్ట్ చేయక్కర్లేదు. ఇల్లు కట్టేటప్పుడు వైరింగ్ చేయించాల్సిన పనేలేదు. ఎందుకంటే భవిష్యత్తులో వైర్‌లెస్ రెసొనన్స్ టెక్నాలజీతో ప్రతి ఇంటిలో.. వైర్లు లేకుండానే వెలుగులు నిండుతాయని వైట్రిసిటీ సంస్థ చెబుతోంది.



ఎలా సాధ్యం?

గాలిలో అయస్కాంత క్షేత్రంతో వైర్‌లెస్ కరెంట్ సాధ్యం అంటున్నారు వైట్రి సిటీ పరిశోధకులు! ఓ ఎలక్ట్రికల్ కాయిల్‌కు శక్తిని అందించినప్పుడు అయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. దానికి దగ్గరగా మరో ఎలక్ట్రికల్ కాయిల్ తీసుకు వచ్చినప్పుడు.. దానిలో ఎలక్ట్రిక్ చార్జ్ పుడుతుంది. అయస్కాంత క్షేత్రం దగ్గరకు కాయిల్ రాగానే.. అందులో కరెంటును ప్రేరేపిస్తుంది. ఒక చోటు నుంచి మరో చోటుకి శక్తి బదిలీ అవుతుంది. అలా బల్బులు, ఫ్యానులు ఇతర గృహోపకరణాలు కేబుల్స్ లేకుండానే పనిచేస్తాయి.

వైర్‌లెస్ హోమ్స్



ఇప్పుడు చాలాచోట్ల వైర్‌లెస్ ఇంటర్నెట్ సౌకర్యం వచ్చేసింది. అలాగే భవిష్యత్తులో తీగలు లేకుండా కరెంటు సరఫరా జరుగుతుందంటున్నారు వైట్రిసిటీ పరిశోధకులు! కరెంటు ప్రసారానికి ఉపయోగపడే అయస్కాంత క్షేత్రాలతో ఎలాంటి ప్రమాదం ఉండదనీ, ఇప్పుడు వైఫై రూటర్లలో వాడే అయస్కాంత క్షేత్రాల్లాగే అవి పనిచేస్తాయని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ కార్లకు ప్లగ్ కూడా పెట్టకుండానే చార్జింగ్ జరిగిపోయే వ్యవస్థను వైట్రిసిటీ తయారు చేసింది. ఎలక్ట్రిక్ కారును ఇంట్లో పార్క్ చేయగానే.. రీ ఫ్యూయల్ అయిపోతుంది. అంతేకాదు మానవ రహిత విమానాలు గాలిలోనే బ్యాటరీ రీచార్జ్ చేసుకునేలా..ఆవిష్కరణలు జరుగుతున్నాయని జపాన్‌కు చెందిన నోబెల్ పురస్కార గ్రహీత ప్రొ.హిరోషి ఎమానో తెలిపారు.

ఈ దాహం తీరనిది!

రోజుకు 20 లీటర్ల నీళ్లు..రెండు గంటలే నిద్ర

జర్మనీ యువకుడి అవస్థ

రోజుకి మూడు లీటర్ల నీరు తాగడమే చాలాకష్టం! అలాంటిది జర్మనీకి చెందిన ఓ యువకుడు రోజుకి ఏకంగా 20 లీటర్ల నీళ్లు తాగుతున్నాడు. అంత తాగినా ఇంకా దాహం దాహం అని అల్లాడుతూనే ఉంటాడు. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్ అయిన మార్క్ ఉబెన్‌హాస్ట్..అరుదైన డయాబెటిస్ ఇన్సిపిడస్ సమస్యతో బాధపడుతున్నాడు. దీనివల్ల అతను ఎప్పుడూ దప్పికతోనే ఉంటాడు. గంటకు మించి నీరు తాగకుండా బతకలేని దుస్థితి! వెంటవెంటనే మంచినీళ్లు తాగకపోతే డీహైడ్రేషన్‌తో మార్క్ స్పృహ కోల్పోతాడు. దీంతో రెండు గంటలుకూడా నిద్రపోలేని పరిస్థితి. 'నా పరిస్థితి చూసి డాక్టర్లు కూడా ఆశ్చర్యపోయారు. నీళ్లు తాగకపోతే నేను ఎక్కడున్నానో కూడా నాకు తెలీదు. జ్వరం కూడా వచ్చేస్తుంది. ఎదుటివారు ఏం అడుగుతున్నారో నాకు అర్థం కాదు. రోజుకి నేను 22 లీటర్ల నీళ్లు తాగగలను. కానీ నీళ్లు లేకుండా గంట కూడా ఉండలేను' అని మార్క్ వెల్లడించాడు. పుట్టుకతోనే మార్క్ ఉబెన్‌హాస్ట్‌కి ఈ వ్యాధి ఉంది. అతని తల్లికి కూడా ఇదే సమస్య ఉంది. రోజంతా విపరీతంగా మంచినీళ్లు తాగుతూపోతే రక్తంలో సోడియం లెవల్స్ పెరిగిపోతాయి. మెదడులో నీరు చేరుతుంది. చివరకు ప్రాణం కూడా పోయే ప్రమాదం ఉంది. దీనినే వైద్య పరిభాషలో హైపోనాట్రేమియా అంటారు. అందుకే ఎక్కడకు వెళ్లినా మార్క్ తన బ్యాగు నిండా వాటర్ బాటిళ్లు పెట్టుకుంటాడు. 'నేను నీళ్లే ఎక్కువ తాగుతాను. జ్యూస్, డైట్ కోక్ అప్పుడప్పుడు తాగుతాను. 3 బాటిళ్ల వైన్ తాగినా నాకు ఏమీ కాదు' అంటాడు మార్క్! ఎంత మంది డాక్టర్ల దగ్గరకు వెళ్లినా ఈ జబ్బుకి మందులేదని తేల్చేశారని..జీవితాంతం తన దాహం తీరనిదని మార్క్ నిట్టూరుస్తున్నాడు. బబ హార్మోన్ లోపంతో ఈ డయాబెటిస్ ఇన్సిపిడస్ సమస్య వస్తుంది.



మూలికల క్యాలెండర్

365 రోజులకు 365 మూలికలు.. రోజుకో ఔషధంపై విశ్లేషణ.. వ్యాయామం, ఆహారంపైనా అవగాహన

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఔషధ గుణాలు కలిగిన మూలికలతో స్వతహాగా వైద్యం చేసుకునే చిట్కాలతో వినూత్న క్యాలెండర్‌ను రూపొందించారు తమిళనాడులోని శివగంగకు చెందిన చిత్రకారుడు ముత్తుకృష్ణన్. క్యాలెండర్‌లోని 365 దినాలకు రోజుకో మూలికప్రయోజనాలు, ఔషధం తయారు చేసే విధానం వివరించారు. ఈ క్యాలెండర్‌ను తమిళంలో ప్రచురించారు. మిరియాలు, జీలకర్ర, వాము, శొంఠి, వెల్లుల్లి, బీట్‌రూట్, ముల్లంగి, గుమ్మడి తదితరాలను ఆహారం ద్వారా తీసుకుంటే అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చని సూచించారు. రోజూ పండ్లు, కూరగాయలు తీసుకోవాలని, వ్యాయామం తప్పనిసరిగా చేయాలని పేర్కొన్నారు. ఏ సీజన్‌లో ఏ మూలికలు లభిస్తాయో వివరించారు.



నవ్య

కుటుంబ కదంబం





బి.నరసింగరావు పేరుచెప్పగానే 'మా భూమి', 'రంగుల కల', 'దాసి' వంటి అవార్డు చిత్రాలు గుర్తుకొస్తాయి. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన ఆయన కమ్యూనిజం వైపు అడుగులెందుకు వేశారు? నాలుగు దశాబ్దాల్లో కేవలం నాలుగు సినిమాలే తీయడానికి కారణమేంటీ? చిరకాల మిత్రుడు గద్దర్ గురించి ఆయన ఏం చెప్పారు? 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో ప్రముఖ దర్శకుడు **బి.నరసింగరావు**తో ఏబిఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ **వేమూరి రాధాకృష్ణ** జరిపిన సంభాషణ విశేషాలివి...



ఇప్పటికీ వారికి నేను నక్సలైట్‌నే!

ఒక అరడజను సినిమాలు తీశారా? నిర్మాతగా, దర్శకునిగా..?

ఆరు సినిమాలకు డైరెక్షన్ చేశాను. అందులో ఒక సినిమాకు నిర్మాతగా వ్యవహరించాను.

తీసినవి కొన్ని సినిమాలే అయినా అంతర్జాతీయంగా పేరొచ్చింది. ఈ నలభై ఏళ్ల సినీ ప్రయాణం ఎలా అనిపించింది?

సినిమా అంటే చిన్నప్పటి నుంచి ఆసక్తి. నటుడు కావాలనే కోరిక ఉండేది. ఫైన్ ఆర్ట్స్ చదువుతున్నప్పుడు ఆర్.ఆర్ ల్యాబ్స్‌లో ఒక ఫిల్మ్‌క్లబ్ ఉండేది. అక్కడ సత్యజిత్‌రే సినిమాలు వేస్తున్నారు. నన్ను పిలిస్తే వెళ్లాను. తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారి అబ్బాయి మాతో చదువుకున్నాడు. తను అక్కడికొచ్చాడు. అప్పటి వరకు సినిమా అంటే ఆటలు, పాటలు, జానపదం. ఆ సినిమా ప్రభావం చాలా పడింది. సినిమాలను జీవితానికి ఇంత దగ్గరగా, సహజంగా ఉండేలా తీయొచ్చా? అనిపించింది. అప్పుడే నాలో ఆలోచన మొదలయింది. తరువాత ఫైన్‌ఆర్ట్స్ చదువు పూర్తయ్యాక మా నాన్నగారు 'ఫ్యామిలీని ఉద్ధరిస్తాడు వీడు' అని తీసుకెళ్లాడు. నాకేమో అటు మనసు వినలేదు. నాటకాలు, పాటలు, 'జననాట్యమండలి'లో యాక్టివ్‌గా ఉన్నాము. ఆ టైంలోనే ఎమర్జెన్సీ. అయితే మేం చేసిన యాక్టివిటీ నాటకరంగానికి సంబంధించినదే తప్ప పొలిటికల్ కాదు.

ఎంతకాలం ఆజ్ఞాతంలో ఉన్నారు?

రెండు సంవత్సరాలు.

అజ్ఞాతం అంటే ఎక్కడుండే వారు? ఇప్పటి వాళ్లకు తెలుసుకోవాలని క్యూరియాసిటీ!

వాళ్లకు దొరక్కుండా ఉండాలి. హైదరాబాద్‌లోనే ఉండేవాళ్లం. పోలీస్ ఇంటరాగేషన్‌లో ఎమర్జెన్సీ టైంలో ఎక్కడున్నారని అడిగారు. గత ఆరునెలలుగా మెహిదీపట్నంలో ఉంటున్నాం అని చెప్పా. అప్పుడు ఆ పోలీస్ అధికారి "మా ఇంటి పక్కనే ఉంటున్నారు, కానీ మాకు దొరకడం లేద"ని అన్నారు. అజ్ఞాతం నుంచి బయటకొచ్చాక ఏం చేయాలనుకుంటుంటే రవీంద్రనాథ్ అని ఫ్రెండ్ ఉండేవాడు. తను లెఫ్టిస్ట్. తను 'నీకు సినిమా అయితే బాగుంటుంది' అని చెప్పి తీసుకెళ్లాడు. తర్వాత దర్శకుడు గౌతమ్‌ఘోష్ పరిచయం కావడం, సినిమా తీయడం జరిగింది.

మీది భూస్వామ్య కుటుంబం. కానీ వామపక్ష భావజాలం వైపు వెళ్లడానికి ఎవరైనా వ్యక్తులు కారణమా? సంఘటనలా?

ఇక్కడ మీకో విషయం చెప్పాలి. ఇప్పటి వరకు నేనీ విషయాన్ని ఎక్కడా చెప్పలేదు. ఒకరోజు నేను ఫైన్ ఆర్ట్స్‌లో కాలేజ్‌లో అడ్మిషన్ కోసం వెళ్లాను. అక్కడ అందరూ బొమ్మలు గీస్తున్నారు. నేను వెళ్లి టెస్టు రాద్దామని కూర్చున్నాను. ఒక బ్లేడ్ ఇచ్చి గీయమన్నారు. అది కూడా గీయరాలేదు. టెస్టు పాసైతేనే సీటొస్తుంది. నాకు గురుమూర్తి అని ఫ్రెండ్ ఉండేవాడు. తను అక్కడ పనిచేసే విఠల్ అనే టీచర్‌తో 'తను నటుడు' అని పరిచయం చేశాడు. ఆయన నాటకాలు రాస్తుంటాడు, ఆడిస్తుంటాడు. అతను నా దగ్గరకొచ్చి బేరంపెట్టాడు. 'నువ్వు నాటకాలు వేస్తావట కదా! వేస్తావా?' అని అడిగాడు. 'వేస్తాన'ని చెప్పాను. అప్పటికే రవీంద్రభారతిలో నాటకాలు వేశాను. ఆయనే ఫైన్‌ఆర్ట్స్‌లో సీటిప్పించాడు. మా రూమ్మేట్ రవీంద్రనాథ్ పక్కా కమ్యూనిస్టు. ఆయన ఆ పుస్తకాలన్నీ తెచ్చేవాడు. నాకు కమ్యూనిజం నచ్చేది కాదు. మా ఇద్దరి మధ్య రోజూ మాటల యుద్ధం నడిచేది. 'రెండేళ్లు ఆగు, వాళ్లు వీళ్లు, వీళ్లు వాళ్లు' అవుతారు అని అనేవాడు. కాలక్రమేణా శ్రీశ్రీ 'మహాప్రస్థానం', గోర్కీ 'అమ్మ' పుస్తకాలు పరిచయం చేశాడు. అవి చదివాక నాలో చాలా మార్పు వచ్చింది.

మీ బ్రదర్స్, సిస్టర్స్ ఎంత మంది?

బ్రదర్స్ ఐదుగురు, సిస్టర్ ఒకరు.

'దాసి' సినిమా తరువాత మీ బంధువులు, మీ కమ్యూనిటీ వాళ్లు ఏమీ అనలేదా?

చెబితే నమ్మరు కానీ ఇప్పటికీ మా బంధువుల ఇళ్లల్లో శుభకార్యాలకు వెళితే అందరూ విష్ చేస్తారే తప్ప పెద్దగా మాట్లాడరు. ఇప్పటికీ వారికి నేను నక్సలైట్‌నే! వాళ్ల వారిలో ఒకరిగా నన్ను కౌంట్ చేయరు.



'దాసి' షూటింగ్‌లో..

'దాసి' సినిమా ఆల్‌టైం హిట్. దొరల గడీల్లోనే పెరిగిన మీరు ఆ సినిమాను ఎలా తీయగలిగారు. ఆ సినిమాలో చూపించిన సన్నివేశాలు మీ ఇంట్లో చూశారా?

ఆ రోజుల్లో అంటరానితనం చాలా ఎక్కువగా ఉండేది. అయితే మా నాన్న అలాంటివి పట్టించుకునే వాడు కాదు. అభ్యుదయవాది. నేను ఆరేడేళ్ల వయస్సున్నప్పుడు మా ఇంట్లో అరవై, డెబ్బై మంది పనివాళ్లు ఉండేవారు. ఉదయాన్నే లేచి చలికాచుకునే వారు. నేను ఎప్పుడైనా పొద్దున లేస్తే వెళ్లి మంట దగ్గర కూర్చుంటే వాళ్లు దూరం జరిగేవాళ్లు. వాళ్లనూ, వాళ్ల పేదరికాన్నీ చూస్తే బాధనిపించేది. మా ఇంటి పక్కన గొల్లోళ్లు ఉండేవారు. మా ఇంట్లో తెలియకుండా వాళ్ల ఇంటికెళ్లి కూర్చుండేవాణ్ణి. మా చుట్టాల ఇంటికెళ్లినప్పుడు పనివాళ్లను బండ బూతులు తిట్టడం విన్నాను. ఆ అనుభవంతోనే 'మా ఊరు' సినిమాకు డైలాగులు రాశాను. నేను విన్నవే రాశాను.

నాన్న ప్రభావం చాలా ఉంది

మా నాన్న ఆర్య సమాజాన్ని ఇష్టపడే వాడు. అబ్దుల్ రెహమాన్ అని ఒక రజాకార్ మా నాన్నను చంపాలని ప్రయత్నించాడు. దాంతో మా నాన్న సొంత ఊరికి పారిపోయాడు. నన్ను కూడా అక్కడికి తీసుకెళ్లాడు. తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది. మిలిటరీ యాక్షన్ అయిపోయింది. దాంతో మేం మళ్లీ హైదరాబాద్ వచ్చేశాం. మొజాంజాహీ మార్కెట్ పక్క గల్లీలో మా టికానా ఉండేది. ఒకరోజు నేను కాలేజ్ నుంచి వచ్చేసరికి మా నాన్న ఒక గడ్డం ఉన్న వ్యక్తితో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. కాసేపయ్యాక అతను వెళ్లిపోయాడు. మా నాన్న నన్ను పిలిచి 'తను ఎవరో తెలుసా?' అని అడిగాడు. 'ఎవరు?' అన్నాను. 'అబ్దుల్ రెహమాన్' అన్నాడు.

చదివింది పీయూసీ కదా! ఇంగ్లీష్ భాష మీద అంత పట్టెలా వచ్చింది?

నా జీవితంలో ఏదీ నేను గురుతః నేర్చుకోలేదు. నా సొంతంగా ప్రాక్టీస్ ద్వారా నేర్చుకున్నాను. ఒక్క పెయింటింగ్ మాత్రమే ఫైన్ ఆర్ట్స్ కాలేజ్‌లో నేర్చుకున్నాను.

మీకు చాలా చిన్న వయసులో పెళ్లయింది అనుకుంటా?

17 ఏళ్ల వయసులో పెళ్లయింది. 22 ఏళ్లకే నలుగురు పిల్లలు.

పిల్లలు ఏం చేస్తున్నారు?

ఒక అమ్మాయి ఎంఎ ఇంగ్లీష్ లిటరేచర్ చేసింది. పెద్దబ్బాయి ఆటోమొబైల్స్‌లో ఉన్నాడు. రెండోవాడు కంప్యూటర్‌సైన్స్. మూడోవాడు ఫిల్మ్‌మేకింగ్.

మాభూమి, 'దాసి'లాంటి సినిమాలు తీసిన మీకు 'హరివిల్లు' సినిమా తీయమని రామానాయుడు ఆఫర్ ఎలా ఇచ్చారు?

రామానాయుడుకు నాతో సినిమా తీయాలని కోరిక. ఏదో కథ అనుకున్నాం కానీ కుదరలేదు. ఒకసారి చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లాము. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల సినిమాలకు సబ్సిడీ కూడా ఇస్తోందప్పుడు. చేస్తే మనం బాగుంటుందేమో అంటే 'మీరు రేపే రండి! మాట్లాడదాం' అన్నారు. నేను చెప్పిన కథ నచ్చింది. అలా 'హరివిల్లు' సినిమా వచ్చింది.

ఇటీవల కాలంలో మీరు కమర్షియల్ సినిమాలు చూస్తున్నారా?

పెద్దగా లేదు. గత ముప్పై నలభై ఏళ్లుగా నేను థియేటర్‌కు వెళ్లింది నాలుగైదు సార్లే అనుకుంటా. ఇప్పుడొచ్చే సినిమాలు చూస్తుంటే మనల్ని ఫూల్స్‌ని చేస్తున్నట్టుంటుంది... 'మీరు తెలివితక్కువ వాళ్లు. మీకేం తెలీదు' అని! కథ ముందే అర్థమవుతుంది. ఇంక అందులో ఏముంటాయి? చూసి ఎంజాయ్ చేయడమంటే... పాటలు, ఆటలు వంటి వెకిలి చేష్టలే తప్పించి మనల్ని సంతోష పెట్టే విషయం నాకు పెద్దగా కనిపించదు. ఈ సినిమాలే కాదు... ఇంటర్‌నేషనల్ ఫిలిమ్స్‌లో కూడా ఐదు నిమిషాలు నన్ను ఎట్రాక్ట్ చేయకపోతే బయటకు వచ్చేస్తా.

మిమ్మల్ని బాగా ఎట్రాక్ట్ చేసిన సినిమాలేంటి?

కొన్ని వందల సినిమాలున్నాయి. కానీ కమర్షియల్ కాదు.

మీరు తీసిన సినిమాలకు బెస్ట్ కాంప్లిమెంట్ కానీ, విమర్శ కానీ ఉన్నాయా?

చాలా అభినందనలు వచ్చాయి. 'రంగుల కల' చూసిన తరువాత సరోజినినాయుడు తమ్ముడు హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆరుద్ర గారు 'ఆంధ్రజ్యోతి'లో 16 పేజీల రివ్యూ రాశారు. నేను చేసిన కొన్నిటికైనా చాలా మంచి ప్రశంసలు వచ్చాయి. 'దాసి' చూశాక బెంగాల్ ప్రముఖ దర్శకుడు తపన్ సిన్హా, కర్ణాటకకు చెందిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత యూఆర్ అనంతమూర్తి, రాజ్‌కపూర్ పెద్ద కుమారుడు రణధీర్ కపూర్ వేర్వేరు సందర్భాల్లో ఒకే మాట అన్నారు... 'మై కంట్రీ ఈజ్ ప్రౌడ్ ఆఫ్ యూ' అని! మా అమ్మ, నాన్నలిద్దరూ ఆనందించారు.

సాధారణంగా వేలెత్తి చూపినట్టుంటాయి కదా మీ సినిమాలు..!

అంటే... నాకు నేను చూపించుకోవడం (నవ్వు). ఐ యామ్ ద వన్ ఆఫ్ ద రిప్రజెంటివ్ ఆఫ్ ద ఫ్యూడల్ ఫ్యామిలీ! నేను చెప్పేదేంటంటే... కాలానికి తగ్గట్టు మారుతుండాలని! మనిషిని మనిషిగా చూడండన్న సందేశం తప్ప వాటిల్లో ఏమీ లేదు.

మీరు తీవ్రమైన వామపక్ష ప్రభావితం నుంచి ఇప్పటిదాకా ప్రయాణం చేశారు కదా! ఇంకా వామపక్ష భావజాలానికి ఉనికి గానీ, భవిష్యత్తు గానీ ఉందని నమ్ముతున్నారా?

వామపక్ష భావజాలమన్నది సిద్ధాంతమే కాదు... ఒక జీవన విధానం. మనుషులంతా సమానంగా ఉండాలన్న ధోరణిలో నుంచి వచ్చిందది. మార్క్స్ వెరీ రిచెస్ట్ పర్సన్. అంటే కమ్యూనిజంలో ఎలాంటి తప్పూ లేదు. జీవితంలో ఎప్పుడూ భిన్న భావజాలాలు ఉంటాయి. అక్కడ ఘర్షణ ఉంటుంది. అదెప్పటికీ ఉండాలి. మార్క్స్ స్టేట్ మిషనరీ పోవాలంటాడు. కానీ అది బలవంతంగా రద్దు చేయకూడదంటాడు. కొమ్మకు ఆకు పండి ఎలా రాలిపోతుందో అలా రాలిపోవాలంటాడు. అలాగే... సమాజానికి కమ్యూనిజం పనికిరానప్పుడు దానంతట అది రాలిపోతుంది. కమ్యూనిజం వంటివన్నీ పేదరికం నుంచి వచ్చాయి. పేదరికాన్ని మనం

'బాహుబలి' వాపే కానీ బలుపు కాదు...

'బాహుబలి' చూశాను. అది వాపే కాని... బలుపు కాదు. అందులో రాజమౌళి యుద్ధం, భల్లాలదేవకు సంబంధించి క్రోధం చూపిస్తాడు. దానికి అతను ఎంతో సమయం తీసుకోనుండచ్చు... ఖర్చు పెట్టి ఉండొచ్చు. కానీ నా 'దాసి' సినిమాలో అంత కోపాన్ని ఒక్క ఎక్స్‌ప్రెషన్‌లో చూపించాను. అంత కష్టపడక్కర్లేదు. అయితే టెక్నికల్‌గా రాజమౌళి మనం కూడా ఇట్లా చేయొచ్చని ధైర్యం చేసి తీశాడు. అందుకు అతన్ని అభినందిస్తాను. కానీ... దాన్ని హాలీవుడ్‌తో పోల్చలేం. హాలీవుడ్ పద్ధతిలో చేశాడు అంతే. ఉదాహరణకు 'బెన్‌హర్' సినిమాలో గుర్రపు బగ్గీల సీన్‌కు 110 కెమెరాలు ఆ రోజుల్లో పెట్టారు. హాలీవుడ్‌లో దర్శకుడంటే కేవలం దర్శకత్వ బాధ్యతలే చూస్తాడు. కాస్ట్యూమ్స్ బాధ్యత వేరొకరిది. అంతా ప్రొఫెషనల్‌గా ఉంటుంది. కానీ మన దగ్గర దర్శకుడే కథ, పాటలు, ఎడిటింగ్... అన్నీ చేస్తాడు.



నిర్మూలించగలిగితే ఏ ఇజమూ ఉండదు! కానీ చేశామా? భవిష్యత్తులో చేయగలమా? భారత్ నిదానంగా ఒక్కోటీ అధిగమిస్తూ ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. ఉదాహరణకు 'బాహుబలి' తీయడం చిన్న విషయం కాదు. 'మేం కూడా చేయగలం' అనే సందేశాన్ని పంపిందా సినిమా. ఆ క్రమంలో తప్పకుండా అభినందిస్తాను. మన స్థాయిలో మనకది హాలీవుడ్ మూవీనే! చెప్పేదొక్కటే... కమ్యూనిజం గురించి ఆలోచించే ముందు... మన సమస్యల్ని మనం ఎంత వరకు పరిష్కరించుకోగలిగామన్నది నేను ఆలోచిస్తుంటాను. ప్రజలు చాలా బాధ పడుతున్నారు. మన ప్రభుత్వాలవి కేవలం స్కీములు మాత్రమే. రాజీవ్‌గాంధీ ఒకసారి చెప్పారు... 'నేను రూ.100 సామాన్యుడి కోసం విడుదల చేస్తున్నాను. కానీ రూ.5 కూడా వారికి చేరడం లేదు' అని! కానీ... ఇప్పుడు కేసీఆర్ స్కీమ్స్‌లో రూ.60.-రూ.70 రూపాయలు వెళుతున్నాయి. ఇది కమ్యూనిజానికి కూడా ఒక సమాధానం లాంటిది. అయితే ఈ ప్రభుత్వాలు ఎంత వరకు ఉంటాయి... ఎంత వరకు సస్టెయిన్ అవుతాయి... ఎంత వరకు ఈ దేశాన్ని మార్చే పరిష్కారాలు వెతుకుతాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

గతంలో ఇరవయ్యేళ్ల వయసులో కమ్యూనిజం భావాలు వాటంతటవే పొంగుకొచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు!

ఇప్పుడు మొత్తం సోషలాజికల్ సిస్టమ్ మారిపోయింది. ఆలోచనా విధానం మారింది. మా రోజుల్లో మేం చాలా రొమాంటిక్‌గా ఉండేవాళ్లం. కానీ ఇప్పుడు కుర్రాళ్లు చాలా ప్రాక్టికల్.

తెలంగాణలో నక్సలైట్ల ఉద్యమం మీద సినిమా తీద్దామని మీకు ఎందుకు అనిపించలేదు?

ఐ వజ్ ఏ పార్ట్ ఆఫ్ ఇట్! (నవ్వు). అలాంటి సినిమాలు తీయాలంటే... వన్ షుడ్ బి వెరీ హానెస్ట్ టూ ద సబ్జెక్ట్. అదీ కాకుండా వెరీమచ్ కాంటెంపరరీ. నారాయణ మూర్తి, కె.ఎ.అబ్బాస్ లాంటి వాళ్లు చేశారు. కానీ తరువాతి రోజు వాళ్లు దులుపుకోగలరు. కానీ నర్సింగరావు అలా కాదు కదా! అందులోని అణువణువూ సపోర్ట్ చేసుకోవాలి. అంత ఆథెంటిక్‌గా ఉండాలి. నా ఉద్దేశంలో నక్సలైట్ ఉద్యమంపై ఎవరూ సీరియస్‌గా చేయలేదు. పొయిట్రీ రాయడం మొదలు పెట్టిన తరువాత నాలో కూడా తాత్విక ధోరణి వచ్చింది. బహుశా వయసుతో వస్తుందేమో అది! సో... ఇప్పటికీ నేను ప్రజలను ప్రేమిస్తుంటాను. సంఘీభావం ప్రకటిస్తుంటాను. కానీ ఇప్పుడు నక్సలైట్లు ఏంచేస్తుంటారంటే నేను చెప్పలేకపోవచ్చు.

గద్దర్‌తో మీకు అంత పరిచయం ఎప్పుడయింది?

గద్దర్ నా వద్దకు వచ్చాడు. జననాట్యమండలికి సంబంధించిన 'ఆర్ట్ లవర్స్' అని ఉండేది. అలా విప్లవాత్మక కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు వచ్చాడు. 'నేను బుర్రకథలు అవీ చెబుతాను' అంటే... మేం అతనికి ట్రైనింగ్ ఇచ్చాం. నాకంటే వయసులో ఒకటి రెండేళ్లు చిన్నవాడు. వియ్ ఆర్ లైక్ బ్రదర్స్. గద్దర్ నుంచి కూడా నేను చాలా నేర్చుకున్నాను. ఎందుకంటే నా జీవితంలో అంత పెద్ద కళాకారుణ్ణి చూడలేదు. అంత వైబ్రెంట్ ఆర్టిస్ట్.



'హరివిల్లు' షూటింగ్‌లో..

మీకు కనెక్ట్ అయిన పర్సన్స్ కూడా వామపక్ష భావజాలం ఉన్న వాళ్లే!

ఆర్ట్ లవర్స్ నుంచి జననాట్య మండలి పుట్టింది. దాంట్లో నుంచి వచ్చిన మూవ్‌మెంటులో నుంచి వచ్చిన వాళ్లే ఈ రోజున్న అందెశ్రీ, గోరటి వెంకన్న, రసమయి బాలకిషన్, సంధ్య, విమల వంటివారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అక్కడ ప్రజా కవులు కీలక పాత్ర పోషించారు. అలాంటి మూవ్‌మెంట్ 1970ల్లో ఇక్కడ వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో కూడా అదే ముఖ్య భూమిక వహించింది. ఐ యామ్ ద పర్సన్ హూ స్టార్టెడ్ అని కాదు... ఐ యామ్ ద పర్సన్ హూ పార్టిసిపేటెడ్! దట్స్ వాట్ ఐ బిలీవ్.

మిమ్మల్ని ఎవరూ సాంఘిక బహిష్కరణ చెయ్యలేదా?

(నవ్వు)... నక్సలైట్లంటే భూస్వాములకు ఎందుకు భయం? వాళ్లు చంపుతారో... లేక ఉన్నది లాక్కెళతారో అనే కదా! నా దగ్గర ఏమీ ఉండదు కాబట్టి నాకు బాధ లేదు. 1991లో నేనో కవిత రాశాను...

కళ్లు తెరిచే సరికి తల్లి ఒడిలో... ఊహ వచ్చే సరికి ఊరి బడిలో
జీవితాంతం సంసార సాగరం... ఒంటరిగానే అంతిమ పయనం

...మనం ఏం తేలేదు... ఏం తీసుకుపోలేం. ఈ లోపలనే ఎందుకు ఇన్ని ఆరాటాలు!

మీ బాపూ నుంచి ఏదన్నా పొలం వచ్చిందా?

200ఎకరాలు వచ్చింది. అంతా కరిగించేశాను (నవ్వు). ఇప్పుడుంటున్న ఇల్లు, రెండున్నర ఎకరాల భూమి ఉంది. ఐ యామ్ వెరీ హ్యాపీ.

చంద్రబాబు, పీవీ నరసింహారావుతో కొంత కాలం పనిచేశారు. రాజకీయపరంగా ఎందుకు ఆలోచన చెయ్యలేదు?

నేను రాజకీయాలు వాళ్లతో ఎప్పుడూ మాట్లాడలేదు. రామారావు గారు కానీ, చంద్రబాబు గారు కానీ, పీవీ గారితో కానీ సాంస్కృతిక విషయాలు మాట్లాడేవాళ్లమంతే. రాజకీయాల్లో బాధలే కానీ... సుఖాలున్నాయని అనుకోను.

కేసీఆర్‌తో మీకు పరిచయం లేదా?

వ్యక్తిగతంగా పరిచయం లేదు. మా అన్నయ్య కాంతారావుకు పరిచయం ఉంది.

మీ జీవన శైలి, ఆలోచనా విధానంతో పూర్తిగా సంతృప్తిగా ఉన్నారా?

నా జీవితం పట్ల నాకు 200 పర్సెంట్ సంతృప్తి ఉంది.

మరి ఒక భర్తగా, ఒక తండ్రిగా వాళ్లకి ఎంత ఆనందాన్ని ఇచ్చి ఉంటారు?

తక్కువ. కానీ రాధాకృష్ణగారూ... ఒక వైపునకు వెళితే ఇంకో వైపు పోతుంది. కావాలని ఇబ్బంది పెట్టలేదు. నా కార్యక్రమాలతో వాళ్లు ఇబ్బంది పడుంటారు. కానీ వాళ్లు నా పట్ల చాలా హ్యాపీ. నా వల్ల ఇబ్బంది పడుతున్నామని ఎప్పుడూ అనలేదు.

మీ జీవితంలో మంచి అనుభూతినిచ్చిన సంఘటనలేమున్నాయి?

శాంతినికేతన్‌లో ఫ్యాకల్టీ నా లెక్చర్ విని 'చాలా బాగుంది. ఇంకా మాట్లాడండి' అన్నప్పుడు ఎంతో ఆనందించాను. నాకు అక్కడ చదువుకొనే అవకాశమే రాలేదు... అలాంటిది లెక్చర్ ఇవ్వడానికి వెళ్లడం మరిచిపోలేని అనుభూతి. అలాగే ఏమీ చదువుకోని వాడిని... గురుత నేర్చుకోలేనివాడిని... రైస్ యూనివర్సిటీలో 8 గంటలు మాట్లాడా. వీటితోపాటు 'రంగుల కల' సినిమా చూసి హరీంద్రనాథ్ చటోపాధ్యాయ వంటి మహానుభావుడు కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు నేనడిగాను... 'వాట్ ట్రబుల్డ్ యూ' అని! 'మళ్లీ నాలో కళాకారుడిని చూసుకున్నా' అన్నారు. గద్దర్‌కు నేను గురువునా... నాకు గద్దర్ గురువా అని పేచీ వచ్చినప్పుడు హరీంద్రనాథ్ చటోపాధ్యాయ ఒక మాటన్నాడు.... 'వియ్ ఆర్ గురూస్ టూ ఈచ్ అదర్' అన్నాడు. అలాంటి గొప్పవారి సాంగత్యం ఉంది నాకు. అలాగే... గ్రేట్ ఫిలిం మేకర్ శ్యాంబెనగల్‌ను చూశాను. ఆయనది అల్వాల్. నా 'మావూరు' సినిమా చూశాక నా అడ్రెస్ కనుక్కొని ఉత్తరం రాశాడు. 'నీ డాక్యుమెంటరీ టీవీలో చూశాను. ఇది ఇప్పటి వరకు తెలంగాణపై వచ్చిన అన్నింటిలో అత్యుత్తమమైంది' అని ఆ ఉత్తరంలో శ్యాంబెనగల్ రాశాడు.

మిమ్మల్ని బాధించిన సంఘటనలున్నాయా?

చాలా ఉన్నాయి. జీవితంలో చాలా బాధ ఉంది. ముఖ్యంగా స్త్రీ జీవితంలో! నేను 'దాసి' తీయడానికి కారణం కూడా అదే. దీని కోసం నేను సేకరించిన మెటీరియల్‌లో 15-20 శాతం కన్నా ఎక్కువ తీయలేకపోయా. అందులో ఒక ల్యాండ్‌లార్డ్ ఉన్నాడు. అతని పేరు చెప్పదలుచుకోలేదు. అతను దాసితో గడుపుతాడు. ఆ క్రమంలో దాసికి కొడుకు పుడతాడు. తరువాత దొరసానికి కొడుకు పుట్టాడు. వాడు పెద్దవాడైన తరువాత దాసిని గదిలోకి తీసుకెళ్లి తలుపేసుకున్నాడు! అదీ దాసి కొడుకు ముందు! ఇలాంటి సంఘటనలు వందలు.. వేలు. ఇప్పుడు పెద్ద పెద్ద హోటల్స్‌లో కూడా జరుగుతున్నాయి. దాసి... దొరలే కాకుండా ఈ ప్రపంచంలో చాలా బాధలున్నాయి. అయితే విమెన్ ఈజ్ ఆల్వేస్ టార్గెటెడ్. అందుకే నా సినిమాల్లో స్త్రీకి బలమైన పాత్రలుంటాయి.

మీ నుంచి భవిష్యత్తులో ఒక సినిమా ఎక్స్‌పెక్ట్ చేయవచ్చా?

తప్పకుండా!

ఎప్పుడు చేస్తారు?

మీ మీడియా ఎప్పుడు ఎంకరేజ్ చేస్తే అప్పుడు! (నవ్వుతూ). చెయ్యాలని ఉంది. ఇప్పుడు అనుకుంది కూడా పెయిన్‌ఫుల్ సబ్జెక్టు. ఉదాహరణకు ఒక బాధాకర సంఘటన జరుగుతుంది. దానికి మనిషి ఏడుస్తాడు. ఏడ్చిన తరువాత మనసు తేలిక పడుతుంది. సినిమా తీయడమంటే ఓ పెద్ద ఏడుపు. 'దాసి' తరువాత దాని గురించి నేను ఆలోచించను. ఆ ఎపిసోడ్ అయిపోయింది.

మరో మంచి ఆణిముత్యం లాంటి సినిమా మీ నుంచి రావాలని కోరుకొంటూ థ్యాంక్యూ వెరీమచ్ అండీ!

థ్యాంక్యూ!

ఆయన ఒకే అంటే... నేను రీటేక్ అన్నా!

'హరివిల్లు' సినిమా సమయంలో నాకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ముందే చెప్పాను. అలానే ఇచ్చారు. షూటింగ్ దగ్గరకొస్తే రామానాయుడు గారే డైరెక్షన్ చేస్తారని అంటారు. ఒకరోజు షూటింగ్‌కొచ్చారు. ఒకసీన్ తీస్తున్నాం. రెండు టేక్‌లు చేశాం. అప్పుడు రామానాయుడు గారుండి 'ఫరవాలేదు డబ్బింగ్‌లో మేనేజ్ చేసుకోవచ్చు. షాట్ ఒకే' అన్నాడు. నిజానికి డబ్బింగ్‌లో చూసుకోవచ్చు. కానీ రామానాయుడు ఇన్‌వాల్వ్ అయ్యాడు కదా! అందుకే రీటేక్ అన్నాను. దాంతో ఆయనకు అర్థమయిపోయింది. మళ్లీ షూటింగ్ దగ్గరకు రాలేదు.

Dwaraka

నయా మొబైల్

ఇది ఇంటెలిజెంట్ ఫోన్ గురూ..!



స్మార్ట్‌ఫోన్‌ల నుంచి ఇంటెలిజెంట్ ఫోన్లకు మారిపోయే సమయం వచ్చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు) ఫీచర్ ఉన్న స్మార్ట్‌ఫోన్‌ను 'హానర్' కంపెనీ విడుదల చేసింది. 'హానర్‌వ్యూ 10(ఏఐ)' పేరుతో విడుదల చేసిన ఈ మొబైల్ ఈరోజు నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటోంది. పవర్‌ఫుల్ కిరిన్ 970 చిప్‌సెట్, న్యూరల్ నెట్‌వర్క్ ప్రాసెసింగ్ యూనిట్(ఎన్‌పియూ) అద్భుతమైన పనితీరును అందిస్తుందని కంపెనీ చెబుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూజర్ బిహేవియర్‌ను అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా పనిచేస్తుంది. 'రియల్‌టైమ్ సీన్', 'ఆబ్జెక్ట్ రికగ్నిషన్' టెక్నాలజీ ఇందులో ఉంటుంది. అంతేకాకుండా ఈ ఫోన్‌లో స్పెషల్ 'గేమింగ్ సూట్' ఉంది. ఇది మొబైల్ గేమ్స్ పర్‌ఫార్మెన్స్‌ను మెరుగుపరుస్తుంది. 'విజన్ ఇంజన్' ఫీచర్ సహాయంతో ఫొటోల రిజల్యూషన్‌ను పెంచుకోవచ్చు. 3750 ఎంఎహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఉంటుంది. 30 నిమిషాల్లో 50 శాతం చార్జింగ్ అవుతుంది. 20 మెగాపిక్సెల్ డ్యుయల్ లెన్స్ కెమెరాతో నాణ్యమైన ఫొటోలు తీసుకోవచ్చు. ఎస్‌డీకార్డుతో 256 జిబి వరకు స్టోరేజ్ పెంచుకోవచ్చు. దీని ధర రూ.29,999.

నయా గ్యాడ్జెట్

మదిని దోచే వాచ్!



కొన్ని వస్తువుల విలువ పోయినప్పుడు తెలిసినట్టే.. కొన్ని వస్తువులను వాడటం మొదలుపెట్టాకే వాటి విలువ తెలుస్తుంది. వాటి ద్వారా లభించే సౌలభ్యం, సౌకర్యాలను తలచుకొని ఆశ్చర్యపోతాం. హువావే 'స్మార్ట్ వాచ్' కూడా అలాంటి విలువైన వస్తువే. ఈ వాచ్ మూడు రంగుల్లో లభిస్తుంది. ఎఎమ్‌వో ఎల్ఈడీ డిస్‌ప్లే ఆకట్టుకుంటుంది. ప్లాస్టిక్, స్టెయిన్‌లెస్ స్టీల్‌ను వాడటం వల్ల ఆకర్షణీయంగా ఉండటంతో పాటు తక్కువ బరువుంది. సందర్భానికి తగ్గట్టు వాచ్ బెల్ట్‌లు మార్చుకోవచ్చు. వాటర్, డస్ట్ రెసిస్టెన్సీ ఉండటం వల్ల వ్యాయామం చేసే సమయాల్లోనూ వాడొచ్చు. 768 ఎంబీ ర్యామ్‌తో 4 జీబీ ఫ్లాష్ మెమొరీ వస్తుంది. 4జీ సపోర్ట్ చేస్తుంది. ఫోన్ మర్చిపోయినా వాచ్‌తో పనులు చక్కబెట్టుకోవచ్చు. వైఫై ద్వారా ఫోన్‌కు కనెక్ట్ అయితే చాలు కాల్స్ చేయవచ్చు, రిసీవ్ చేసుకోవచ్చు. కాంటాక్ట్స్, యాప్‌లు అన్నీ అందుబాటులోకి వస్తాయి. గంట ఛార్జింగ్ పెడితే బ్యాటరీ ఫుల్ అవుతుంది. రోజంతా సరిపోతుంది. మైక్ నోటి దగ్గర పెట్టుకొని మాట్లాడితే చాలు టైప్ చేయకుండానే మెసేజ్‌లు పంపొచ్చు. ధర రూ. 20,999

టెక్ సందేహాలు

ఆటోమేటిక్‌గా రీస్టార్ట్ అవుతోంది!



ఈ మధ్య నా విండోస్ కంప్యూటర్‌ని అప్‌డేట్ చేసినప్పటి నుండి, కాసేపు పిసిని అలా వదిలేసి పక్కకు వెళితే ఆటోమేటిక్‌గా రీస్టార్ట్ అవుతూ ఉంది. దీనికి కారణం తెలుపగలరు.


- ప్రమీల, హైదరాబాద్

సహజంగా విండోస్ కొత్త అప్‌డేట్ ఇన్‌స్టాల్ చేసిన ప్రతీసారీ అది ఇప్పటికే మన కంప్యూటర్లో వాడుతున్న అన్ని హార్డ్‌వేర్ పరికరాలూ, సాఫ్ట్‌వేర్లతో కంపాటబుల్ అయ్యేదిగా ఉండాలి. మైక్రోసాఫ్ట్ సంస్థ ఒక అప్‌డేట్‌ని విడుదల చేసే ముందే దాన్ని ఇన్‌సైడర్ బిల్డ్‌ల ద్వారా రకరకాల యూజర్ల కాన్ఫిగరేషన్లలో అది ఎలా పనిచేస్తోందో పరీక్షించి, ఏవైనా సమస్యలు ఉంటే సరిచేసి ఫైనల్ వెర్షన్ విడుదల చేస్తుంది కాబట్టి పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ కొన్ని అరుదైన సందర్భాల్లో మీరు వాడుతున్న ఏంటీవైరస్ వల్ల కావచ్చు, ఇంకా ఇతర సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లు తాజా అప్‌డేట్‌తో కంపాటబుల్ అవనప్పుడు కెర్నల్ స్థాయిలో మెమరీ మేనేజ్‌మెంట్ సక్రమంగా అవక కంప్యూటర్ రీస్టార్ట్ అవుతూ ఉంటుంది. మైక్రోసాఫ్ట్ సంస్థ తదుపరి అప్‌డేట్‌ని విడుదల చేసే వరకూ ఓపికగా వేచి చూడడం తప్పించి ఈ విషయంలో చెయ్యగలిగిందేమీ లేదు.

ఫొటోల క్వాలిటీ ఎందుకు తగ్గుతుంది?



బ్లూటూత్‌తో బ్యాటరీ ఖర్చవుతుందా?



మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

టెక్ గురు



ఎంత పెద్ద నేరమైనా సరైన ఆధారం లేకపోతే శిక్ష పడడం కష్టం. ఎన్నో తరాల తరబడి సమాజంలో నేరాలు జరుగుతూనే ఉన్నా తగిన ఆధారాలు లేక కొట్టి వేయబడేవి. కానీ ఇప్పుడిప్పుడే టెక్నాలజీ నేరస్తులకి సింహస్వప్నంలా నిలవడం మొదలుపెట్టింది. అది ఎంతగా అంటే నేరాలు చేయాలంటేనే భయపడేటంతగా! ముఖ్యంగా టెక్నాలజీలో సిసి కెమెరాలు, స్పై కెమెరాలు ఎన్నో కీలకమైన విషయాలను బంధించి ప్రపంచం ముందుంచుతున్నాయి. వాటి గురించి ఇప్పుడు చెప్పుకుందాం.

కెమెరా కన్నుతో

నేరాలకు ఫుల్‌స్టాప్

సెక్యూరిటీ కెమెరాలు

ఫోరెన్సిక్ చాలా శక్తివంతం

దుర్వినియోగం అవకుండా..

మార్ఫింగ్ చేస్తారా?

స్పై కెమెరాలు

పలు రూపాల్లో..



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

టెక్ గైడ్

లాగిన్ హిస్టరీ చూడండిలా!



మార్కెట్లోకి కొత్త ఫీచర్లతో మొబైల్ రాగానే మనసు లాగేస్తుంది. వెంటనే కొనేస్తాం. అలా పదుల సంఖ్యలో ఫోన్లు మార్చేసి ఉంటాం. కొత్త ఫోన్ తీసుకోగానే ఫేస్‌బుక్ ఇన్‌స్టాల్ చేసుకుంటాం. మళ్లీ లాగిన్ అవుతాం. మరి ఇన్నేళ్లలో ఎన్నో డివైజ్‌ల నుంచి లాగిన్ అయి ఉంటారు. ఆ వివరాలు తెలుసుకోవాలా? అయితే ఇలా చేయండి!

- మీ స్మార్ట్‌ఫోన్‌లో ఫేస్‌బుక్ యాప్‌ని ఓపెన్ చేయండి.
- పైభాగంలో కార్నర్‌లో ఉన్న త్రీలైన్ ఐకాన్‌పై క్లిక్ చేయండి. ఇప్పుడు మీకు యాప్ సెట్టింగ్స్ అన్నీ కనిపిస్తాయి.
- ఇందులో 'అకౌంట్ సెట్టింగ్స్' ఆప్షన్‌ను ఎంచుకోండి.
- తరువాత 'సెక్యూరిటీ అండ్ లాగిన్' ఆప్షన్‌పై క్లిక్ చేయండి.
- ఇప్పుడు మీకు 'వేర్ యుఆర్ లాగ్డ్ ఇన్' సెక్షన్ కనిపిస్తుంది. ఇందులో మీరు ఎక్కువగా లాగిన్ అవుతున్న రెండు డివైజ్‌ల పేర్లు కనిపిస్తాయి. ఇంకా ఏయే డివైజ్‌ల నుంచి లాగిన్ అయ్యారో చూడాలంటే కింద ఉన్న 'సీ మోర్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇప్పుడు మీకు పూర్తి లిస్ట్ కనిపిస్తుంది.
- ఒకవేళ మీరు ఏదైనా డివైజ్‌లో నుంచి లాగవుట్ కావాలంటే ఆప్షన్ ఉంటుంది. పేజ్ బాటమ్‌లో ఉన్న 'లాగవుట్ ఆఫ్ ఆల్ సెషన్స్' ఆప్షన్‌ను ఎంచుకోవడం ద్వారా ఒకేసారి అన్ని డివైజ్‌ల నుంచి కూడా లాగవుట్ కావచ్చు.

డైలీ సుడోకు - 72

				2	3			
	6		5			1		
9		3			1	5		
7	3					8	4	
	8	2					7	5
		1	3			7		2
		7			9		6	
			4	5				

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 71 సమాధానం

లైఫ్ లెసన్!

చీకటి జీవితాల్లో వెలుగు దివ్వె!

లూయీ బ్రెయిలీ - పుట్టుకతో అంధుడు కాడు.

1809 జనవరి 4న జన్మించాడు బ్రెయిలీ - ప్యారిస్ సమీపాన కూప్‌రే గ్రామంలో! నెలల పిల్లవాడయిన బ్రెయిలీ ముద్దుగా, బొద్దుగా, మురిపెంగా ఉండేవాడు. అచటికిచటికి అనుకోకుండా ఎచటికెచటికో పరిగెత్తే హుషారుతో తిరిగేవాడు.

తెలిసీ తెలీని పసి వయసులోనే - విన్న పాటలకి ఉన్నవి ఉన్నట్లు కూనిరాగాలు తీసేవాడు. స్టెప్పులు వేసేసేవాడు.

కానీ మూడేళ్ల వయసులో ఓ ఘటన జరిగింది.

తండ్రి సైమన్ రెన్ పని చేసుకొనే వర్క్‌షాపులోకి వెళ్లాడు బ్రెయిలీ. సైమన్ తోళ్ల వస్తువుల్ని తయారు చేసి అమ్మే వ్యాపారి. ఇంటిని ఆనుకొని చిన్న ఫ్యాక్టరీ ఉండేది. తోళ్లు కోయడం, మెలితిప్పడం, అరగ దీయడం, ఇనుప సూదులతో రంధ్రాలు చేయడం, కుట్టడం - ఇవీ అక్కడ నిరంతరం జరిగే పనులు.



ప్యారిస్‌లో 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్లైండ్ యూత్' అనే సంస్థ ఉండేది. దాన్ని వాలెంటైన్ హ్యూ అనే వ్యక్తి స్థాపించారు. అక్కడి అంధ విద్యార్థులకు నేర్పేందుకు ఆయనో పద్ధతి రూపొందించాడు. అట్ట మీద ఉబ్బెత్తుగా ఉన్న అక్షరాలను చేతులతో తడిమి అర్థం చేసుకొనే విధానం అది! కానీ దీనివల్ల చేతివేళ్లు చాలా నొప్పి పుట్టేవి బ్రెయిలీకి, ఇతర పిల్లలకు!! పైగా ఉబ్బెత్తుగా ఉండేందుకు ఆ అక్షరాలను రాగితో, మట్టితో తయారు చేసేవారు. అది మరింత మొండి విధానం.

అయినా పిల్లలందరూ అలాగే నేర్చుకొనేవారు. బ్రెయిలీ ఆలోచించాడు. తనకు ఇలా చేయటం వల్ల ఎంత నొప్పిగా ఉందో - తోటివారికీ అలాగే ఉంటుంది కదా! దీనికి పరిష్కారం లేదా! అని ఆలోచించాడు. పైగా హ్యూ అంధుడు కాడు. కాబట్టి తమ సమస్య ఏమిటో ఆయనకు అర్థం కావట్లేదని బ్రెయిలీ వాదన. ఇదే విషయాన్ని హ్యూతో కూడా చెప్పాడు. ఆయన తమ సంస్థలో చేరమనీ, చదువుసాగిస్తూ ఈ పద్ధతిని మెరుగుపరచమనీ సూచించాడు. దాంతో 1819లో బ్రెయిలీ ఆ స్కూల్లో చేరాడు.

...అప్పటికింకా అంధులకి చదువుకొనేందుకు వీలయిన పరికరాలు, విధానాలు రూపుదిద్దుకో లేదు. చాలా మొరటు పద్ధతులే ఉండేవి.



- ఆకెళ్ల రాఘవేంద్ర

కొత్త సంగతి

అతిగా ఆడటమూ జబ్బే!



ఇంట్లోని టీవీ దగ్గర నుంచి చేతిలోని స్మార్ట్‌ఫోన్ దాకా ఎక్కడైనా వీడియో గేమ్స్ ఆడే వసతి ఈ తరం పిల్లల సొంతం. దానికి తగ్గట్లే ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ వీడియో గేమ్స్ ఆడేవారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ఈ వీడియో గేమింగ్ చాలామందికి ఓ వ్యసనంగా తయారైంది. అందుకే, దీన్ని కూడా ఒక మానసిక జబ్బుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఒ) త్వరలోనే తీర్మానించనుంది. జబ్బులకు సంబంధించిన అంతర్జాతీయ వర్గీకరణలో మానసిక జబ్బుల జాబితాలో వీడియో గేమింగ్‌ను చేర్చాలని డబ్ల్యు.హెచ్.ఒ భావిస్తోంది. గేమింగ్, ఇంటర్నెట్ ఓ వ్యసనంగా తయారైన పలువురు యువతీ యువకులను ఇటీవల అధ్యయనం చేయగా, అందులో దాదాపు ఏడు శాతం మంది డిప్రెషన్, ఒత్తిడికి లోనవడం లాంటి సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. అలాగే, వాళ్ళ ప్రవర్తనలోమార్పులు వచ్చినట్లు వెల్లడైంది. కలత నిద్ర వారిని వేధిస్తున్నట్లు అర్థమైంది. నిజానికి, ఈ వీడియో గేమింగ్ పిచ్చి ఇప్పుడు కొద్దిమందిని వేధిస్తున్నప్పటికీ, రాగల సంవత్సరాల్లో అది ఓ ప్రధానమైన మానసిక ఆరోగ్య సమస్య అయ్యే అవకాశాలున్నాయి. అందుకే, ఇప్పుడు దీన్ని ఓ మానసిక జబ్బుగా పేర్కొనాలని భావిస్తున్నారు. నిజానికి, అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ ఇప్పటికే దీన్ని మానసిక జబ్బుగా వర్గీకరించింది. కొత్త ఏడాదిలో డబ్ల్యు.హెచ్.ఒ. సైతం అదే బాటలో పయనించనుందన్న మాట. అయితే, ఈ వార్త బయటకొచ్చాక ప్రపంచ ఆరోగ్య సంస్థను సోషల్ మీడియాలో విమర్శిస్తున్నవారూ లేకపోలేదు. మిగిలినవన్నీ వదిలేసి, వీడియో గేమ్‌ల మీద పడ్డారేమిటని ట్విట్టర్‌లో ట్రాలింగ్ కూడా చేస్తున్నారు.

ప్రకృతి వరం

ఆరోగ్యానికి కల్పతరువు... కలబంద

అపారమైన ఔషధ గుణాలతో పాటు ఎ, బి, సి, డి, ఇ, బి- 12 వంటి అత్యంత కీలకమై విటమిన్లు కలబందలో పుష్కలంగా ఉన్నాయి. ఇందు లోంచి లభించే 'లిపాసెస్' అనే ఎంజైము శరీరంలోని కొవ్వును చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. 'ప్రొటెనెస్' అనే ఎంజైము ప్రొటీన్లు సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. బ్రాడికీనెస్ అనే ఎంజైము కడుపులోని మంటను అరికట్టడంతోపాటు చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

- కలబందలో ప్రధానంగా 20 రకాల లవణాలు ఉంటాయి. వాటిలో ముఖ్యంగా క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, జింక్, సెలేనియం, సోడియం, మాంగనీసు, కాపరు, క్రోమియం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. జీవశక్తికి కావలసిన లవణాలను క్రమబద్ధంగా అందించే ఎలిమెంట్లుకూడా కావలసినంతగా లభిస్తాయి. కలంబందలో ఉండే సలిసైలిక్ యాసిడ్ అనేది ఒక యాంటీ బ్యాక్టీరియల్ ఇంఫ్లిమెంటరీ. ఇది రక్తం పలుచగా ఉండేలా...
- ...లను, ఈస్ట్ ఫంగైలను నాశనం చేస్తుంది.
- శరీరానికి కావలసిన 22 యాసిడ్స్‌లో 20 ఈ కలబందలో ఉన్నాయి. దీని ద్వారా దీర్ఘకాలిక మలబద్ధకం, ఎసిడిటీ, , సైనస్, సోరియాసిస్, ఎగ్జిమా, రంగు మారడం వంటి చర్మ సమస్యలు తగ్గిపోతాయి. మధుమేహం, లివర్ సమస్యలు, గౌట్, ఎముకల నొప్పులు,...



కౌన్సెలింగ్

సూర్యరశ్మి కరువైతే అంతే మరి!



నా వయసు 35. వృత్తిరీత్యా నేను సాఫ్ట్‌వేర్ ఇంజినీరును. ఎక్కువ గంటలు పనిచేసే మాట నిజమే. దీని వల్ల నిద్రించే సమయం తక్కువేనన్నది వాస్తవం. అయితే, అందుకు అనుగుణంగా మంచి బలవర్ధకమైన ఆహారమే తీసుకుంటాను. అయినా ఎప్పుడూ ఏదో ఒక రకమైన అనారోగ్యంతో బాధపడుతుంటాను. జలుబు, దగ్గు వంటి సమస్యలతో పాటు తరుచూ జ్వరం రావడం, మందులు వేసుకుంటున్నా ఎక్కువ రోజులు అది కొనసాగడం వంటివి బాగా చికాకుపెడుతుంటాయి. వీటికి తోడు అజీర్తి, మలబద్ధకం, అల్సర్ సమస్యలు కూడా వేధిస్తున్నాయి. వీటి కారణంగా, అనివార్యంగా విధులకు హాజరు కావడం, పనిమీద పూర్తిస్థాయిలో మనసును లగ్నం చేయలేకపోతున్నాను. ఈ అనారోగ్యానికి అసలు కారణమేమిటి? ఈ స్థితినుంచి బయటపడే మార్గం ఏదైనా ఉంటే చెప్పండి.

- ఎన్ ప్రభాకర్, హైదరాబాద్

మీరు తెలిపిన వివరాలను బట్టి చూస్తే, మీలోని వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గిపోయిందని స్పష్టమవుతోంది. ఎక్కువ గంటలు పని చేసే వారిలో చాలా మంది, ప్రకృతి సహజ వాతావరణానికీ, ప్రత్యేకించి సూర్యరశ్మికీ దూరమవుతారనేది వాస్తవం. మౌలికంగా సమస్త ప్రాణికోటీ సౌరశక్తి పూరితాలే అన్న సత్యాన్ని మనం ఎప్పుడూ విస్మరించకూడదు. ఆ శక్తికి దూరమవుతున్నప్పుడు వ్యాధినిరోధక శక్తి లోపించి, శరీరం నిరంతరం రోగగ్రస్తం కావడం ఖాయం. పగలూ రేయీ ఏసీ గదుల్లోనే ఉండిపోతే ఆ తడి వాతావరణానికి బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధిచెంది అక్కడ ఉండే వారు తరుచూ వ్యాధిగ్రస్తం కావడానికి కారణమవుతూ ఉంటాయి. అయితే కనీసం ఏసీలు ఆన్ చేసే ముందు ఒక అర గంట పాటు వీలైనన్ని కిటికీలు తెరిచి ఉంచితే లోపలున్న ఫంగల్ స్పోర్స్ బయటికి వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. ఇది మాటిమాటికీ వచ్చే జలుబు, దగ్గు, ఎలర్జీలకు చెక్ పెడుతుంది. దీనికి తోడు ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో కనీసం ఒక అరగంట పాటైనా సూర్యకాంతిలో వాకింగ్, జాగింగ్, రన్నింగ్ లేదా యోగా లాంటివి విధిగా చేయాలి. మిత్ర బృందంతో కలిసి సూర్యనమస్కారాలు చేసినా రోగ నిరోధకత బాగా పెరుగుతుంది. తీవ్రమైన మానసిక ఒత్తిళ్లు కూడా హార్మోన్ వ్యవస్థను దెబ్బ తీసి అనారోగ్యానికి గురి చేయవచ్చు. అందుకే వాటిని అధిగమించేందుకు మీకు నచ్చిన ఆరోగ్యవంతమైన కార్యకలాపాల్లో పాలు పంచుకోండి. ఇవి మీ ఆరోగ్య సమస్యలనుంచి బయటపడే మార్గాన్ని సుగమం చేస్తాయి.

- డాక్టర్ పి. సరస్వతి
ఫ్యామిలీ ఫిజీషియన్, హైదరాబాద్

నవజీవన గీతం


నీ కలలు నిజమవుతాయి!

కొత్త సంవత్సరంలోకి అడుగు మోపిన కాలకన్య అప్పుడే ఏడడుగులు నడిచింది. అయితేనేమిటి? వచ్చేసింది కొత్త సంవత్సరం అంటూ ఎందరెందరో ఇప్పటికీ పరవశించిపోతూనే ఉన్నారు. మరికొందరేమో.., ఏముందిలే కొత్త... క్యాలెండర్ మారడం తప్ప అంటూ తీవ్రమైన నిర్లిప్తతను వ్యక్తం చేస్తూ ఉంటారు. లోకంలో ఏదైనా చూసే మనసును బట్టి, మలుచుకునే వైనాన్ని బట్టే ఉంటుంది. 1953లో విడుదలైన శికస్త్ సినిమా కోసం శైలేంద్ర రాసిన ఈ పాటలో ఈ వైవిధ్యమే కనిపిస్తుంది. శంకర్- జైకిషన్ బాణీని మహ్మద్ రఫీ, లతామంగేష్కర్ గాత్రాలు ఉరకలు పెట్టించి, హుషారుగొలిపిన గీతమిది.

నయీ జిందగీ సే ప్యార్ కర్‌కే దేఖ్ - ఇస్ కేరూప్ సింగార్ కర్‌కే దేఖ్
ఇస్ పే జో భీ హై నిసార్ కర్‌కే దేఖ్ - నయీ జిందగీ సే ప్యార్ కర్‌కే దేఖ్
(కొత్త జీవితాన్ని ప్రేమించి చూడు - దీని రూపాన్ని అలంకరించి చూడు
ఉన్నదంతా దానికే సమర్పించి చూడు - కొత్త జీవితాన్ని ప్రేమించి చూడు)

చదువు అక్షరాభ్యాసం దగ్గరే ఆగిపోతే అరచేతిలోని అక్షరాలు అక్షరాలుగానే మిగిలిపోతాయి. కానీ, ఇంకా ఇంకా ఎదిగి భావనా ప్రపంచంలోకి విస్తరించాక ఆ అక్షరాలే మహా కావ్యాలుగా అవతరిస్తాయి. చెట్ల మీద పూలన్నీ విడివిడిగానే పూస్తాయి కానీ, వాటిని...






శైలేంద్ర

...మకరందం చేయడం కోసం వసంతాల్ని వెంటతీసుకు వస్తారు. ఆ సమయంలో అహంతో వాటిని కాదనడం ఎందుకు? ఇచ్చిపుచ్చుకోడంలోని ఆనందం మనకు తెలియనిదా? అది ఇరువురికీ మేలే. ఒక్కో జీవితం రెండు జీవితాలంతగా విస్తరిస్తుంది. వినీలాకాశంలో హృదయం ఒక విహంగమై విహరిస్తుంది.

● బమ్మెర



పి.శైలజ
మల్కాజ్‌గిరి, హైదరాబాద్
23 చుక్కలు
1 వరుస
1 వచ్చే వరకు



కె.విజయ కుమారి
కర్నూలు
18 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు



వి. ఐశ్వర్య లక్ష్మి
రాజమహేంద్రవరం
19 చుక్కలు
మధ్య చుక్క
10 వచ్చే వరకు



వి.నిషిత
30 చుక్కలు
10 వరుసలు
10 వచ్చేవరకు

గిఫ్ట్ హ్యాంపర్ విజేత

కె. సుభాషిణి
బ్రహ్మణపల్లి, గుంటూరు.



19 చుక్కలు
19 వరసలు

ప్రతిరోజూ విజేతలకు టాటా-జెమినీ టీ వారి నుంచి గిఫ్ట్ హ్యాంపర్ అందుతుంది.

మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
navya@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి నవ్య చిత్రజ్యోతి
సోమవారం • 8 జనవరి 2018 10

అలా వెళ్లొద్దమ్మా... ముద్దులు పెట్టేస్తారు!



కాజల్



అమలాపాల్

'మూతి ముద్దులు (అదేనండీ.. లిప్‌కిస్సులు) పెట్టుకునేటప్పుడు లిప్‌స్టిక్ ఉంటే నాకు మహా చిరాకు బాబూ' అంటూ ఇటీవలే అమలా పాల్ ఓ మాంచి మాట చెప్పారు. అంతే కాదు... అమ్మాయిలకు ఒక ఉచిత సలహా కూడా ఇచ్చారండోయ్! 'పెదాలకు వీలైనంత తక్కువ లిప్‌స్టిక్ వేసుకోండి. ఎందుకంటే... ఎవరైనా మీకు ముద్దు పెట్టొచ్చు' అని! కాజల్ అగర్వాల్‌కు అమలా పాల్ మాటలు భలే నచ్చేశాయి. 'ఐలవ్ థిస్' అని కాంప్లిమెంట్స్ ఇచ్చారు. వెంటనే ఆమెకు డౌటొచ్చింది. మరి, ముద్దులు వద్దనుకుంటే? దానికీ ఆమె ఓ చిట్కా చెప్పారు. "వద్దమ్మా... లిప్‌స్టిక్ తక్కువ వేసుకుని బయటకు వెళ్లొదమ్మా! అమలా పాల్ చెప్పినట్టు ఎవరైనా ముద్దులు పెట్టేస్తారు!" అని అమలా పాల్ సలహాకు కౌంటర్ కామెంట్ ఇచ్చారు కాజల్. 'ముద్దులు కావాలా!? వద్దా!? ఎవరి సలహా పాటించాలి' అనేది ఇప్పుడు అమ్మాయిలే నిర్ణయించుకోవాలి. అదండీ సంగతి!

ఆచారి అమెరికా తిప్పలు




విష్ణు

'గురువుగారూ.. గురువుగారూ!' అంటూనే బ్రహ్మానందంను అడ్డంగా బుక్ చేసేస్తాడు ఆచారి అలియాస్ మంచు విష్ణు. 'ఇక్కడ (ఇండియాలో)రూపాయికి రూపాయే. కానీ, అక్కడ (అమెరికాలో) డాలర్‌కి 66 రూపాయలు. మన జీవితాలు మారిపోతాయ్ గురువుగారూ' అని నమ్మించి తనతో అమెరికా తీసుకువెళతాడు. అక్కడికి వెళ్లన తర్వాత ఆచారి మాటల్లో అణువంత నిజం కూడా లేదనేది తెలుస్తుంది. ఇంకేముంది? తిప్పలు షురూ! ఆకలి దెబ్బకు అష్టకష్టాలూ పడతారు. అడుక్కోవడంతో సహా! అన్ని తిప్పలు పడుతూ ఆచారి అమెరికాలో ఎందుకుంటాడు? అసలు, అక్కడికి ఎందుకు వెళతాడు? అనేది ఈ నెలాఖరున విడుదలవుతోన్న 'ఆచారి అమెరికా యాత్ర' చూసి తెలుసుకోమంటున్నారు దర్శకుడు జి. నాగేశ్వరరెడ్డి. మంచు విష్ణు హీరోగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. బ్రహ్మానందం ప్రధాన పాత్ర చేశారు. పద్మజ పిక్చర్స్ పతాకంపై ఎం.ఎల్. కుమార్‌చౌదరి సమర్పణలో కీర్తీచౌదరి, కిట్టు నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను ఆదివారం విడుదల చేశారు. త్వరలో ఎస్.ఎస్. తమన్ సంగీతమందించిన పాటల్ని, ఈ నెల 26న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ప్రజ్ఞా జైశ్వాల్ ఈ చిత్రంలో కథానాయిక.

18 కిలోలు తగ్గిన మోహన్‌లాల్!





మోహన్‌లాల్, ప్రణవ్

మలయాళ చిత్ర రంగ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ 'జనతా గ్యారేజ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా దగ్గరయ్యారు. త్వరలో ఆయన 'ఒడియన్' పేరుతో ఓ మలయాళ సినిమా చేయబోతున్నారు. ఆటవిక జాతికి చెందిన మాణిక్యం ఒడియన్ జీవితకథ ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రంలో టైటిల్ పాత్రను మోహన్‌లాల్ పోషించనున్నారు. సన్నగా, యువకుడిలా ఈ సినిమాలో కనిపించాల్సి ఉండటంతో ఆ పాత్ర కోసం బాడీని తగ్గించే పని మొదలుపెట్టారు మోహన్‌లాల్. 57 ఏళ్ల వయసులో 18 కిలోలు తగ్గి అభిమానుల సహా అందరూ ఆశ్చర్యపోయేలా చేశారు. తనయుడు ప్రణవ్‌తో కలసి వర్కవుట్స్ చేసే ఫొటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారాయన. జిమ్‌లోనే ఎక్కువ సేపు గడుపుతున్న మోహన్‌లాల్ పబ్లిక్‌లోకి వచ్చి చాలా కాలమైంది. ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరయ్యారాయన. ఒక్కసారిగా పాతికేళ్లు తగ్గిపోయాయా అన్నట్లు తయారైన మోహన్‌లాల్ ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'ఒడియన్' సినిమాలో ప్రకాశ్‌రాజ్, మంజు వారియర్ మరో రెండు కీలక పాత్రలు పోషిస్తారు. ఈ చిత్రానికి శ్రీకుమార్ మీనన్ దర్శకుడు. భీష్ముడి కోణంలో మహాభారతాన్ని మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారిగా భారీ ఎత్తున రూపుదిద్దుకొనే చిత్రానికి కూడా దర్శకుడు ఈయనే.

బీఏ రాజు మంచి మనసున్న వ్యక్తి!

-సూర్య



సూర్య, బి.ఎ. రాజు

"బీఏ రాజుగారితో నాకు, మా కుటుంబానికి ఎప్పట్నుంచో అనుబంధం ఉంది. ఆయన మంచి హృదయమున్న వ్యక్తి. మాకు, మా సినిమాలకు ఆయనెప్పుడూ అండగా నిలబడుతూ, విలువైన సూచనలు ఇస్తుంటారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అన్నారు హీరో సూర్య. ఆదివారం సీనియర్ పాత్రికేయులు, నిర్మాత బీఏ రాజు పుట్టినరోజు. ఈ సందర్భంగా జరిగిన బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో సూర్య పాల్గొన్నారు. బీఏ రాజు మాట్లాడుతూ "మా 'ఆర్‌జే సినిమాస్' సంస్థలో నిర్మించిన తొలి చిత్రం 'ప్రేమలో పావని కల్యాణ్' వచ్చి 15 ఏళ్లు. నిర్మాతగా ఈ 15 ఏళ్లలో 'ప్రేమలో పావని కల్యాణ్' నుంచి తాజా 'వైశాఖం' వరకూ మా చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. త్వరలో బీఏ జయ దర్శకత్వంలో మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నిర్మించబోతున్నాం. ప్రస్తుతం కథాచర్చలు జరుగుతున్నాయి. జూన్‌లో సినిమా వివరాలు ప్రకటిస్తాం" అన్నారు.

ఆ రోజులు గుర్తొచ్చాయి

- సూర్య



"సినిమాల్లోకి రాకముందు ఒక ఎక్స్‌పోర్ట్ కంపెనీలో రూ.726 జీతానికి పనిచేశాను. అంతకన్నా ముందు బస్‌లో స్కూల్‌కి వెళ్లేవాడిని. లైఫ్ గురించి ఆలోచిస్తూ అర్ధరాత్రి రోడ్డు పక్కనున్న షాపులో టీ తాగేవాడిని. నేనెక్కడి నుంచి వచ్చానో ఆ మూలాలను మరచిపోలేను" అని సూర్య అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గ్యాంగ్'. కీర్తిసురేశ్ కథానాయిక. విఘ్నేశ్ దర్శకుడు. యు.వి.క్రియేషన్ సంస్థ ఈ నెల 12న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంది. ఈ సందర్భంగా ఆదివారం సూర్య విలేకర్లతో మాట్లాడారు. ఆ విశేషాలివి...

బాలీవుడ్ 'స్పెషల్ చబ్బీస్'కు రీమేక్ ఇది. ఆ కథను సౌత్ ప్రేక్షకులను మెప్పించేలా మార్పులు చేసి విఘ్నేశ్ కథ వినిపించారు. కథతోపాటు ఆయన నెరేట్ చేసిన విధానం నచ్చి 'గ్యాంగ్' సినిమా చేశా. 1980 ప్రాంతంలో ఓపెరా రాబరీ నేపథ్యంలో సాగే కథ ఇది. నేనూ అదే సమయంలో కెరీర్ ప్రారంభించాను కాబట్టి ఈ కథకు కనెక్ట్ అయ్యా. బిగినింగ్ ఈ తరహా కథలతో సినిమాలు చేశాను కానీ ఈ మధ్యకాలంలో ఇలాంటి కథ దొరకలేదు. విఘ్నేశ్ దర్శకుడే కాదు... చక్కని రచయిత, డ్రమ్మర్ కూడా. వివిధ శాఖల్లో తనకున్న అనుభవం మొత్తం ఈ సినిమా చిత్రీకరణకు ఉపయోగించాడు. కొత్త సూర్యని చూశామని సినిమా చూసిన ప్రతి ఒక్కరూ చెబుతారు. మంచి కథకు మంచి ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణులు కుదిరితే విజయం అదే వస్తుందని ఈ చిత్రం నిరూపించబోతుంది. కార్తీక్, రమ్యకృష్ణ సెంథిల్ వంటి మంచి టీమ్ కుదిరింది. అనిరుధ్ సంగీతం, దినేశ్ ఫొటోగ్రఫీ సినిమాను మరో లెవల్‌కి తీసుకెళ్తుంది.

మొదటిసారి ప్రయత్నించా.

భాషలన్నింటిలోనూ తెలుగు మధురమైన భాష అని చిన్నప్పుడు చదువుకున్నాను. ఈ సినిమా కోసం తొలిసారి తెలుగులో డబ్బింగ్ చెబుతుంటే ఆ భాషలో తియ్యతనం తెలిసింది. అందుకేనేమో కార్తీ త్వరగా తెలుగు నేర్చుకున్నాడు. తమిళ డబ్బింగ్ ఎనిమిది రోజుల్లో చెబితే.. తెలుగు ఆరు రోజుల్లో పూర్తి చేశా. 'గ్యాంగ్'లో నా క్యారెక్టర్ ఎగ్రెసివ్‌గా కాకుండా జోవియల్‌గా ఉంటుంది. అందుకే డబ్బింగ్ చెప్పా. తెలుగు వాయిస్‌కు ఫీడ్‌బ్యాక్ బావుంది.

పదేళ్లు తగ్గినట్లుంది...

వృత్తిరీత్యా ఎంత అనుభవం ఉన్నా నేర్చుకోవడానికి ఇంకా ఏదో మిగిలే ఉంటుంది. కెరీర్ బిగినింగ్ నుంచీ నేను అదే దారిలో నడుస్తున్నా. 20 ఏళ్ల జర్నీలో ప్రతి సినిమాను ఓ పాఠంగా భావిస్తా. ఇప్పుడీ సినిమా చెయ్యడం వల్ల పదేళ్ల వయసు తగ్గినట్లు అనిపిస్తోంది.

అందుకే స్పెషల్...

కార్ ఉన్నప్పటికీ చిన్నతనంలో ఫుట్‌పాత్ మీద నడుచుకుంటూ స్కూల్‌కి, బస్సులో కాలేజ్‌కి వెళ్లేవాడిని. అప్పట్లో వారానికి పది రూపాయలు పాకెట్ మనీ ఇచ్చేవారు నాన్న. చదువు పూర్తయ్యాక ఓ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పని చేశా. అక్కడ నా ఆఫీస్ శుభ్రపరుచుకోవడం, బట్టలు వాష్, ఐరన్ చేసుకోవడం అలవాటు అయింది.. నా తల్లిదండ్రులు క్రమశిక్షణగా, సాధారణంగా పెంచారు కాబట్టే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను. నా మూలాల్ని, ఎక్కడి నుంచి వచ్చి ఎలా ఎదిగాం అనేది ఎప్పటికీ మరచిపోలేను. ఈ సినిమా చేస్తుంటే చిన్నతనం తాలుకు జ్ఞాపకాలు, మూలాలు నా కళ్ల ముందు మెదిలాయి. అందుకే ఈ చిత్రం నాకు చాలా స్పెషల్.

పోటీ కాదు...

సంక్రాంతికి తమిళంలో నా సినిమాతోపాటు 'స్కెచ్' విడుదలవుతోంది. తెలుగుతో కంపేర్ చేస్తే అక్కడ థియేటర్లు తక్కువ. రెండు సినిమాలు షేర్ చేసుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లో 1500కు పైగా థియేటర్స్ ఉన్నాయి. పవన్‌కల్యాణ్, బాలకృష్ణ సినిమాలు విడుదలైనా నాకూ కొన్ని థియేటర్లు దక్కుతాయి. సో టెన్షన్ ఏమీ లేదు.

మాలాంటి వారికి స్ఫూర్తిగా...

ఫ్యాన్ ఫాలోయింగ్ ఎంతున్నా రాజకీయాల్లోకి రావడం అనేది సులభమైన ప్రక్రియ కాదు. సమాజంలో మార్పు కోసం రజనీకాంత్‌గారు, కమల్‌హాసన్‌గారు రాజకీయాల్లోకి రావడం గొప్ప విషయం. వీరిద్దరి చుట్టూ చాలా రాజకీయ పరిణామాలున్నాయి. ఏం జరుగుతోందో అని ఆతురతగా ఎదురుచూస్తున్నాం. నటులుగా వారిద్దరి మధ్య కాంపిటీషన్ ఉన్నప్పటి ఇటీవల మలేషియాలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఒకే వేదిక మీద ఒకరిమీద ఒకరు చెయ్యి వేసుకుని ఉండటం మాలాంటి వారికి స్ఫూర్తిగా అనిపించింది.

తదుపరి చిత్రాలు...

ప్రస్తుతం సెల్వరాఘవన్ దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభమైంది. కె.వి.ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా ఉంది. హరి దర్శకత్వంలో రెండేళ్లకో సినిమా చేస్తా. తదుపరి ఆయనతో చేసే సినిమా 'సింగం'కు సీక్వెల్ కాదు.

పెళ్లీ లేదు.. గిల్లీ లేదు..



దీపిక

ముంబయ్‌లో వేడి వేడి పావ్‌బాజీ తినే ప్రేక్షకుల కన్నా... "త్వరలో 'బాజీరావ్ మస్తానీ'లు పెళ్లి చేసుకుంటున్నారట కదా! నిజమేనా?" అని డిస్కస్ చేసుకునేవాళ్లే ఎక్కువ మంది ఉన్నారిప్పుడు! ఏదో సరదాగా శ్రీలంకలో న్యూఇయర్ సెలబ్రేట్ చేసుకుందామని వెళితే... ఇక్కడ ఇండియాలో రణవీర్ సింగ్, దీపికా పడుకొనేల పెళ్లి చేసేశారు కొందరు గాసిప్‌రాయుళ్లు. మొన్న ఐదో తేదీన దీపిక పుట్టినరోజు నాడు నిశ్చితార్థమూ జరిగిందన్నారు. అయితే.. దీపిక క్లోజ్ ఫ్రెండ్స్ మాత్రం అటువంటిది ఏం జరగలేదంటున్నారు. "బర్త్‌డేకి ఎందుకు ఎంగేజ్‌మెంట్ చేసుకుంటుంది? అలా చేస్తే... రెండు ముఖ్యమైన సందర్భాలను ఒక్కటి చేసినట్టవుతుంది. అప్పుడు, రెండు సెలబ్రేషన్స్ కాస్తా ఒక్కటే అవుతుంది. ప్రతి ఏడాది ఓ సెలబ్రేషన్‌ని మిస్ అవుతుంది. సో... దీపిక ఎప్పటికీ అలా చేయదు" అని ఓ ఫ్రెండ్ నవ్వేసింది. మరొక ఫ్రెండ్ అయితే... "ఒకవేళ ఇప్పటికిప్పుడు రణవీర్ పెళ్లి చేసుకుంటానన్నా, దీపిక చేసుకోదు. తను పెళ్లికి రెడీగా లేదు. ఎందుకు? అని మాత్రం అడగొద్దు" అంటున్నారు. కరీనా కపూర్ ఎంత హాట్‌గా ఉన్నప్పటికీ, పెళ్లి చేసుకుని ఓ పిల్లాడికి తల్లి కావడం వల్లే ఆమెకు మంచి మంచి పాత్రలు రావడం లేదు. నేనూ పెళ్లి చేసుకుంటే... నా పరిస్థితి కూడా అలా అవుతుందేమోనని దీపిక భయపవుతుందనేది ముంబయ్ గుసగుస!!

చిరు చేతుల మీదుగా!



రంజిత్

రంజిత్, పాలక్ లల్వానీ జంటగా 'దిక్కుల చూడకు రామయ్య' ఫేమ్ దర్శకత్వంలో డా. భరత్ సోమి నిర్మిస్తున్న 'జువ్వ' చిత్రీకరణ పూర్తయింది. త్వరలో చిరంజీవి చేతుల మీదుగా ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్ విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. "మలేసియాలో రెండు పాటలు, బెంగళూరులో కార్ ఛేజింగ్ సీన్లు, హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలు తీశాం. ఈ నెల మూడో వారంలో పాటల్ని, వచ్చే నెలలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు నిర్మాత. పోసాని కృష్ణమురళీ, అలీ, సప్తగిరి, మురళీ శర్మ తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ-మాటలు: ఎం. రత్నం, సాహిత్యం: అనంత శ్రీరామ్, సంగీతం: ఎం.ఎం. కీరవాణి, సమర్పణ: ఎస్వీ రమణ.

నా ట్యూన్స్ వాడితే ఊరుకోను



ఆర్పీ పట్నాయక్, సత్యయామిని, కోటి

"ఇతరులు కంపోజ్ చేసిన పాటలను ఇప్పటిదాకా గాయనీగాయకులు పాడారు. ఇకపై సొంతంగా కంపోజ్ చేసి ఇండిపెండెంట్ ఆల్బమ్స్ చేస్తే చాలా బావుంటుంది. దీని ద్వారా సింగర్స్ ఒరిజినాలిటీ ప్రూవ్ అవుతుంది. టెక్నాలజీ పెరిగిన ఈ తరుణంలో ఇలాంటి ప్రయత్నాలు చేస్తే బావుంటుంది. నాకు ఆర్పీ పట్నాయక్ సంగీతం అంటే చాలా ఇష్టం. ఆయన ఇండిపెండెంట్ మ్యూజిక్ చేస్తే బావుంటుంది" అని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ స్వరపరచిన 'నీతో ఏదో చెప్పాలనే ఉంది..' అనే ఇండిపెండెంట్ పాటను హైదరాబాద్‌లో ఇటీవల ఆవిష్కరించారు. అనంతరం ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ "నేను దర్శకత్వం చేయడం వల్ల సంగీతానికి దూరం అయ్యానని, ఒకవేళ నన్ను ఎవరైనా తీసుకున్నా వారి దర్శకత్వపు పనుల్లో నేను వేలుపెడతానని అనుకుంటున్నట్టు నాకు తెలిసింది. నేను దర్శకత్వంలో వేలుపెట్టే పనులు చేయను. అంత చనువు తీసుకోను. మంచి అవకాశం వస్తే సంగీతం చేయడానికి సిద్ధంగానే ఉన్నాను. నా పాటలు పాడుకుని ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నవారు గతంలో చాలా మంది ఉన్నారు. ఇప్పుడు మరలా అలాంటివారి కోసం నేను ఈ పాట కంపోజ్ చేశాను. అనుదీప్, సత్యయామిని చాలా చక్కగా నటించారు. ఈ తరం సింగర్స్ కూడా ఇలాంటి ఒరిజినల్ ట్యూన్స్‌తో రావాలి. చాలా మంది మ్యాషప్స్ చేస్తున్నారు. వాటివల్ల ప్రత్యేకమైన గుర్తింపు రాదు. నా ట్యూన్స్‌ని టీవీ సీరియళ్లకు వాడితే ఊరుకోను" అని చెప్పారు.

ఆమెకు 55.. అతనికి 25!



డెమీ మూరీ



నిక్ జోనాస్

కొంతమందికి వయసు పెరుగుతున్న కొద్దీ అందం రెట్టింపు అవుతుంటుంది. అటువంటి వారిలో హాలీవుడ్ నటి డెమీ మూరీ ఒకరు. ప్రస్తుతం ఆమె వయసు 55 ఏళ్లు. ఇంత వయసు వచ్చినా గ్లామర్‌ని మెయింటైన్ చెయ్యడం డెమీ ప్రత్యేకత. తనకుంటే తక్కువ వయసు ఉన్న వాళ్లతో డేటింగ్ చేస్తూ వయసు తక్కువ చేసుకుంటోందని గిట్టని వాళ్లు ఆమె గురించి చెప్పినా మనం పట్టించుకోవద్దు. ఎందుకంటే ఎవరి ఇష్టం వాళ్లది. అన్నట్లు డెమీ గురించి ఇలా ప్రచారం చేసే వాళ్ల సంఖ్య ఎక్కువేనండోయ్. సరే. అది అలా ఉంచి అసలు విషయానికి వద్దాం. ఆ మధ్య భర్త ఆస్టన్ కుచర్‌తో విడిపోయిన డెమీ తాజాగా ప్రేమలో పడిందట. 'రాడార్ ఆన్‌లైన్ డాట్‌కామ్' కథనం ప్రకారం తన కంటే 30 ఏళ్ల చిన్నవాడైన నటుడు, గాయకుడు నిక్ జోనాస్‌తో పీకల్లోతు ప్రేమలో మునిగిందట. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే వీరిద్దరినీ కలిపింది డెమీ 29 ఏళ్ల కూతురు రూమర్ విల్లీస్ అట! తల్లికి తనకంటే చిన్నవాళ్లయిన యువకులంటే ఇష్టమన్న సంగతి రూమర్‌కి బాగా తెలుసట. అందుకే 25 ఏళ్ల నిక్ తల్లికి తగిన వాడని భావించి వారిద్దరినీ కలిపిందట రూమర్. లాస్‌ఏంజిల్స్‌లో ఉన్న ఓ కామన్ ఫ్రెండ్ రూమ్‌లో ఈ ప్రేమికుల్దిరూ కలుసుకొంటున్నారట. నిక్‌తో ఉన్న ప్రేమబంధాన్ని పెళ్లితో ముడివేయడానికి డెమీ తొందర పడుతోందని ఆ వెబ్‌సైట్ కథనం.

Dwaraka



ఫల, పుష్ప సోయగం

యానాంలో నిర్వహిస్తున్న ఫల, పుష్ప ప్రదర్శన సందర్శకులను అలరిస్తోంది. వివిధ రకాల ఆకృతుల్లో తయారు చేసిన బుకేలు, డ్రై ఫ్లవర్ బుకేలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మృదంగ వీణ, 300కిలోల ద్రాక్షపళ్లతో తయారు చేసిన ఎద్దు ఆకృతులు, 250 కిలోల కాకరకాయలతో తయారు చేసి డైనోసార్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శన సోమవారంతో ముగియనుంది. - యానాం



ఖాళీ దారపు గొట్టాలతో కాకినాడ పీఆర్ కాలేజీ విద్యార్థి తేజ మధు వర్మ తయారు చేసిన ఓడ

పెద్దచెరువు మింగేసింది!

» స్నానానికి దిగి నలుగురు విద్యార్థుల మృతి



పెదవేగి. జనవరి 7 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి దిగిన నలుగురు విద్యార్థులు నీట మునిగి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం భోగాపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఏలూరు డీఎస్పీ కె.ఈశ్వరరావు కథనం మేరకు... జి.విజయ్‌శంకర్(22), కోట సాయి(22), కె.హరికృష్ణరాజు(21), ఎ.ఎస్.కె. పరశురామ్(23)లు పెదపాడు మండలం వట్లూరులోని శ్రీరామచంద్రా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. శనివారం ఉదయం కళాశాలకు బయలుదేరిన ఈ నలుగురూ సమీపంలోని జామతోటలో మద్యంతాగి భోజనం చేశారు. తర్వాత పక్కనే ఉన్న వట్లూరు పెద్దచెరువులో స్నానానికి దిగారు. గతంలో మట్టి తవ్వకాలు జరపడంతో చెరువు లోతుగా ఉన్న విషయం తెలియని ఆ విద్యార్థులు నీటిలో మునిగిపోయి మృత్యువాత పడ్డారు.

సీఎంకే నకిలీ లేఖ

» అదీ ఐఏఎస్‌ల సంఘం పేరుతో..!

» సోషల్ మీడియాలో హల్‌చల్

» ఖండించిన రాష్ట్ర ఐఏఎస్‌ల సంఘం

» ఆ లెటర్‌హెడ్ నకిలీది: ఎల్వీ సుబ్రమణ్యం

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని వ్యవహారాలు ముక్కున వేలేసుకునేలా చేస్తున్నాయి. కోర్టుల్లో రైతుల పేరిట పలు పిటిషన్లు వేయడం, నచ్చని కార్యక్రమాలను అడ్డుకునేందుకు తమ ఉనికి బయటపడకుండా మరొకరి పేరుతో వ్యవహారాలు చేయడం ఇవన్నీ చూశాం. ఇప్పుడు ఒకడుగు ముందుకేసి ఏకంగా ఐఏఎస్ అధికారుల సంఘం లెటర్‌హెడ్‌ను ముద్రించి.. ఒక లేఖను టైప్ చేసి.. దాన్ని ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకే పంపించారు. ఇది ఆదివారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల చంద్రబాబు జన్మభూమి కార్యక్రమంలో మాట్లాడుతూ.. మార్చి 31నాటికి వందశాతం మరుగుదొడ్లను నిర్మించని జిల్లాల్లో కలెక్టర్లకు వ్యతిరేకంగా ధర్నా చేస్తానని.. అప్పటికైనా వారికి రోషం వస్తుందని వ్యాఖ్యానించారు. దీనిపై ఐఏఎస్ అధికారుల సంఘం పేరుతో సీఎంకు ఒక లేఖ అందింది. 'మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్రం విడుదల చేసింది రూ.992.06 కోట్లు, రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది 838.16 కోట్లు. మొత్తం 1830.22కోట్లలో కేవలం 1230.22 కోట్లు ఖర్చుచేశారు. మిగతా నిధులను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు దుర్వినియోగం చేశారు' అని అందులో పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారుల్లో ఏమైనా లోపాలుంటే బదిలీ చేసినా ఫర్వాలేదని, కానీ ఈ విధంగా నిందించడం భావ్యం కాదని, తమ ఆవేదనను అర్థం చేసుకోవాలంటూ లేఖను ముగించారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఐఏఎస్ అధికారుల సంఘం బహిరంగం లేఖ రాసిందా అని చర్చ జరిగింది. అయితే అది నకిలీదని, తమ సంఘం లెటర్‌హెడ్‌ను నకిలీది ముద్రించి చేశారని, ముఖ్యమంత్రికి తాము ఎలాంటి లేఖ రాయలేదని ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ అధికారుల సంఘం చంద్రబాబు తీరుపై ఘాటు లేఖాస్త్రం సంధించిందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అది పూర్తిగా అవాస్తవం. మా సంఘం ఎలాంటి లేఖా రాయలేదు' అని ఆయన పేర్కొన్నారు.

ఐటీ హుషార్!

(మొదటి పేజీ తరువాయి)

అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థ కూడా గుంటూరులో ఏర్పాటు కానుంది. వేద ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేసిన వారిలో 80 శాతం మందికి అదే సంస్థ ఉద్యోగాలు ఇవ్వనుంది. మిగిలిన వారి కోసం ఇంటెల్ వంటి ప్రముఖ కంపెనీలెన్నో పోటీపడే అవకాశముంది. మరోవైపు అమరావతి ఏంజెల్ నెట్‌వర్క్స్ అనే సంస్థ కూడా అమరావతికి వస్తోంది. ఈ సంస్థ సాఫ్ట్‌వేర్, ఐటీ రంగాల్లో కొత్త ఆలోచనలు చేసే వారికి అవసరమైన నిధులు ఇచ్చి సహకరిస్తుంది. అమెరికాలోని బే ఏరియాతో పాటు చైనాలోనూ ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కంపెనీలకు పెట్టుబడులు, మార్కెటింగ్, షేర్ల లావాదేవీలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, నిధుల నిర్వహణ తదితర సేవలన్నీ ఈ సంస్థ అందిస్తుంది. మరోవైపు ఫస్ట్ అమెరికన్ కార్పొరేషన్‌కు చెందిన హ్యాపీ మైండ్స్ రిక్రూటింగ్ ఏజెన్సీ కూడా అమరావతికి రానుంది. వివిధ సంస్థల్లో రిక్రూటింగ్, కన్సల్టెన్సీ సేవలను ఇది అందిస్తుంది.

'శిక్షణ'తో బహుళ ప్రయోజనాలు

ప్రస్తుతం రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించినవారు నిపుణులైన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నారు. శిక్షణ సంస్థలు ఉంటే ఈ ఇబ్బందిని అధిగమించవచ్చు. మరిన్ని ఐటీ కంపెనీలు వచ్చేందుకు మార్గం సుగమమవుతుంది. జీసీఎస్, ఘనా, కెల్లీ తదితర శిక్షణ సంస్థలు రెండ్రోజుల క్రితమే అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించాయి. ఆయా సంస్థల్లో 1027 మంది శిక్షణ తీసుకుంటుండగా... అందులో 730 మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఖరారయ్యాయి.

భవిష్యత్తుపై ఆశలు...

ప్రోత్సాహకాలు ఇచ్చి, నచ్చజెప్పగా వచ్చిన ఐటీ కంపెనీలు రాష్ట్రంలో ఎంత వరకు ఉంటాయి? తొలుత ప్రారంభమైనా తర్వాత కొనసాగుతాయా? ఆయా కంపెనీలకు ప్రాజెక్టులు వస్తున్నాయా? ఇలాంటి సందేహాల మబ్బులన్నీ ఇప్పుడు తొలగిపోతున్నాయి. కొత్తగా 12 ఐటీ కంపెనీలు అమరావతికి రానున్నాయి. వీటన్నింటినీ ఈనెల 17వ తేదీన ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించనున్నారు. ఏపీ ఎన్ఆర్‌టీ చైర్మన్ రవికుమార్ వేమూరి ఈ కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నారు. గన్నవరం సమీపంలోని మేధా టవర్స్ ఇప్పుడు ఐటీ కంపెనీలతో 'హౌస్ ఫుల్' అయ్యింది. వాటిలో కొన్ని సంస్థలు విస్తరణకు కూడా వెళ్తున్నాయి. మెస్లోవా అనే సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రాథమికంగా ఐదువేల చదరపు అడుగుల్లో ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ సంస్థ తమకు మరో 10వేల చదరపు అడుగుల ప్రదేశం కావాలని అడుగుతోంది. మెస్లోవా కంపెనీ ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. విస్తరణతో మరో 350మందికి అవకాశం ఇస్తామని చెబుతోంది. అలాగే... మేధా టవర్స్‌లోనే ప్రారంభించిన చందు సాఫ్ట్ అనే కంపెనీ విశాఖపట్నంలో విస్తరణకు వెళ్తోంది. మరో రెండు, మూడు కంపెనీలు కూడా అదే దారిలో ఆలోచిస్తున్నాయి. ఏపీలో ఐటీ వాతావరణం బాగుందనేందుకు ఇది సంకేతమని రాష్ట్ర ప్రభుత్వం హర్షం వ్యక్తం చేస్తోంది.

» ఆంగ్లంలో శిక్షణ...

ఇంజనీరింగ్, ఇతర కోర్సుల గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లకు ఆంగ్లంలో శిక్షణ ఇచ్చి వారిని కంపెనీలకు కావాల్సిన విధంగా తీర్చిదిద్దేలా ఏపీఎన్నార్టీ కృషి చేస్తోంది. గ్రీన్‌కో కంపెనీ సామాజిక బాధ్యత కింద ఇచ్చిన నిధులతో... పేరెన్నికగన్న ఒక సంస్థతో ఏటా 900 మందికి ఆంగ్లంలో శిక్షణ ఇప్పించనున్నారు. తొలి విడతగా వందమందిని ఎంపిక చేసేందుకు అవసరమైన కసరత్తు పూర్తయింది.

నాలుగు టవర్లు ఫుల్

రాష్ట్రంలో ఐటీ విస్తరణకు రెండు, మూడు మార్గాల్లో కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఐటీ శాఖ నేరుగా కంపెనీలను తీసుకొస్తుండడం... రెండోది ఏపీ ఎన్నార్టీ చొరవతో ఐటీ సంస్థలు రావడం! ఏపీఎన్నార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏర్పాటుచేసిన నాలుగు ఐటీ టవర్లు ఇప్పటికే కంపెనీలతో నిండిపోయాయి. విజయవాడ ఆటోనగర్‌లో ఇండ్‌వెల్ టవర్స్, మహానాడు రోడ్‌లోని కే-బిజినెస్ స్పేసెస్, గన్నవరం సమీపంలోని మేధా టవర్స్, అదేవిధంగా మంగళగిరి ఐటీ పార్కులోని మేధా టవర్స్... ఈ నాలుగూ ఐటీ కంపెనీలతో కళకళలాడుతున్నాయి. ఇప్పుడు 60 వేల చదరపు అడుగులతో ఉన్న ఏపీఎన్నార్టీ టెక్‌పార్కు కూడా సాఫ్ట్‌వేర్ కంపెనీలతో నిండుతోంది. కొత్తగా వచ్చే సంస్థలకోసం గన్నవరంతోపాటు, విజయవాడ - గుంటూరు మధ్య ఉన్న పలు భారీ భవనాలను ఐటీ శాఖ, ఏపీఎన్నార్టీ అద్దెకు తీసుకుంటున్నాయి. సగం అద్దె ఐటీశాఖ భరిస్తుండగా, సగం అద్దెను మాత్రం సాఫ్ట్‌వేర్ కంపెనీలు చెల్లించేలా ప్రోత్సాహకం ఇస్తున్నారు.

ప్రపంచం దృష్టికి అమరావతి

» అంతర్జాతీయ మీడియా ద్వారా తెలియజేద్దాం

» ఇబ్బడి ముబ్బడిగా పెట్టుబడులు రాబడదాం: సీఎం

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఇటీవల జరుగుతున్న అనేక అభివృద్ధి పనులను జాతీయ, అంతర్జాతీయ మీడియాకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతి నిర్మాణంలో కీలక మైలురాళ్లు, పెట్టుబడులకు అద్భుత అవకాశాలను ప్రపంచానికి తెలియజేసేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) మంగళవారం (9న) జాతీయ మీడియా సహకారంతో ఢిల్లీలో అంతర్జాతీయ మీడియా సదస్సును నిర్వహించనుంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి టెలిఫోన్ ద్వారా అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సదస్సులో అమరావతి మీడియా సిటీ అనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

మీడియా సిటీలో 2036 కల్లా నేరుగా 60-65 వేల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మీడియా ఆధారిత ఇంటిగ్రేటెడ్ బిజినెస్ పార్క్ (ఐబీపీ) ఏర్పాటు, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ కంపెనీలకు ఆర్థిక ప్రోత్సాహకాలు, తొలి దశలో 20-30 ఎకరాల్లో టాలీవుడ్/బాలీవుడ్, టీవీ, లోకాస్ట్ కంటెంట్‌లకు అత్యాధునిక టెక్నాలజీతో స్టూడియో ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రంగాల్లో అంతర్జాతీయ, అత్యాధునిక సౌకర్యాలతో అమరావతి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్‌ను మించిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ సంస్థలు అమరావతిలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

భూమిని బట్టి ఎరువులు

» కార్డుల పంపిణీ పూర్తయ్యాక దేశవ్యాప్తంగా కార్యక్రమం

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ పంటకు ఏ ఎరువును వాడాలి? ఎంత వాడాలి? సాగుభూమికి అనుగుణంగానే ఎరువులను వేస్తున్నామా? చాలామంది రైతుల్లో ఇప్పటికీ ఇవే సందేహాలు! అన్నదాతలకు మున్ముందు ఈ తలనొప్పి ఉండబోదు. ఎరువుల అడ్డగోలు వాడకం తగ్గి.. ఆ మేరకు సాగుకు అయ్యే వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది. సాగు భూమి నాణ్యతను బట్టి ఎరువులను రైతులకు సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. ఇందుకుగాను రైతుల భూ ఆరోగ్య కార్డుల్లో ఉన్న వివరాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. ఆ మేరకు ఏ భూమిలో ఏ పంటకు ఏ ఎరువును వాడాలన్నది ఖరారు చేసి, ఎరువులను రైతులకు అందజేస్తారు. ఈ విధానాన్ని తొలిదశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో అమలు చేయనున్నట్టు తెలిసింది. ఇందుకు ఐదు రాష్ట్రాల్లో 126 జిల్లాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. రైతులకు భూ ఆరోగ్య కార్డుల పంపిణీ పూర్తయిన తర్వాత ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తారు. పంటలకు అవసరమయ్యే ఎరువులు, వాటి మోతాదుపై చాలా మంది రైతులకు అవగాహన లేదని, భూమి రకం, సాగు చేసే పంటలకు అనుగుణంగా ఎరువులను సరఫరా చేయడం ద్వారా ఈ సమస్య తీరుతుందని అధికారులు అంటున్నారు. తద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పాదకత పెరుగుతుందని భావిస్తున్నారు. కాగా, ఈ విధానాన్ని ఖరారు చేయడానికి భాగస్వాములతో జరుగుతున్న చర్చలు తుది దశకు చేరాయి. దీనికి సంబంధించి నోటిఫికేషన్‌ను రూపొందించే బాధ్యతను న్యాయ శాఖ తీసుకుంది. రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయడానికి మూడు ఎరువుల కంపెనీలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. భూములకు సంబంధించి సాంకేతికంగా సహకారం అందించడానికి హైదరాబాద్‌కు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ముందుకొచ్చింది. మరోవైపు, భూ ఆరోగ్య కార్డులను రైతుల ఆధార్ కార్డుతో అనుసంధానించే కార్యక్రమం కూడా మొదలైంది. భూ ఆరోగ్య కార్డులను రూపొందించే కార్యక్రమం నిరుడు మేలో మొదలైంది. సాగు భూముల్లో శాంపిళ్లను సేకరించి భూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కార్డులను రూపొందిస్తున్నారు. భూ ఆరోగ్య కార్డులను సమగ్ర ఎరువుల యాజమాన్య వ్యవస్థ (ఐఎఫ్ఎంఎస్)కు కూడా అనుసంధానం చేస్తున్నారు. కార్డులను ఆధార్, ఐఎఫ్ఎంఎస్‌కు అనుసంధానించడం వల్ల రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా పారదర్శకంగా జరుగుతుందని, ఎరువులపై ఇచ్చే సబ్సిడీ మొత్తం నేరుగా రైతుల ఖాతాల్లో పడుతుందని అంటున్నారు. కాగా, తొలిదశ భూ ఆరోగ్య పరీక్షలకు సంబంధించి 2015-17 మధ్య 11.98 కోట్లమంది రైతుల భూముల్లో పరీక్షలు నిర్వహించాలని కేంద్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 10 కోట్ల 22 లక్షల కార్డులు రూపొందించడం పూర్తయ్యాయి. ఇందులో 10 కోట్ల 4 లక్షల కార్డులను రైతులకు ప్రభుత్వం అందించింది.

విషమిచ్చి..గొంతు నులిమి..! కన్నతల్లిని కడతేర్చిన కసాయి



తహసీల్దారు సమక్షంలో సుబ్బరత్నం సమాధిని తవ్విస్తున్న పోలీసులు; సుబ్బరత్నం (ఫైల్)



నిందితులు రంజిత్‌కుమార్, మణి



నాగులుప్పలపాడు, జనవరి 7 : నవమాసాలూ కడుపున మోసి పెంచిన కన్నతల్లినే కడతేర్చాడో కసాయి. పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన దొడ్డా సుబ్బరత్నం (51)కు భర్త లేరు. జామకాయలు అమ్ముకుంటూ కొడకుఉ రంజిత్‌కుమార్ పెంచి పెళ్లి చేసింది. దుర్వసనాలకు లోనైన అతడు తల్లినీ, భార్యనూ వేధిస్తుండడంతో, భార్య ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం రంజిత్ గ్రామంలోని మద్దిరాల మణితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. బ్యాంకులో పొదుపు చేసుకున్న డబ్బులు ఇవ్వాలని రంజిత్ పట్టుబట్టాడు. సుబ్బరత్నం ససేమిరా అనడంతో జనవరి 1వ తేదీ రాత్రి.. ఆమె తినే కూరలో ఎలుకల మందు కలిపాడు. అది తిన్న సుబ్బరత్నం అపస్మారక స్థితిలోకి వెళ్లగా ప్రియురాలు సహకారంతో గొంతు నులిమి చంపేశాడు. 2వ తేదీ ఉదయం తన తల్లి గుండెపోటుతో చనిపోయిందని అందరినీ నమ్మించి, 3వ తేదీన సమాధి కట్టించేశాడు. అయితే.. రంజిత్‌కుమార్ తల్లి మరణించిందన్న దిగులు లేకుండా స్నేహితులతో జల్సాగా తిరుగుతుండటంతో అను మానం వచ్చి నాగులుప్పలపాడు ఎస్ఐ అజయ్‌బాబుకు సమాచారమిచ్చారు. ఆయన శనివారం రాత్రి రంజిత్‌కుమార్, అతని ప్రియురాలు మణిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. తహసీల్దార్ సుజాత సమక్షంలో సుబ్బరత్నం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం అనంతరం తిరిగి పూడ్చేశారు. హత్యకేసుగా నమోదు చేసి నిందితులిద్దరినీ అరెస్టు చేశారు.

ఇక పెయ్యలే పుడతాయ్!

» పశుసంవర్ధక శాఖలో సరికొత్త విధానం

» 'ఆంధ్రజ్యోతి'తో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ సోమశేఖరం



చిత్తూరు(వ్యవసాయం), జనవరి 7: పాడి రైతులకు ఓ శుభవార్త. ఇక ఆవు ఈనిందంటే కోడె దూడా.. పెయ్యా.. అని ఎదురుచూడాల్సిన పని లేదు. ఇక పెయ్యలే పుట్టే సరికొత్త విధానం రాబోతోంది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ఏప్రిల్ నుంచి ఇలాంటి సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. మేలుజాతి ఆవుల అభివృద్ధికి దాదాపు రూ.10 కోట్లు వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఈ నెల 10వ తేదీన తిరుపతిలో ఎన్‌డీడీబీ ప్రతినిధులు, పశువైద్య నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనునట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ సోమశేఖరం చెప్పారు. జన్మభూమి-మాఊరు స్పెషలాఫీసర్‌గా చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్న ఆ యన పశుసంవర్ధక శాఖ భవిష్యత్తు కార్యక్రమాలను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఏడాదికి 7వేల దూడల ఉత్పత్తి

జిల్లాకు 500 లెక్కన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఏడాదికి దాదాపు 7వేల వరకు మేలుజాతి పేయ దూడల ఉత్పత్తికి అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపడుతోంది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న మేలుజాతి పశువుల వీర్యాన్ని కృత్రిమంగా ఫలదీకరణం చేసి, తద్వారా ఏర్పడిన పెయ్యదూడ పిండాన్ని నిపుణుల ద్వారా పశువుల గర్భంలో ఉంచి అభివృద్ధి చేస్తారు. ఈ విధానంలో ఒక్కో దూడకు రూ. 15 వేల చొప్పున ఖర్చు కానుంది. పులివెందుల, విశాఖపట్నంలలో వెటర్నరీ ల్యాబ్‌లే కేంద్రాలుగా ఈ టెక్నాలజీ అమలు చేయనున్నారు. భూమిలేని రైతులకు లీజుకు ఇప్పించనుంది. పశుగ్రాసం అధికంగా సాగయితే దాన్ని సైలేజ్ రూపంలో భద్రపరచుకునేందుకు యంత్రాల కొనుగోలు కోసం రాయితీ ఇస్తారన్నారు.

పోలవరాన్ని మేమే జాతికి అంకితం చేస్తాం

» కమీషన్ల కోసం మోదీ, బాబు కుస్తీ

» పాండిచ్చేరి సీఎం ఆరోపణ

» మహాపాదయాత్ర చేపట్టిన రఘువీరా

ధవళేశ్వరం/కొవ్వూరు, జనవరి 7: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అంచనాలు పెంచి ఆ సొమ్ములను పంచుకోవడానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కుస్తీ పడుతున్నారని పాండిచ్చేరి సీఎం నారాయణస్వామి, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆరోపించారు. పర్సంటేజీలపై ఉన్న శ్రద్ధ ప్రాజెక్టు నిర్మాణ పనులపై లేదని విమర్శించారు. ఈ ప్రాజెక్టును 2019లో అధికారంలోకి వచ్చాక తామే జాతికి అంకితం చేస్తామని తెలిపారు. పోలవరం సత్వరపూర్తికి రఘువీరా చేపట్టిన పోలవరం మహాపాదయాత్రకోసం ధవళేశ్వరం వచ్చిన నారాయణస్వామి.. పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. 'ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది కాంగ్రెస్ ముఖ్యమంత్రి అంజయ్య. రూ.5 వేల కోట్లకుపైగా ఖర్చుపెట్టి కాలువ పనులు పూర్తిచేసిన ఘనత వైఎస్.రాజశేఖరరెడ్డిది. 2019లో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులమీదుగా పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితమిస్తాం' అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన పని తక్కువ.. హడావుడి ఎక్కువ అన్న చందంగా సాగుతోందన్నారు. అన్ని పార్టీల అంగీకారంతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజిస్తే ఆగ్రహంతో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌నే శిక్షించారని.. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం మళ్లీ తమ పార్టీకే పట్టం కట్టాలని పిలుపిచ్చారు. ప్రాజెక్టు సత్వర పూర్తికి పాదయాత్రతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని రఘువీరా అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే ఈ పాటికే ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి కృష్ణా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు నీరు పారించి ఉండేవారిమన్నారు. అనంతరం పాదయాత్ర పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చేరుకుంది. అక్కడ మాజీ మంత్రి వట్టి వసంతకుమార్, డీసీసీ అధ్యక్షుడు రఫీయుల్లా బేగ్ వారికి స్వాగతం పలికారు.



పాదయాత్ర చేస్తున్న రఘువీరా, కేవీపీ తదితరులు

ఐపిఒతో న్యూజెన్ సాఫ్ట్‌వేర్ రూ.450 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ : ఐటి సంస్థ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ద్వారా 450 కోట్ల రూపాయలు సమీకరించాలని యోచిస్తోంది. ఈ ఇష్యూ ఈ నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ఐపిఒ ద్వారా కొంత మంది ఇన్వెస్టర్లు తమ వాటాలను విక్రయించనున్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ దివాకర్ నిగమ్ తెలిపారు. 2016-17 సంవత్సరంలో ఈ కంపెనీ 434 కోట్ల రూపాయల రాబడిని, 52 కోట్ల రూపాయల నిర్వహణ లాభాన్ని నమోదు చేసుకుంది. బ్యాంకులు, బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలకు బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ను ఈ కంపెనీ అందిస్తోంది. 60 దేశాల్లో కంపెనీ ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి.



ఇప్పుడే ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ వద్దు

» పునరుద్ధరణకు ఐదేళ్లు గడువు ఇవ్వాలి

» పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు. దీనిపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ కమిటీ మరో ఐదేళ్ల వరకు ఈ సంస్థను ప్రైవేటీకరించవద్దని సూచించింది. పెట్టుబడుల ఉపసంహరణ ప్రయత్నాలు చేయవద్దని కోరింది. ఆర్థిక పరిస్థితి చక్కదిద్దుకుని లాభాలు ఆర్జించేందుకు ఎయిర్ ఇండియాకు కనీసం 2022 వరకు గడువు ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తం చేసింది. అప్పటికిగానీ ఎయిర్ ఇండియా కోసం యుపిఎ హయాంలో ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ ఫలితాలు కనిపించవని అంచనా వేసింది. ఉద్దీపన ప్యాకేజీ నిధులు ఒక్కసారిగా కాకుండా, కొద్ది కొద్దిగా విడుదల చేయడమూ ఎయిర్ ఇండియాకు సమస్యగా మారిందని తెలిపింది. దీంతో కంపెనీ బయటి నుంచి అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంది. ఎయిర్ ఇండియా అప్పులు రద్దు చేయాలని కూడా పార్లమెంటరీ కమిటీ సూచించింది. ప్రకృతి విపత్తులు, దేశ, విదేశాల్లో సంక్షోభాలు తలెత్తినపుడు ఎయిర్ ఇండియా పోషించిన సామాజిక బాధ్యతనూ గుర్తించాలని కోరింది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరిస్తే ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ విమాన చార్జీల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరించింది.

ఐదేళ్ల తర్వాత కూడా ప్రైవేటీకరణ తప్పదనుకుంటే ఎయిర్ ఇండియా ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఉద్యోగ భద్రత, పెన్షన్ వంటి అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరింది. ఎయిర్ ఇండియాకు చెందిన నాలుగు అనుబంధ సంస్థలు ఇప్పటికీ లాభాలు ఆర్జిస్తున్న విషయాన్ని కమిటీ గుర్తు చేసింది. కనీసం వీటినైనా ప్రైవేటీకరణలో కలపకుండా చర్యలు తీసుకోవాలని కోరింది.

ఆన్‌లైన్‌లో పతంజలి

న్యూఢిల్లీ: యోగా గురువు బాబా రాందేవ్‌కు చెందిన ఆయుర్వేద, ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల సంస్థ పతంజలి విక్రయాలను భారీగా పెంచుకునేందుకు ఆన్‌లైన్ బాటపట్టనుంది. ఇందుకోసం 8 ఇ-కామర్స్ సంస్థలతో త్వరలోనే భాగస్వామ్యం కుదుర్చుకోనున్నట్లు పతంజలి ప్రతినిధి ఎస్‌కె తిజార్‌వాలా తెలిపారు. ఇందులో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ వంటి ప్రముఖ ఇ-కామర్స్ కంపెనీలతోపాటు పేటీఎం మాల్, 1ఎంజి, బిగ్‌బాస్కెట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్ కూడా ఉన్నాయి. భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు ఈనెల 16న ఏర్పాటు చేయబోయే కార్యక్రమంలో అన్ని ఇ-కామర్స్ కంపెనీల ప్రతినిధులతోపాటు బాబా రాందేవ్, పతంజలి సిఇఒ ఆచార్య బాలకృష్ణ కూడా పాల్గొననున్నారు. ఆన్‌లైన్ విక్రయాల కోసం సంస్థ ఇప్పటికే పతంజలి ఆయుర్వేద్ డాట్ నెట్ అనే పోర్టల్‌ను కూడా ఏర్పాటు చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.10,500 కోట్ల టర్నోవర్ సాధించిన పతంజలి ఈసారి దాన్ని రెండింతలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

దివాలా ఆస్తుల కోసం

ప్రమోటర్ల ఎత్తుగడలు

ముసుగు కంపెనీలతో ఆస్తుల కోసం ప్రయత్నం.. అప్రమత్తమైన అధికార వర్గాలు

న్యూఢిల్లీ : దివాలా తీసినా ప్రమోటర్లకు కంపెనీల ఆస్తులపై ఆశలు చావడం లేదు. వీలైతే ఏదో ఒక ముసుగు కంపెనీ (ఫ్రంట్ కంపెనీ) ఏర్పాటు చేసి వేలంలో ఆ ఆస్తులు కొట్టేసేందుకు పావులు కదుపుతున్నాయి. తమ బకాయిలు రాబట్టుకునేందుకు ఇటీవల బ్యాంకులు దివాలా చట్టం (ఐబిసి) కింద చర్యలు ప్రారంభించాయి. దీంతో ఉద్దేశపూర్వకంగా ఐపి పెట్టిన ప్రమోటర్లు ఏదోలా కంపెనీల ఆస్తులు కాపాడుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కొంత మంది ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో మంచి పేరున్న కొన్ని ఎన్‌బిఎఫ్‌సి కంపెనీల సీనియర్ అధికారులను సంప్రదించారు. 'ఆస్తుల పునర్ వ్యవస్థీకరణ కంపెనీల పేరుతో, ప్రత్యేకంగా స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేయండి. ఈ కంపెనీల ద్వారా వేలంలో మా కంపెనీల ఆస్తులు కొని తర్వాత, మాకు అప్పగించండి. ఇందుకు అవరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాం. అవసరమైతే ఇందుకోసం ఈ కంపెనీల నిర్వహణ, ఆస్తుల అమ్మకం కోసం నియమించిన ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రొఫెషనల్స్ (ఐఆర్‌పి)ను మేనేజ్ చేద్దామని ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం. ఈ విషయం తెలియడంతో ప్రభుత్వ అధికారులు అప్రమత్తమయ్యారు. స్టీలు, విద్యుత్, టెక్స్‌టైల్, రియల్టీ రంగాలకు చెందిన దివాలా తీసిన కొన్ని కంపెనీల ప్రమోటర్లు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నట్టు అధికారులకు సమాచరం అందింది. ఈ ఎత్తుగడ ఫలిస్తే బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన కొంతమంది వ్యక్తిగత సంపన్నులు ఇదే బాట పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.



రూ.1.3 లక్షల కోట్ల బకాయిలు

బ్యాంకులు ఇప్పటి వరకు అప్పులు ఎగవేసిన దాదాపు 500 కంపెనీలను గుర్తించాయి. వీటి నుంచి బ్యాంకులకు హీన పక్షం రూ.1.3 లక్షల కోట్ల అసలు, వడ్డీ అందాల్సి ఉంది. ఇందులో కొన్ని కంపెనీలు వ్యాపారంలో సహజంగా ఉండే ఆటుపోట్లతో నష్టపోతే మరికొన్ని కంపెనీలు ప్రమోటర్ల ఉద్దేశపూర్వక చర్యలతో దివాలా తీశాయి. ఇప్పటికే 100 కంపెనీలు ఐబిసి చట్టం కింద దివాలాకు సిద్ధమయ్యాయి. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ఐబిసి కింద వేలానికి పెట్టే కంపెనీల ఆస్తుల కోసం పోటీపడకూడదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో ఉలిక్కిపడిన ప్రమోటర్లు ఇంకా అడ్డదారులు ఏమైనా ఉన్నాయా? అని వెతుకుతున్నట్టు భావిస్తున్నారు. అందులో భాగంగానే ఏదో ఒక ముసుగు కంపెనీ ఏర్పాటు చేసి, కంపెనీల ఆస్తులు వేరే వ్యక్తులు, కంపెనీల చేతిలో పడకుండా జాగ్రత్త పడాలని భావిస్తున్నట్టు సమాచారం.

కెఐఒసిఎల్‌తో విశాఖ ఉక్కు ఒప్పందం

» భాగస్వామ్యంలో పెల్లెట్ ప్లాంట్ ఏర్పాటు



ఉక్కు శాఖ మంత్రి బిరేందర్ సింగ్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ఇరు సంస్థల అధికారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నిర్వహణ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్).. కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీ లిమిటెడ్(కెఐఒసిఎల్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వైజాగ్‌లో 1.2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో పెల్లెట్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇరువర్గాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. శనివారం మంగళూరులో స్టీల్ శాఖ మంత్రి చౌదరి బిరేందర్ సింగ్, ఆర్ఐఎన్ఎల్ సిఎండి పి మధుసూధన్, కెఐఒసిఎల్ సిఎండి ఎంవి సుబ్బారావు సమక్షంలో ఇరు సంస్థల అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. తొలుత 1.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, తర్వాత అవసరాన్ని బట్టి పెంచుకుంటూ పోనున్నారు. ఐరన్ ఓర్ ఫైన్స్‌ను ఉపయోగించి పెల్లెట్స్‌ను ఉత్పత్తి చేస్తారు. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా లేదా కర్ణాటకలోని బళ్లారిలో ఉన్న గనుల నుంచి ఈ ప్లాంట్‌కు ఐరన్ ఓర్ సరఫరా కానుంది. ఈ ప్లాంట్‌లో తయారు చేసిన పెల్లెట్స్‌ను ఆర్ఐఎన్ఎల్ బ్లాస్ట్ ఫర్నేస్‌లో ముడిసరుకుగా ఉపయోగించుకోనుంది.

మార్చిలో డిజిహెచ్ఎల్ పబ్లిక్ ఇష్యూ

ముంబై : కోల్‌కతా కేంద్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ డెవలపర్ జైన్ గ్రూప్ అనుబంధ సంస్థ డ్రీమ్ గేట్‌వే హోటల్స్ లిమిటెడ్ (డిజిహెచ్ఎల్) వచ్చే మార్చి నాటికి పబ్లిక్ ఇష్యూకు రావాలనుకుంటోంది. ఈ ఇష్యూ ద్వారా 25 శాతం వాటాను విక్రయించాలని కంపెనీ భావిస్తోంది. బిఎస్ఇలోని చిన్న, మధ్యతరహా (ఎస్ఎంఇ) ఎంటర్‌ప్రైజ్ ప్లాట్‌ఫామ్‌పై ఈ కంపెనీ నమోదు కానుంది.

యుటిఐ ఎంఎఫ్ ఇష్యూపై ఏప్రిల్‌లో నిర్ణయం

యుటిఐ మ్యూచువల్ ఫండ్ పబ్లిక్ ఇష్యూపై వచ్చే ఏప్రిల్‌లో నిర్ణయం వెలువడనుంది. ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి), బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి), భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసి)లకు యుటిఐ మ్యూచువల్ ఫండ్‌లో ప్రభుత్వం తరపున వాటాలున్నాయి. వీటి వాటా 74 శాతం ఉంటే.. అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ టి రో ప్రైస్‌కు 26 శాతం వాటా ఉంది. ఏప్రిల్‌లో ఇన్వెస్టర్లందరి సమావేశం జరుగుతుందని, అప్పుడు లిస్టింగ్‌కు సంబంధించిన నిర్ణయం వెలువడే అవకాశం ఉందని పిఎన్‌బి హెడ్ సునీల్ మెహతా తెలిపారు.

ఈ వారం నెగిటివ్ క్లోజింగ్!

ఆస్ట్రో గైడ్

గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తం

(జనవరి 8-12 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ: 10559 (+28)

నిఫ్టీ గత వారం 10405-10566 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలో కదలాడి 28 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిలో 10559 వద్ద ముగిసింది. వారానికి పాజిటివ్‌గా క్లోజ్ కావడంతో పాటు 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరింది. వరుసగా ఐదు వారాలుగా లాభపడినందు వల్ల ఈ వారంలో కరెక్షన్ ఏర్పడే ఆస్కారం ఉంది.



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

- డిసెంబరు 26,27 తేదీల్లో చంద్రుడు ఉత్తరాభాద్ర నుంచి రేవతి నక్షత్రాల నడుమ సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధి 10478-10552. ఇందులో రెండు స్థాయిలను గత వారంలో బ్రేక్ చేసి ఎగువ స్థాయిలో ముగిసింది. ఈ వారంలో కూడా పాజిటివ్‌గా ముగిస్తే మరింత బుల్లిష్ అవుతుంది.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బుల్లిష్‌గా ఉంది. మధ్యకాలిక, దీర్ఘకాలిక దృక్పథాలు రెండింటిలో కూడా నిఫ్టీ బుల్లిష్‌గానే ఉంది. 10400 కన్నా దిగువన ముగిసినప్పుడే బేరిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10424, 10348, 10168, 9853 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

గ్రహగతులివే..

- కన్యలోని హస్త పాదం 2 నుంచి వృశ్చికంలోని అనూరాధ పాదం 2 మధ్యలో చంద్ర సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4 నుంచి ఉత్తరాషాఢ పాదం 1 మధ్యలో రవి సంచారం
- ధనుస్సులోని మూల పాదం 1-3 మధ్యలో బుధ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4 నుంచి ఉత్తరాషాఢ పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- తులలోని విశాఖ పాదం 2-3 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3లో ధనుస్సు నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 2లో వృషభ నవాంశలో బృహస్పతి సంచారం
- మకరంలో రాహువు, కర్కాటకంలో కేతువు కర్కాటక, మకర నవాంశల్లో సంచారం

- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఎల కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఏ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10600
బ్రేక్‌డౌన్ స్థాయి : 10400
నిరోధ స్థాయిలు: 10700, 10775 (10625 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10400, 10325 (10475 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

మిడ్‌సెషన్ మెరుగు (సోమవారానికి)

తిథి : పుష్య బహుళ సప్తమి **నక్షత్రం :** హస్త

పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, తుల, కుంభరాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 1.20

ధోరణి : గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై 10.50 వరకు అదే ధోరణిని ప్రదర్శిస్తూ తదుపరి 2.10 వరకు మెరుగ్గా మారి ఆ తర్వాత చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం..

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 10.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 11 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధ స్థాయిలు : 10705, 10740
మద్దతు స్థాయిలు : 10520, 10485
గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

క్యు3లో బ్యాంకులు డీలా..



» ఎన్‌బిఎఫ్‌సిలదే హవా

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యు3) లో బ్యాంకుల రాబడి వృద్ధి భారీగా తగ్గే అవకాశం ఉందని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక పేర్కొంది. మొండిబకాయిలతో ఏర్పడిన గండి పూడ్చుకునేందుకు పెద్ద మొత్తంలో పెద్దమొత్తంలో ప్రొవిజనింగ్ జరుపాల్సి రావచ్చని, ఇందుకుతోడు ట్రెజరీ కార్యకలాపాల ద్వారా నష్టాలు బ్యాంకుల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపవచ్చని కోటక్ నివేదిక అంచనా వేసింది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బిఎఫ్‌సి) మాత్రం క్యు3లో మెరుగైన ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని కోటక్ భావిస్తున్నది. ఈ విభాగ సంస్థల సేవలకు డిమాండ్ క్రమంగా పుంజుకుంటుండటం ఆదాయ, లాభాల్లో వృద్ధికి దోహదపడవచ్చని అభిప్రాయపడింది. మూడో త్రైమాసికంలో ఎన్‌బిఎఫ్‌సిలు 30-50 శాతం ఆదాయ వృద్ధి కనబర్చవచ్చని కోటక్ అంటున్నది. పండగ సీజన్‌లో కన్స్యూమర్, ఆటో రుణాలకు డిమాండ్ పెరగడంతో పాటు త్రైమాసిక ప్రాతిపదికన గృహ రుణ మంజూరు కూడా పుంజుకోవడం ఎన్‌బిఎఫ్‌సిలకు కలిసి రానుందని రిపోర్టు పేర్కొంది. బ్యాంకుల విషయానికొస్తే.. రిటైల్ రుణాల మంజూరు స్వల్పంగా పెరిగినప్పటికీ కార్పొరేట్ రుణాలు భారీగా తగ్గాయి. ప్రైవేట్ రంగంలో కొత్త పెట్టుబడులు మరింత తగ్గడం ఇందుకు కారణమైంది. ఈ పరిణామం బ్యాంకుల రాబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మున్ముందూ కార్పొరేట్ రుణాల వృద్ధి బలహీనంగానే ఉండవచ్చని అంచనా.

1,463 ఎన్‌పిఎ ఖాతాలు..

కనీస ఎగవేత రూ.100 కోట్లు

దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్‌బి)కు 1,463 సంస్థలు/వ్యక్తులు కనీసం రూ.100 కోట్ల చొప్పున ఎగనామం పెట్టారు. కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం.. దేశంలోని అతిపెద్ద పిఎస్‌బి అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో రూ.వంద కోట్లు లేదా అంతకుమించి బకాయిపడిన నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) ఖాతాలు 265. 2017, సెప్టెంబరు చివరినాటికి ఈ ఎన్‌పిఎ అకౌంట్స్ నుంచి ఎస్‌బిఐకి రావాల్సిన మొత్తం రూ.77,538 కోట్లు. అలాగే, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు 143 ఎన్‌పిఎ ఖాతాల నుంచి రూ.45,973 కోట్లు రావాల్సి ఉంది. రూ.వంద కోట్లకుపైగా ఎగనామం పెట్టిన ఖాతాదారుల్లో అధికం కెనరా బ్యాంక్‌కు చెందినవారు. చిన్న పిఎస్‌బిల విషయానికొస్తే.. ఈ తరహా ఖాతాలు యూనియన్ బ్యాంక్‌లో 79, ఓరియంటల్ బ్యాంక్‌లో 68, యూకో బ్యాంక్‌లో 62 ఉన్నాయి. సెప్టెంబరు చివరినాటికి పిఎస్‌బిల స్థూల నిరర్థక ఆస్తులు రూ.7.34 లక్షల కోట్ల స్థాయికి చేరుకున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థకు పెనుముప్పుగా పరిణమించిన ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆర్థిక శాఖ.. వీరిపై దివాలా కోడ్ ప్రయోగించాలని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసేందుకు వీలుగా ఆర్‌బిఐకి విశేషాధికారాలు కల్పించింది. దాంతో ఆర్‌బిఐ తొలి దఫాలో కనీసం రూ.5 వేల కోట్లకు పైగా బకాయి పడిన 12 కంపెనీలపై దివాలా పరిష్కార చర్యలు చేపట్టాలని బ్యాంకులను ఆదేశించింది. మలి దఫాలో మరో 28 కంపెనీల పేర్లను ప్రతిపాదించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేసేందుకు రెండేళ్లలో రూ.2.11 లక్షల కోట్ల మూలధనం కేటాయించనున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	400.00	చిత్తూరు	398.00
వరంగల్	402.00	చెన్నై	405.00
విజయవాడ	398.00	నమక్కల్	395.00
గోదావరి	398.00	బెంగళూరు	400.00
విశాఖపట్నం	400.00	ముంబై	440.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	86.00	విజయవాడ	86.00
కరీంనగర్	88.00	గుంటూరు	86.00
వరంగల్	86.00	ఒంగోలు	88.00
మహబూబ్‌నగర్	86.00	చిత్తూరు	70.00
కర్నూలు	86.00	నెల్లూరు	79.00
విశాఖపట్నం	82.00	అనంతపురం	78.00
గోదావరి	84.00		

ముగింపు నిలకడ

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా



నిఫ్టీ గత వారం తొలుత రియాక్షన్ సాధించి మద్దతు స్థాయి 10400 వరకు దిగజారి రికవరీ సాధించింది. ఈ రికవరీతో ఇండెక్స్ స్వల్పకాలిక కరెక్షన్‌ను నివారించుకుని అప్‌ట్రెండ్‌ను సురక్షితంగా నిలబెట్టుకుంది. తదుపరి ఆ రికవరీని కొనసాగించుకుని నిలకడగా పురోగమించి వారం గరిష్ఠ స్థాయిలో ముగియడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. అలాగే ఎగువకు గతంలో బ్రేకౌట్ సాధించిన 10500 కన్నా పైనే రెండు వారాలుగా నిలదొక్కుకోవడం కూడా సానుకూల సంకేతమే. టెక్నికల్‌గా మార్కెట్ కీలక జోన్‌లో నిలిచింది. అమెరికన్ మార్కెట్లలో బలమైన ట్రెండ్‌ను ఆసరా చేసుకుని పాజిటివ్ ధోరణిలోనే కొనసాగవచ్చు.

సోమవారం స్థాయిలు
నిరోధం: 10600, 10660
మద్దతు: 10500, 10440

బుల్లిష్ స్థాయిలు...

పాజిటివ్ ధోరణిలో ముందుకు సాగితే ప్రధాన నిరోధం 10600 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ప్రధాన నిరోధ స్థాయిలు 10800, 11000.

బేరిష్ స్థాయిలు...

రియాక్షన్‌లో పడితే భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 10500 వద్ద రికవరీ తప్పనిసరి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక అప్రమత్త సంకేతం ఇస్తుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 10400. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ : వీక్లీ చార్టుల్లో బ్యాంక్ నిఫ్టీకి ఎగువకు బలమైన రివర్సల్ బార్ ఏర్పడింది. గత రెండు నెలల్లో సాధించిన గరిష్ఠ స్థాయిలు, టాప్‌లు 25800, 26000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 25500. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగవచ్చు.

స్వల్పకాలిక వ్యూహం : 10400 దిగువన స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు బై పొజిషన్లు కొనసాగించుకోవచ్చు.

పాటర్న్ : 10600 వద్ద అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ వద్ద నిరోధం ఉంది. ప్రస్తుతం ఇండెక్స్ ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్ కన్నా చాలా పైకి ఉండడం సానుకూలత సంకేతం. నెలవారీ చార్టుల్లో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. గరిష్ఠ స్థాయిల్లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. 10400 వద్ద గతంలోను, గత వారంలోను ఏర్పడిన బాటమ్ కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. 20 డిఎంఎ కన్నా చాలా పైన ఉండడం కూడా సాధారణ పరిస్థితుల్లో తక్షణ ముప్పు లేదనేందుకు సంకేతం.

టైమ్ : ఈ సూచిక ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

హెచ్‌డిఎఫ్‌సి (రూ.1726) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.1720 ఎగువన అప్‌ట్రెండ్ **మొదటి నిరోధం** రూ.1780 **రెండో నిరోధం** రూ.1840
రూ.1690 దిగువన డౌన్‌ట్రెండ్ **మొదటి మద్దతు** రూ.1640 **రెండో మద్దతు** రూ.1600

■ వి.సుందర్ రాజా,
www.sundartrends.in

బడ్జెట్ అంచనాలు, త్రైమాసిక ఫలితాలే కీలకం

"ఈ వారంలో ప్రీ బడ్జెట్ అంచనాలు, కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసికం ఫలితాలు, స్థూల ఆర్థిక గణాంకాలు మార్కెట్ కదలికలకు కీలకం కావచ్చు."

మార్కెట్ నాడి



విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

కొత్త సంవత్సరం ప్రారంభమైన నాలుగు రోజుల అనంతరం ఎట్టకేలకు స్టాక్‌మార్కెట్లో ఆ ఉత్సాహం కనిపించింది. గత వారంలో స్టాక్ ఇండెక్స్‌లు అమెరికా, ఆసియా దేశాల ఇండెక్స్‌లతో సమాంతరంగా జీవితకాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. ఎనిమిది వారాలకు పైగా సాగిన కన్సాలిడేషన్ అనంతరం మార్కెట్లో బడ్జెట్‌కు ముందు ర్యాలీ సూచనలు కనిపించాయి. ఈ వారంలో ప్రీ బడ్జెట్ అంచనాలతో పాటుగా భారత కార్పొరేట్ రంగం మూడో త్రైమాసిక ఆదాయాలు, స్థూల ఆర్థిక గణాంకాలు, అంతర్జాతీయ మార్కెట్ ధోరణులు, క్రూడాయిల్ ధరల తీరుతెన్నులపై మార్కెట్ కదలికలు ఆధారపడి ఉంటాయి. శుక్రవారం నాడు అమెరికా ప్రకటించిన వ్యవసాయేతర వేతనాలు, నిరుద్యోగిత గణాంకాలకు స్పందనగా వారం ప్రారంభం కావచ్చు.

- టిసిఎస్ గురువారం క్యు3 ఫలితాలు ప్రకటించడం ద్వారా ఈ సీజన్‌కు శ్రీకారం చుట్టవచ్చు. అలాగే ఇండస్‌ఇండ్ బ్యాంక్ కూడా ఈ వారంలో ఫలితాలు ప్రకటించనుంది. ఇన్ఫోసిస్ ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి.
- స్థూల ఆర్థిక గణాంకాల విషయానికి వస్తే నవంబరు నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలను, డిసెంబరు నెల వినియోగదారుల ద్రవ్యోల్బణం గణాంకాలను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించనుంది.

టెక్నికల్స్ ఇవే...

నిఫ్టీ గత వారం వరుసగా రెండో వారంలో కూడా ఎగువకే పయనించి జీవితకాల గరిష్ఠ స్థాయిలను తాకింది. మరో కన్సాలిడేషన్ పాటర్న్‌ను బ్రేక్ చేసింది. 10620-10640 జోన్‌లోకి ప్రవేశించేందుకు సమాయత్తం అవుతోంది.

- బ్యాంక్ నిఫ్టీ కూడా క్షీణత పాటర్న్ నుంచి బయటపడింది. ఇప్పుడు తక్షణ నిరోధం 25780 దిశగా పయనించవచ్చు. కీలక మద్దతు స్థాయి 25320.
- ఆప్షన్స్‌ను గమనిస్తే 10400, 10500 వద్ద భారీగా పుట్ ఆప్షన్లున్నాయి. ఈ వారంలో అది బలమైన మద్దతు స్థాయిగా నిలుస్తుంది. ప్రస్తుత సీరీస్‌కు గరిష్ఠ ఓపెన్ ఇంటరెస్ట్ 11000సిఇ, 10400పిఇ వద్ద కనిపించింది. బ్యాంక్ నిఫ్టీకి ఇది 26000సిఇ, 25000పిఇగా ఉంది.

Dwaraka

ఆంధ్రజ్యోతి

బిజినెస్ ప్లస్

13 andhrajyothibusiness@gmail.com

విజయవాడ • సోమవారం 8 జనవరి 2018



క్యాలెండర్ ఇయర్ ముగిసింది. మరో మూడు నెలల్లో.. అంటే మార్చి 31, 2018తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఈ లోపే పన్ను ప్లానింగ్ జరిగిపోవాలి. ఆఖరు నిమిషంలో చేయాల్సిన ఇన్వెస్ట్‌మెంట్లు ఏమైనా ఉంటే చేసేయాలి. పన్ను రాయితీల వినియోగంపై స్పష్టత ఏర్పడాలి. టిడిఎస్ వర్తించే ఉద్యోగులు, క్లెయిమ్‌లకు అవసరమైన సాక్ష్యాధారాలు సిద్ధం చేసుకోవాలి. మినహాయింపులు పోను మీకు వర్తించే పన్ను కంటే మించి టిడిఎస్ కింద కోత పడకుండా అవసరమైన పత్రాలన్నీ ఆఫీసులో సమర్పించాలి.

మార్చి దగ్గర పడుతోంది

ఇప్పటికే మీ ఆఫీస్‌లోని అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నుంచి నోటీసు అంది ఉంటుంది కూడా. ఈ ఏర్పాట్లన్నీ హడావుడిగా ఆఖరు నిమిషంలో చేసేకన్నా ఇప్పటి నుంచే జాగ్రత్తపడటం మంచిది. ఆఫీసులో సమర్పించిన ఆధారాల అసలు పత్రాల కాపీలను జాగ్రత్త చేసుకోవడం కూడా అత్యంత ముఖ్యం. ఒకవేళ ఐటి శాఖ నుంచి నోటీసులు అందిన పక్షంలో వారికి ఇవన్నీ చూపాల్సి ఉంటుంది.

సెక్షన్ 80సి కింద మినహాయింపుల కోసం

ఈ సెక్షన్ కింద పెట్టే పెట్టుబడులపై ఏటా రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. హౌజింగ్ లోన్ మూలధనం చెల్లింపు, బీమాతో సహా అనేకరకాల పెట్టుబడులకు సెక్షన్ 80సి కింద మినహాయింపులు వర్తిస్తాయి. ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఇఎల్ఎస్ఎస్), జీవిత బీమా పథకాలు, పిపిఎఫ్‌తో సహా చిన్న పొదుపు పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఇప్పటికే ఇన్వెస్ట్ చేస్తే ఓకే.. లేదంటే ఇప్పటికైనా 80సి కింద గరిష్ఠంగా 1.5 లక్షల రూపాయల మేర పన్ను మినహాయింపు పొందడానికి అవసరమైన ఇన్వెస్ట్‌మెంట్స్ చేస్తే మంచిది. ఇన్వెస్ట్‌మెంట్లు చేయడంతో సరిపోదు. ఎక్కువ మొత్తంలో టిడిఎస్ కట్ కాకుండా, ఇఎల్ఎస్ఎస్ అయితే ఫండ్ స్టేట్‌మెంట్, జీవిత బీమా పాలసీ అయితే ప్రీమియం చెల్లించిన రసీదులను ఆఫీసు అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో సమర్పించాలి. పిపిఎఫ్ పెట్టుబడులకు సంబంధించి బ్యాంకు లేదా పోస్టాఫీసు ద్వారా చేసిన ఆర్థిక లావాదేవీల వివరాలు సూచించే పాస్‌బుక్ ఫొటో కాపీ ఇస్తే సరిపోతుంది. ఒకవేళ ఆన్‌లైన్ ద్వారా పిపిఎఫ్‌లో పెట్టుబడులు పెడితే ఖాతా వివరాలు, లావాదేవీల వివరాలు తెలిపే ఇ-రసీదు సమర్పించాలి. ఇవేవీకాకుండా సుకన్య సమృద్ధి యోజన లేదా ఐదేళ్ల కాలపరిమితి ఉండే టాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేస్తే బ్యాంకు ఇచ్చే డిపాజిట్ రసీదు లేదా సర్టిఫికెట్ కాపీ సమర్పించాలి. ఈ జాగ్రత్తలు తీసుకోని పక్షంలో టిడిఎస్ ఎక్కువ కట్ కావడం తథ్యం. మళ్లీ రిటర్న్ ఫైల్ చేసిన తర్వాత రిఫండ్ కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది.

ట్యూషన్ ఫీజు

మీకు తెలుసుకదా.. మీ పిల్లలకు స్కూలు, కాలేజీల్లో చెల్లించే ట్యూషన్ ఫీజుకు కూడా 80సి కింద మినహాయింపు వర్తిస్తుంది. ఐటి రాయితీ క్లెయిమ్ చేస్తుంటే ఫీజులకు సంబంధించిన రసీదుల ఫొటో కాపీని అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇవ్వాలి. ఆ రసీదుపై స్కూలు అధికారిక స్టాంప్, ఫీజు అందుకున్న వారి సంతకం తప్పకుండా ఉండాలి.

తొలిసారి ఇల్లు కొన్న వ్యక్తులు

కొత్తగా ఇల్లు కొన్నవారికి ఈసారి ప్రత్యేక రాయితీ ఉంది. సాధారణంగా సెక్షన్ 24 కింద గృహ రుణాలపై చెల్లించే వడ్డీ మొత్తంలో గరిష్ఠంగా రూ.2 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. మొట్టమొదటిసారిగా ఇల్లు కొన్నవారికి అదనంగా మరో 50,000 రూపాయల వరకు సెక్షన్ 80ఇఇ కింద ప్రభుత్వం మినహాయింపు కల్పించింది. అంటే తొలిసారి ఇల్లు కొన్నవారికి వడ్డీ చెల్లింపులపై 2.5 లక్షల రూపాయల వరకు పన్ను రాయితీ ఉంటుంది.

బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి మూలధనం (80సి కింద మినహాయింపు) వడ్డీ చెల్లింపులకు సంబంధించిన సర్టిఫికెట్ తీసుకొని ఆఫీసులో ఇవ్వండి. ఈ సర్టిఫికెట్‌లో రుణం చెల్లింపునకు సంబంధించిన బ్రేకప్ ఉంటుంది. అంటే మూలధనం కింద ఎంత చెల్లించారు, వడ్డీ కింద ఎంత చెల్లించారనే విషయాలు వివరంగా ఉంటాయి.

హెచ్ఆర్ఎ మినహాయింపు

హెచ్ఆర్ఎపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసే వారు తగిన పత్రాలను సిద్ధం చేసుకోవాలి. ఇంటి వార్షిక అద్దె రూ.లక్ష (నెలకు రూ.8,333) దాటితే ఇంటి యజమాని పాన్ నంబర్ కూడా తప్పనిసరిగా పేర్కొనాలి. ఇంకా నిర్ణీత ఫారంలో ఇంటి యజమాని సంతకంతో కూడిన లీజు అగ్రిమెంట్, ఇంటి యాజమాన్యానికి సంబంధించిన ఆధారాలు కాపీలు ఇవ్వాలి. ఇంటి యాజమాన్యానికి సంబంధించి పన్ను రసీదు లేదా తాజా విద్యుత్ బిల్లు సరిపోతుంది. ఇల్లు ఏదైనా కో ఆపరేటివ్ సొసైటీలో ఉంటే ఆ సొసైటీ ఇచ్చే షేర్ సర్టిఫికెట్ అయినా సరిపోతుంది. ఏప్రిల్ 2016 నుంచి ఇప్పటి వరకు అందుకున్న ఒరిజినల్ అద్దె రసీదులు కూడా సమర్పించాలి.

గృహ రుణంతో కొన్న ఇంటిని అద్దెకిచ్చినా ఆ రుణంపై చెల్లించిన అసలు, వడ్డీల వివరాలను విడివిడిగా పేర్కొంటూ బ్యాంకు ఇచ్చిన సర్టిఫికెట్ జత చేయాలి.

ఎన్‌పిఎస్ పెట్టుబడులు

మీరు పని చేసే కంపెనీ ద్వారా ఎన్‌పిఎస్‌లో పెట్టుబడులు పెడితే, ఆ వివరాలన్నీ మీ కంపెనీ దగ్గరే ఉంటాయి. కాబట్టి ఆ పెట్టుబడుల వివరాలు ప్రత్యేకంగా కంపెనీకి సమర్పించాల్సిన అవసరం లేదు. అలా కాకుండా జీతం నుంచి కాకుండా ఇతరత్రా వచ్చే ఆదాయం నుంచి ఎన్‌పిఎస్‌లో వ్యక్తిగత హోదాలో రూ.50,000 పెట్టుబడి పెడితే మాత్రం ఆ వివరాలు ఆఫీసుకు సమర్పించాలి. ఇందుకోసం ఉద్యోగి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్ (ప్రాన్), టైర్ 1 ఖాతాకు సంబంధించిన ఎన్‌పిఎస్ లావాదేవీల స్టేట్‌మెంట్ వివరాలు ఇవ్వాలి.

మెడిక్లెయిమ్

మెడిక్లెయిమ్ పాలసీ కింద చెల్లించిన ప్రీమియం ప్రూఫ్‌లు కంపెనీకి ఇవ్వాలి. ఈ చెల్లింపులకు సెక్షన్ 80డి కింద సీనియర్ సిటిజన్లకు రూ.30,000 వరకు, ఇతరులకు రూ.25,000 వరకు మినహాయింపు లభిస్తుంది.



మోసపూరిత ఇ-మెయిల్స్‌తో జాగ్రత్త!

సైబర్ నేరగాళ్లు అక్రమ సంపాదన కోసం విభిన్న మార్గాలను అన్వేషిస్తున్నారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేస్తూ ఎటిఎం కార్డు నెంబరు, ఒటిపి నెంబరును తెలుసుకుని ఖాతాల్లోని సొమ్మును ఖాళీ చేస్తున్న ఉదంతాలు వెలుగుచూస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వీరి దృష్టి ఆదాయం పన్ను రిటర్నులను సమర్పించే వారిపై పడింది. రిటర్నులు ఫైల్ చేసే వారి వివరాలు, ఇ-మెయిల్స్‌ను తెలుసుకుని వారికి మెయిల్స్ పంపుతున్నారు. ఆదాయం పన్ను శాఖ పేరుతో ఇ-మెయిల్స్ ఉండటం వల్ల కొంత మంది సైబర్ నేరగాళ్ల వలలో పడి నష్టపోతున్నారని సైబర్ క్రైమ్ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఆదాయం పన్నుకు సంబంధించిన రిఫండ్స్ పొందేందుకుగాను బ్యాంకు ఖాతా వివరాలతోపాటు మొబైల్ నెంబరు, ఒటిపిని తెలియజేయాలంటూ ఇ-మెయిల్స్ పంపుతున్నారు. ఈ వివరాలను తెలియజేసేందుకు వీలుగా ఒక లింక్‌ను పంపిస్తున్నారు. ఇందులో బ్యాంకు ఖాతా వివరాలు, మొబైల్ నెంబరు, ఒటిపి వివరాలను తెలియజేస్తే.. ఇక ఖాతాలోని సొమ్ము ఖాళీ అయిపోయినట్టేనని అధికారులు చెబుతున్నారు. కాబట్టి ఇలాంటి మెయిల్స్ పట్ల జాగ్రత్త వహించండి.

పొదుపు ఖాతాపైనా అధిక రాబడులు

దేశంలో వడ్డీ రేట్లు పడిపోతున్నాయి. బ్యాంకుల పొదుపు ఖాతా (ఎస్‌బి అకౌంట్)పైనా ఇదే పరిస్థితి. కొన్ని బ్యాంకులైతే ఎస్‌బి ఖాతాలోని డిపాజిట్లపై ప్రస్తుతం 3.5 శాతానికి మించి వడ్డీ చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో ఎస్‌బి ఖాతా ప్రాముఖ్యత, సరిగా ఎంచుకోవడం ద్వారా దానిపైనా అధిక వడ్డీ రాబడులు పొందడం ఎలా? అనే విషయాలను కోటక్ మహీంద్రా బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ పేమెంట్ ప్రొడక్ట్స్) **అంబుజ్ చంద్ర** 'బిజినెస్ ప్లస్' పాఠకులకు వివరిస్తున్నారు.



జాగ్రత్తగా ఎంచుకోవడమే ముఖ్యం

'ఎవరు తన కోసం పని చేస్తారో డబ్బు వారి కోసమే పని చేస్తుంది' అని విజ్ఞులు తరచూ చెబుతుంటారు. అవసరాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు అనేక విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఎపుడు ఏ అవసరం వచ్చినా అప్పటికపుడు కావలసిన నిధుల అవసరం, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక అవసరాలు, లక్ష్యాలు, నష్ట భయం, పన్నుల భారం ఆధారంగా ఈ నిర్ణయాలు ఆధారపడి ఉంటాయి. అన్నిటి కంటే ముఖ్యగా కష్టపడి కూడబెట్టిన డబ్బుల్ని మంచి రాబడులు ఇచ్చే ఆకర్షణీయమైన సురక్షిత పెట్టుబడుల్లో ఇన్వెస్ట్ చేయాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

భవిష్యత్ ఆర్థిక అవసరాల కోసం ప్రతి ఒక్కరూ తమ ఆదాయంలో ఎంతో కొంత పొదుపు చేస్తుంటారు. ఇలా పొదుపు చేస్తూనే అప్పటికపుడు ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వాడుకునేందుకు వీలుగా కొంత మొత్తాన్ని రెడీగా ఉంచుకోవాలి. నెలనెలా అయ్యే స్థిర ఖర్చుల కంటే ఈ అత్యవసర నిధి కనీసం మూడు రెట్లు ఉండాలి. చాలా మంది ఈ అత్యవసర నిధిని బ్యాంకుల పొదుపు ఖాతా (ఎస్‌బి అకౌంట్)లో అట్టిపెట్టుకుంటారు. పెద్దగా పన్ను పోటు లేకుండా ఎపుడు కావాలంటే అపుడు డిపాజిట్ చేసే అవకాశంతో పాటు వెనక్కి తీసుకునే వెసులుబాటు ఎస్‌బి అకౌంట్ ద్వారానే సాధ్యం.

వడ్డీ రేట్లు

ప్రస్తుతం దేశంలో వడ్డీ రేట్లు తగ్గిపోతున్నాయి. 2014లో ఏడాది కాల పరిమితి ఉండే డిపాజిట్‌పై బ్యాంకులు 9.1 శాతం వరకు వడ్డీ చెల్లించేవి. ఇప్పుడిది 6.5 శాతానికి పడిపోయింది. మూడేళ్ల కాల పరిమితి ఉండే డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటు ఇదే సమయంలో 8.75 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గిపోయింది. ఎస్‌బి ఖాతాలోని బ్యాలెన్స్‌పై చెల్లించే వడ్డీని బ్యాంకులు ఇటీవల నాలుగు శాతం నుంచి 3.5 శాతానికి కుదించాయి. దీంతో చాలా మంది ఎస్‌బి ఖాతాలో డబ్బు ఉంచడాన్ని వృథాగా భావిస్తున్నారు.

ఇప్పటికీ అధిక వడ్డీ అవకాశాలు

పేమెంట్స్ బ్యాంకుల పుణ్యమాని ఇటీవల ఎస్‌బి ఖాతాకు మళ్లీ ప్రాముఖ్యత పెరుగుతోంది. ఈ బ్యాంకులు ఖాతాలోని బ్యాలెన్స్‌పై ఆరు శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తున్నాయి. వీటి శాఖలకు కూడా వెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారానే ఐదు నిమిషాల్లో వీటిలో ఎస్‌బి ఖాతా ప్రారంభించే అవకాశం ఉండడం ఈ బ్యాంకులు అందిస్తున్న మరో ప్రత్యేకత. ఈ ఖాతాల్లో రోజూ కనీసం రూ.లక్ష బ్యాలెన్స్ ఉంచితే ఏ మాత్రం రిస్కు లేకుండానే సాధారణ బ్యాంకులోని ఎస్‌బి ఖాతా కంటే 1.7 రెట్ల ఎక్కువ వడ్డీ ఆదాయం పొందవచ్చు. ఈ విషయం తెలియక చాలా మంది తమ మిగులు నిధులను అరకొర వడ్డీ చెల్లించే బ్యాంకుల ఎస్‌బి ఖాతాల్లో ఉంచి బాగా నష్టపోతున్నారు. ఏటా ఇలా నష్టపోయే వడ్డీ ఎంత లేదన్నా రూ.50,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

పన్నుల్లోనూ ఆదా

పన్నులపరంగా చూసినా ఎస్‌బి ఖాతాల్లోని డిపాజిట్లపై వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.10,000 దాటనంత వరకు ఎలాంటి పన్ను పోటు ఉండదు. అలాగే మైనర్ పిల్లల పేరు మీద ఎస్‌బి ఖాతాల్లో ఉండే డిపాజిట్లపై వచ్చే వార్షిక వడ్డీపైనా తల్లిదండ్రులు రూ.1,500 వరకు మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. అదే లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే పన్ను పోటు ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబులను బట్టి, పెట్టుబడులు ఎంత కాలం ఉంచారు? అనే విషయాలపై ఆధారపడి ఉంటుంది.

క్లుప్తంగా చెప్పాలంటే ఎన్ని పెట్టుబడి మార్గాలు అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ ప్రతి వ్యక్తి పోర్టుఫోలియోలో ఎస్‌బి ఖాతాకు ప్రాధాన్యత ఉంది. కాకపోతే సరైన బ్యాంకుల్లో ఈ ఖాతా ప్రారంభించడం ద్వారా ఏ మాత్రం రిస్కు లేకుండానే అధిక వడ్డీ ఆదాయం పొందవచ్చు.

మర్చంట్ ఎక్స్‌పోర్టర్స్ అంటే..



గొండాల రాంబాబు

ఇదీ జీఎస్‌టీ

ఒక దేశం నుంచి ఇతర దేశాలకు వస్తువులను ఒక వ్యక్తి/ వ్యాపార సంస్థ ఎగుమతి చేస్తుంది. ఆయా వస్తువులను అదే సంస్థ తయారు చేసి ఉండవచ్చు లేదా ఆ వస్తువులను వేరే తయారీదారుని నుంచి కొనుగోలు చేసి ఉండవచ్చు. అంటే ప్రతి ఎగుమతిదారుడు ఆయా వస్తువుల తయారీదారుడు అయి ఉండకపోవచ్చు. వాటిని వేరే దగ్గర నుంచి కొని ఎగుమతి చేయవచ్చు. ఇలాంటి వ్యక్తులను మర్చంట్ ఎక్స్‌పోర్టర్‌గా వ్యవహరిస్తారు. మర్చంట్ ఎక్స్‌పోర్టర్ ఎగుమతిదారుడు అయినప్పటికీ తనకు ఎలాంటి సొంత పరిశ్రమ ఉండదు.

జిఎస్‌టి రావటానికి పూర్వం మర్చంట్ ఎక్స్‌పోర్టర్ ఒక తయారీదారుని దగ్గర నుంచి సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ కట్టకుండా నేరుగా వస్తువులను ఎగుమతి చేయటానికి అవకాశం ఉండేది. జిఎస్‌టి వచ్చిన తర్వాత ఈ అవకాశాన్ని తీసివేసి తయారీదారుడు, ఎగుమతిదారుడు మధ్య జరిగే లావాదేవీలు సాధారణ సరఫరా కింద భావించాలని, ఎగుమతిదారుడు పన్ను కట్టి వస్తువులను కొనుగోలు చేయాలని ఎగుమతి జరిగిన తర్వాత రిఫండ్ తీసుకోవచ్చని తొలుత ప్రతిపాదించారు. కానీ దీని ద్వారా ఎగమతిదారులకు అంటే మర్చంట్ ఎక్స్‌పోర్టర్స్‌కు ఇబ్బందికరంగా ఉంటుందని, ఈ ప్రక్రియను సులభతరం చేయాలని అభ్యర్థనలు రావటంతో దీనికి సంబంధించి ఈ క్రింది మార్పులు చేశారు.

- ఎగుమతిదారుడు, తయారీదారుని వద్ద నుంచి సరుకు కొనుగోలు చేసేటప్పుడు, ఆ వస్తువు పన్ను రేటుతో సంబంధం లేకుండా కేవలం 0.1 శాతం పన్ను కడితే సరిపోతుంది. దీనికి కొన్ని నిబంధనలు ఉన్నాయి.
- ఎగుమతిదారుడు జిఎస్‌టి కింద రిజిస్ట్రేషన్ తీసుకుని ఉండాలి. దీంతోపాటు కేంద్ర వాణిజ్య శాఖ నుంచి గుర్తింపు పొందిన ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ లేదా కమోడిటీ బోర్డ్‌లో సభ్యత్వం పొంది ఉండాలి.
- ఎగుమతిదారుడు, తయారీదారుడు ఇచ్చిన ఇన్వాయిస్‌లోని తేదీ నుంచి 90 రోజుల్లోపు ఎగుమతి పూర్తి చేయాలి.
- ఎగుమతిదారుడు, తనకు తగ్గింపు రేటుతో సరుకు సరఫరా చేయాలని తయారీదారుడికి ఒక ఆర్డర్ పెట్టాల్సి ఉంటుంది. దీని ప్రతిని సరఫరాదారునికి సంబంధించిన పన్ను అధికారికి పంపించాలి.
- అలాగే ఎగుమతి జరిగినట్లుగా నిర్ధారించే పత్రాలను విధిగా పంపాల్సి ఉంటుంది.
- ఒకవేళ నిర్ధారిత గడువు లోపు ఎగుమతి చేయకుంటే సరఫరాదారుడే (తయారీదారుడు) దీనికి బాధ్యత వహించాలి. దీన్ని సాధారణ అమ్మకం కింద భావించి మొత్తం పన్ను కట్టాల్సి ఉంటుంది.

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

కనీస నిల్వపేరుతో బాదుడు

SBI

ఖాతాలో కనీస నిల్వలేదన్న సాకుతో బ్యాంకులు ఎడాపెడా వడ్డనలకు దిగుతున్నాయి. బ్యాంకుల దెబ్బకు సామాన్యులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆర్‌బిఐ నిబంధనలకు కూడా నీళ్లు వదిలి బ్యాంకులు కస్టమర్లను కొల్లగొడుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎస్‌బిఐపై మరీ తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఏప్రిల్ నుంచి నవంబరు మధ్య 1,771 కోట్ల రూపాయలను పెనాల్టీ కింద ఈ బ్యాంకు వసూలు చేసింది. ఇది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో బ్యాంకు సాధించిన నికర లాభం కంటే ఎక్కువ. కస్టమర్లు, మీడియా నుంచి తీవ్రమైన విమర్శలు రావడంతో తాజాగా పెనాల్టీలు, చార్జీలను తగ్గిస్తామని ఎస్‌బిఐ ప్రకటించింది. ఒకటి రెండు రోజుల్లో బ్యాంకు నుంచి ప్రకటన రావచ్చని అంచనా. వాస్తవానికి ఈ కనీస నిల్వ నిబంధనను ఐదేళ్ల పాటు ఎత్తేసి ఆర్‌బిఐ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో 2017 ఏప్రిల్ నుంచి మళ్లీ అమల్లోకి తెచ్చారు. ఏప్రిల్‌లో దీన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత గత అక్టోబరులో మార్పులు చేశారు. ప్రస్తుతం ఎస్‌బిఐ కనీస నిల్వకు సంబంధించి ఎలాంటి నిబంధనలు అమలు చేస్తోంది. పాటించని కస్టమర్లపై ఏమేరకు వడ్డనలకు దిగుతోంది.. అనే అంశాలు మీకోసం.

మెట్రో నగరాలు

- మెట్రో నగరాలు, పెద్ద పట్టణాల్లో కనీస సగటు నిల్వ మొత్తం 3,000 రూపాయలు. ఈ బ్రాంచ్‌ల్లోని ఎస్‌బి ఖాతాల్లో నెలవారీ కనీస బ్యాలెన్స్ 3,000 రూపాయల కంటే 50 శాతం వరకు తగ్గితే రూ.30 పెనాల్టీగా వేస్తారు. 50-75 శాతం మధ్య తగ్గితే 40 రూపాయలు వడ్డిస్తారు. 75 శాతానికంటే ఎక్కువ తగ్గితే రూ50 పెనాల్టీ విధిస్తున్నారు. ఈ పెనాల్టీలపై జిఎస్‌టి కూడా విధిస్తారు.

సెమీ అర్బన్ శాఖలు

- ఈ శాఖల్లో ఎస్‌బి ఖాతా ఉన్న వ్యక్తులు ప్రతి నెలా కనీసం రూ.2,000కు తగ్గకుండా కనీస బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయాలి. ఏ నెలలో అయినా ఈ కనీస బ్యాలెన్స్ 50 శాతం వరకు తగ్గితే 25 రూపాయలు, 50 నుంచి 75 శాతం తగ్గితే 50 రూపాయలు, 75 శాతానికి మించి తగ్గితే 75 రూపాయలు పెనాల్టీ చెల్లించాలి. ఈ పెనాల్టీలపై జిఎస్‌టి ఎలాగూ ఉంటుంది.

గ్రామీణ శాఖలు

- గ్రామీణ ఎస్‌బిఐ శాఖల్లో కనీస బ్యాలెన్స్ ప్రస్తుతం రూ.1,000. ఏ నెలలో అయినా ఇది 50 శాతం వరకు తగ్గితే 20 రూపాయలు, 50 నుంచి 75 శాతం తగ్గితే 30 రూపాయలు, 75 శాతానికి మించి తగ్గితే రూ.50 పెనాల్టీగా జిఎస్‌టితో సహా వసూలు చేస్తున్నారు.


గ్రావిటా ఇండియా

షేర్‌షాట్

లెడ్ లోహాన్ని రీసైక్లింగ్ చేసే కంపెనీల్లో అగ్రగామి ఇది. ఆటోమొబైల్, టెలికాం, ఫార్మా, విద్యుత్, న్యూక్లియర్ పరిశ్రమలకు లెడ్‌ను ఈ కంపెనీ సరఫరా చేస్తోంది. లెడ్ ఓర్, లెడ్ కాన్సన్ట్రేట్, లెడ్ బ్యాటరీ స్క్రాప్, అల్యూమినియం స్క్రాప్‌లను ప్రాసెస్ చేసి సెకండరీ లెడ్ మెటల్, అల్యూమినియం ఇంగోట్స్‌ను తయారు చేస్తోంది. అలాగే లెడ్ అల్లాయ్స్, లెడ్ పౌడర్ అండ్ ఆక్సైడ్స్‌ను తయారు చేస్తోంది. రీసైకిల్ చేసిన పాలీప్రొపలీన్ గ్రాన్యూల్స్, పిపిసిపి గ్రాన్యూల్స్, పిఇటి ప్లేక్స్‌ను కూడా ఉత్పత్తి చేస్తోంది. భారత్‌లో జమ్ము, జైపూర్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుల్లో ప్లాంట్లను కలిగి ఉంది. గత ఏడాది జనవరిలో చిత్తూరు ప్లాంట్ అదనంగా 12 వేల టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తి ప్రారంభించింది. అలాగే మారిషస్ ప్లాంట్ కూడా ఈ మధ్యనే ఉత్పత్తిని ప్రారంభించింది. మొత్తం అన్ని ప్లాంట్లు కలిపి ఏడాదికి 1,13,419 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అలాగే అల్యూమినియం సామర్థ్యం 6000 మెట్రిక్ టన్నులతో పాటు మరో 3600 మెట్రిక్ టన్నుల పిఇటి ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంది. లెడ్ ఉత్పత్తిదారులకు టర్న్‌కీ ప్రాతిపదికన ప్లాంట్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్‌ను కూడా అందిస్తోంది. ఇప్పటికి దాదాపు 40 దేశాల్లో టర్న్‌కీ ప్లాంట్లను నెలకొల్పింది. లెడ్ ధరల్లో ఒడుదుడుకులను ఎదుర్కొనేందుకుగాను బ్యాక్ టు బ్యాక్ హెడ్జింగ్ మెకానిజమ్‌ను కూడా అభివృద్ధి పరుచకుంది. గత దశాబ్ధకాలంగా కంపెనీ మంచి పనితీరును కనబరుస్తూ వస్తున్నది. అమ్మకాల్లో 40 శాతం, నికర లాభంలో సిఎజిఆర్ 31 శాతం చొప్పున వృద్ధిని సాధిస్తూ వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా లెడ్‌కు 1.2 కోట్ల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉంది. దేశీయ డిమాండ్ 9 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ప్రపంచ లెడ్ డిమాండ్ ఏటా 3 శాతం చొప్పున, భారత లెడ్ డిమాండ్ ఏటా 12 శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఆఫ్రికా, దక్షిణ అమెరికాల్లో కొత్త ప్లాంట్లను ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఈ ప్లాంట్లు 2019 నాటికి ఉత్పత్తిని ప్రారంభించవచ్చు. కంపెనీ ఇటీవల రీసైకిల్డ్ లెడ్‌ను సరఫరా చేసేందుకు ఎక్సైడ్ ఇండస్ట్రీస్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అమర రాజా బ్యాటరీస్‌తో కూడా ఒప్పందాన్ని కుదుర్చుకోనుంది. మరికొంత వ్యూహాత్మక ఒప్పందాల ద్వారా కంపెనీ ఆర్డర్ బుక్‌ను పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. త్వరలో పేపర్ రీసైక్లింగ్ బిజినెస్‌ను ప్రారంభించనుంది. దీనికోసం ఆఫ్రికా నుంచి పేపర్ స్క్రాప్‌ను ఎగుమతి చేస్తోంది.

ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో 39 శాతం వృద్ధితో రూ.225 కోట్ల రాబడిని సాధించింది. ఉత్పత్తి పెంపు, లెడ్ ధరల్లో పెరుగుదల కారణంగా ఈ టర్నోవర్ సాధ్యమైంది. స్థూల లాభ మార్జిన్లు 7.7 శాతం నుంచి 11.5 శాతానికి పెరిగాయి. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.14.22 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 95 శాతం మేర ఇపిఎస్ వృద్ధిని సాధించింది. 2016 మార్చి నుంచి 2017 నాటికి ఇపిఎస్ 64 పైసల నుంచి రూ.4.43 కు పెరిగింది. రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్ఒఇ) 20 శాతం మేర ఉంది. విలియం ఓ నీల్ క్యాన్‌స్లిమ్ మెథడాలజీ ప్రకారం ఇపిఎస్ రేటింగ్ 91 గా ఉంది. అంటే లిస్ట్ అయిన కంపెనీల్లో 91 శాతం కంపెనీల కన్నా మెరుగైన రాబడులను కలిగి ఉంది. క్యాన్‌స్లిమ్ అంశాలన్నింటిని కలిగి ఉంది. అక్యుములేషన్ కూడా భారీగా జరుగుతోంది. ప్రస్తుతం ఇందులో సంస్థాగత ఇన్వెస్టర్లకు 2 శాతం మేర వాటా ఉంది. సెప్టెంబరు నాటికి ఇందులో మదుపు చేసిన ఎఫ్ఐఐల సంఖ్య 9 నుంచి 14కు పెరిగింది



టెక్నికల్స్

ఈ షేరు 12 వారాల కన్సాలిడేషన్ నుంచి బయటపడింది. ఈ కన్సాలిడేషన్‌లో ఏర్పడిన ఫ్లాగ్ ప్యాట్రన్ గరిష్ఠ వాల్యూమ్స్‌తో జరిగింది. అలాగే ఓ నీల్ డబుల్ బాటమ్ బ్రేకౌట్ కూడా జరిగింది. దీనికన్నా ముందు 2014, సెప్టెంబరు నుంచి 2017 జూలై మధ్య కాలంలో ఏర్పడిన సుదీర్ఘ కప్ ప్యాట్రన్ బ్రేకౌట్‌తో రూ.96 నుంచి రూ.172కు పెరిగింది. శుక్రవారం నాటి ఫ్లాగ్ బ్రేకౌట్‌తో కొత్త గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. మూమెంటమ్ ఇండికేటర్లన్నీ బ్రేకౌట్‌ను ధ్రువీకరిస్తూ బుల్లిష్ ధోరణిని కనబరుస్తున్నాయి. ప్రస్తుత బ్రేకౌట్ లక్ష్యం రూ.238. వచ్చే 18 నుంచి 24 నెలల కాలంలో ఈ షేరు లక్ష్యం రూ.369. టెక్నికల్ స్టాప్‌లాస్ రూ.152.

టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్ (tbchary@gmail.com)

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

మన మారథాన్‌కు ప్రపంచ గుర్తింపు

అన్ని నగరాలలో నిర్వహించాలి: సీఎం చంద్రబాబు

భారీగా తరలి వచ్చిన ఔత్సాహికులు

విజయవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన అమరావతి మారథాన్‌కు అనూహ్య స్పందన వచ్చింది. కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సుమారుగా 7500 మంది యువతీ యువకులు రన్‌లో పాల్గొన్నారు. హాఫ్‌మారథాన్, 10కే, 5కే రన్ విభాగాల్లో అమరావతి మారథాన్ నిర్వహించారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అమరావతి మారథాన్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మారథాన్‌ను విజయవాడతోపాటు తిరుపతి, విశాఖపట్నంలో నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. 10కే రన్ పురుషుల విభాగంలో విజయం సాధించిన విజయ్ కుమార్, రమేష్, జయదేవ్, మహిళల విభాగంలో సౌజన్య, ప్రియదర్శిని, శివానీ, కీర్తికలకు, 21కే పురుషుల విభాగంలో గెలుపొందిన లింగన్న, వెంకటేశ్వరరావు, బాబూరావు, మహేంద్రలతో పాటు మహిళల విభాగంలో ఉషారాణికి ముఖ్యమంత్రి బహుమతులు ప్రదానం చేశారు. 21కే రన్ సీనియర్ పురుషుల విభాగంలో మహ్మద్, శ్రీనివాసరెడ్డి, సునీల్, శ్రీకాంత్, 10కే రన్ సీనియర్ విభాగంలో పార్థసారథి, బాబూరావు, ఈశ్వరరావు, సూర్యలకు చంద్రబాబు నగదు బహుమతి, జియో సెల్‌ఫోన్లు అందజేశారు.



విజయవాడలో జరిగిన అమరావతి మారథాన్‌లో పాల్గొన్న యువత

జన్మభూమిపై 93% సంతృప్తి

- 70 వేల ఫిర్యాదులు పరిష్కారం
- కార్డులు, ఇళ్ల కోసం వేరుపడొద్దు
- ఉమ్మడి కుటుంబాలకు మరింత లబ్ధి
- అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో సంతృప్తి, సమాజంలో సంతోషమే మనందరి లక్ష్యం కావాలి. ఇందుకోసం సమర్థంగా జరుగుతున్న జన్మభూమి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆరోరోజు 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం నిర్వహణపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మొత్తంగా జన్మభూమిపై 93 శాతం మంది ప్రజల్లో సంతృప్తి వ్యక్తమైందని వెల్లడించారు. చంద్రన్న బీమా పట్ల 70శాతం, జన్మభూమి కమిటీల పనితీరుపై 63 శాతం సంతృప్తి వచ్చిందన్నారు. సాధికారమిత్రల పనితీరు 58 శాతం బాగుందని, పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. 'ఇప్పటివరకూ 6,15,124 ఫిర్యాదులు అందాయి. వాటిలో 3,22,912(52శాతం) ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. 70,380 ఫిర్యాదులను పరిష్కరించాం. కర్నూలు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ఫిర్యాదుల అప్‌లోడ్ వేగం పెంచుకోవాలి. ఆధార్ నంబరు ద్వారా ఎవరి ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో చెప్పగలగాలి. ప్రతిరోజూ జన్మభూమి వైద్యశిబిరాల్లో 1.2లక్షల మంది చికిత్స పొందుతున్నారు. పశువైద్య శిబిరాల్లో రోజూ 10లక్షల పశువులకు చికిత్స అందుతోంది. ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం కుటుంబాలు వేరుపడడం మంచిది కాదు. ఒకే ఇంట్లో ఉంటూ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల కోసం విడిపోవడం బాధాకరం. తల్లిదండ్రులను బాగా చూసుకునేవారికే సింగపూర్‌లో ఇళ్లు ఇస్తారు. ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతుంది. మన వద్ద కూడా ఉమ్మడి కుటుంబంగా ఉండేవారికి ప్రభుత్వ పథకాల ద్వారా అధిక లబ్ధి కలిగించే అంశాన్ని పరిశీలించండి' అని అధికారులను ఆదేశించారు. పండుగ కానుకలను కుటుంబాల పరంగా కాకుండా, కుటుంబ సభ్యుల ప్రాతిపదికన ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. సమర్థంగా పనిచేసిన అధికారులు, సిబ్బందికి శాఖాపరంగా అవార్డులు ఇస్తామని, బాగా పనిచేసిన సిబ్బంది, ప్రజాప్రతినిధులను 11, 12 తేదీల్లో సత్కరిస్తామని సీఎం తెలిపారు. గ్రామసభల్లో మాట్లాడుతున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ప్రతిబింబిస్తోందని, వారిలో ఆ స్ఫూర్తిని మరింత పెంచాలని సూచించారు.

కరువుకు చెక్





కర్నూలు జిల్లా సిద్ధాపురంలో ఎద్దుల బండి తోలుతున్న సీఎం, విజయవాడలో సీఎంకు ఫొటో తీస్తున్న కమిషనర్ సవాంగ్

(మొదటి పేజీ తరువాయి)

ఆరో రోజు 'సహజ వనరులు-అభివృద్ధి' అనే అంశాన్ని తీసుకున్నామని చెప్పారు. గోదావరి నుంచి ఏటా 3-4 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, అందులో నుంచి 200-300 టీఎంసీలు వినియోగించుకున్నా నవ్యాంధ్ర సస్యశ్యామలమవుతుందని చెప్పారు. రైతు కంట కన్నీరు లేకుండా చేయాలంటే పోలవరం పూర్తి కావాలన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి నదులు అనుసంధానించామని.. తద్వారా కృష్ణా డెల్టా నీటి వాటాను శ్రీశైలంలో నిల్వ చేసి హంద్రీ-నీవా, తెలుగుగంగ, కేసీ కాలువ, గాలేరు-నగరి ద్వారా రాయలసీమకు మళ్లించి రతనాల సీమగా మార్చే సంకల్పంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. పట్టిసీమ లేకుంటే సిద్ధాపురానికి కృష్ణా జలాలు వచ్చేవా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 40 నదులు, 40,110 చెరువులు, 15.37 లక్షల పంపుసెట్లు, 1096 ఎత్తిపోతల పథకాలు, 6.32 లక్షల పంట కుంటలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకుంటే ప్రతి రైతూ సుభిక్షంగా ఉంటారని అన్నారు. ప్రతిపక్షం, ఇతర పార్టీల నాయకులు ఎన్నో ఇబ్బందులు సృష్టించారని, ఉభయగోదావరి జిల్లాల రైతులను రెచ్చగొట్టారని, తనపై నమ్మకంతో వారు రెచ్చిపోలేదని కొనియాడారు. రాయలసీమకు 144 టీఎంసీలు ఇచ్చిన ఘనత తనదేనని చెప్పారు. ఒక టీఎంసీ నీటితో 10 వేల ఎకరాలలో సాగు చేయవచ్చునని, అదే డ్రిప్ ఇరిగేషన్ ద్వారా 25 వేల ఎకరాల్లో సాగు చేయవచ్చని అన్నారు. బ్యాంకులో డబ్బును ఎలా పొదుపుగా వాడుకుంటామో నీటిని కూడా అలాగే వాడుకోవాలని కోరారు. సిద్ధాపురం ఎత్తిపోతల పథకం కోసం మాజీ మంత్రి బుడ్డా వెంగళరెడ్డి ఎన్నో పోరాటాలు చేశారని.. ఆయన గుర్తుగా బుడ్డా వెంగళరెడ్డి సిద్ధాపురం ఎత్తిపోతల పథకంగా నామకరణం చేస్తున్నామని ప్రకటించారు. అనంతపురంలో 64 మెగావాట్ల సౌర విద్యుత్ నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నామని సీఎం తెలిపారు. 'ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్లాంటు. బ్యాటరీల్లో సౌరవిద్యుత్‌ను నిక్షిప్తం చేసి.. అవసరమున్న సమయాల్లో వినియోగించుకునేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్తుంది" అని ఇది విజయవంతమైతే నవ్యాంధ్ర దేశానికే ఆదర్శమవుతుందని చెప్పారు.

ప్రొటెక్షన్ వాచర్ల వేతనం 12 వేలు

తమకు అడవే జీవనాధారమని, అడవుల సంరక్షణ కోసం చెంచు యువతను ప్రొటెక్షన్ వాచర్లుగా నియమించి నెలకు రూ.5,900 చొప్పున ఇస్తున్నారని, కానీ అందులో రూ.800 తీసుకుంటున్నారని చెంచుల సాధికార మిత్ర నాగరత్నమ్మ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వారికి వేతనం పెంచాలని, చెంచులకు పక్కా ఇళ్ల నిర్మాణానికి నిధులు పెంచాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రొటెక్షన్ వాచర్ల వేతనం రూ.12 వేలకు పెంచి వచ్చే బడ్జెట్ నుంచే నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్‌గృహనిర్మాణం కింద ఇచ్చే రూ.1.50 లక్షలతో చెంచులు ఇల్లు నిర్మించుకోవడం కష్టమేనని, అదనంగా రూ.75 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

సంక్షేమ పథకాలను అర్హులకు అందించడం, ప్రజల్లో జవాబుదారీతనం పెంచేందుకే జన్మభూమి కార్యక్రమాన్ని చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలని.. పింఛను, రేషన్ కార్డు, పక్కా ఇల్లు అందరికీ ఇస్తామన్నారు. సిద్ధాపురం గ్రామ అభివృద్ధికి వరాలు కురిపించారు.

దుర్గమ్మకు అపచారం చేసిన వారిపై కఠిన చర్యలు

విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయంలో నిబంధనలకు విరుద్ధంగా పూజలు చేయించిన వారిపై ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. తప్పులు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసుల నుంచి సమగ్ర నివేదిక అందాక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన, పూజలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. గుడి, మసీదు, చర్చి.. సున్నితమైన అంశాలని, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించకూడదని సూచించారు. కొందరు కులాలు, మతాలు, వర్గాలను రెచ్చగొట్టి కలహాలను సృష్టించాలని చూస్తున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో రెండే కులాలు ఉన్నాయని.. అవి డబ్బులు ఉన్నవారి కులం, పేద వారి కులమని.. తనది పేదల కులమని బాబు అన్నారు.

ఆనాడు వంటింటి నుంచి బయటకు రాని మహిళలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశామని, ఈ రోజు 90 లక్షల మంది తనకు అక్కాచెల్లెళ్లు ఉన్నారని అన్నారు. అన్ని పథకాలనూ మహిళల ద్వారానే అందించాలనే సంకల్పంతో సాధికార మిత్ర అమలులోకి తెచ్చామని గుర్తుచేశారు. కేవలం 30 రోజుల్లో 4 లక్షల మందితో సాధికార మిత్ర సైన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. సమావేశంలో శాసనమండలి చైర్మన్ ఫరూక్, ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు దేవినేని ఉమ, కాల్వ శ్రీనివాసులు, భూమా అఖిలప్రియ, ఎంపీలు ఎస్పీవై రెడ్డి, టీజీ వెంకటేశ్, బుట్టా రేణుక, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, మణిగాంధీ, భూమా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మీ కాళ్లు పట్టుకుంటా.. అదనంగా లక్ష ఇస్తా..!

- రోగిని బతిమాలిన జీజీహెచ్ వైద్యుడు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఆస్పత్రిలో కలకలం
- ఫిర్యాదు వెనక్కి తీసుకోం: బాధితురాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుంటూరు(సంగడిగుంట) జనవరి 7: 'మీ కాళ్లు పట్టుకుంటా..నా ప్రైవేట్ క్లినిక్‌కు కట్టిన లక్షన్నరకు అదనంగా మరో లక్ష ఇస్తా..తప్పు జరిగింది..క్షమించండి.' ఇది గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఒక రోగి దగ్గరకు వచ్చి డాక్టర్ చేసుకున్న విన్నపం. తన ప్రైవేట్ క్లినిక్‌లో ఆపరేషన్‌కు రూ.50 వేలు అవుతుందని చెప్పడంతో జీజీహెచ్‌కు వచ్చిన రోగికి ఆపరేషన్ జరగకుండా ప్రభుత్వ డాక్టర్ అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఆర్ఎంవో రమేశ్ స్పందించి మరో డాక్టర్ ప్రభావతికి రోగి ఆరోగ్య పరిస్థితి వివరించి సకాలంలో ఆపరేషన్ జరిగేలా చూశారు. దాచేపల్లి మండలం కేశనపల్లికి చెందిన బాధితురాలు ప్రస్తుతం జీజీహెచ్‌లోనే చికిత్స తీసుకుంటోంది. ఇదే విషయం ఆదివారం నాటి 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'నా క్లినిక్ కాదని జీజీహెచ్‌కు వస్తావా?' అనే పేరుతో వచ్చిన వార్త కలకలం రేపింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్, శస్త్రచికిత్స చేసిన వైద్యురాలు ప్రభావతిని తీసుకుని ఆదివారం ఉదయమే బాధితురాలు శైలజ దగ్గరకు వచ్చి..నేరుగా కాళ్లు పట్టుకుని తన తప్పును ఒప్పుకున్నట్లు సమాచారం. డబ్బు ఇస్తానని, ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని సదరు డాక్టర్ కోరినా బాధితురాలు ఒప్పుకోలేదు. ఆమె భర్త, అత్తా అదే చెప్పడంతో అక్కడ నుంచి డాక్టర్ వెళ్లిపోయారు. అంతకు ముందు జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజునాయుడు ఆదేశాలతో ఆర్ఎంవో ఆదినారాయణ బాధితురాలిని విచారించారు. పోలీసులూ ఆమె వాంగ్మూలం నమోదు చేశారు. ఈ మొత్తం ఘటనపై గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుబ్బారావు నేతృత్వంలో విచారణ జరుగుతుందని సూపరింటెండెంట్ రాజునాయుడు తెలిపారు.

చంద్రబాబు తర్వాత సీఎం లోకేశ్

- జగన్‌కు సీఎం అయ్యే అర్హత లేదు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 7: చంద్రబాబు తర్వాత ఎప్పటికైనా రాష్ట్ర సీఎంగా నారా లోకేశ్ బాధ్యతలు చేపడతారని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో ఆయన మాట్లాడుతూ లోకేశ్ ముఖ్యమంత్రి కావడానికే దుర్గగుడిలో తాంత్రిక పూజలు చేశారని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, ఆ విధంగా చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడు జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరని మంత్రి చెప్పారు. ప్రతిపక్ష పాత్ర సమర్థంగా నిర్వహించలేని జగన్ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మరని, ప్రజా సమస్యలపై అవగాహన లేని జగన్‌కు సీఎం అయ్యే అర్హత, సమర్థత లేవని విమర్శించారు.

ఆ ఇళ్లకు అదనపు నిధులు

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ప్రారంభమై అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లకు మోక్షం లభించనుంది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం రావడానికి ముందు నిర్మాణం మొదలుపెట్టడంతో 'ప్రీ ఎన్టీఆర్'గా వీటిని విభజించి ప్రత్యేక దృష్టి పెట్టారు. సుమారు 5 లక్షల ఇళ్లను పూర్తిచేయాలనే లక్ష్యంతో నిర్మాణాలను వేగవంతం చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లు అయిన నేపథ్యంలో ఇంకా వాటిని పెండింగ్‌లో ఉంచితే వచ్చే ఎన్నికల నాటికి ఇబ్బంది అవుతుందని భావించి చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ 1,94,590 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. రూ.1,910 కోట్ల నిధులు ఖర్చు చేశారు. ఎన్టీఆర్ ఇళ్లతో పోలిస్తే వీటిని పూర్తి చేయడానికి నిధుల అవసరం తక్కువే అవుతుంది. ప్రస్తుతం ఒక్కో ఇంటికి రూ.లక్షన్నర రాయితీ ఇస్తుండగా అప్పట్లో ప్రారంభమైన వాటికి అప్పటి రాయితీనే ఇస్తున్నారు. అయితే ధరలు పెరగడంతో లబ్ధిదారుల వినతి మేరకు ఒక్కో ఇంటికి రూ.25వేలు అదనంగా ఇస్తున్నారు. ఈ నిధుల విడుదల ప్రారంభమవడంతో ఇళ్లను పూర్తిచేసుకునేందుకు లబ్ధిదారులు ముందుకొస్తున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల ఉత్తర్వులపై అప్పీల్ సరికాదు: మాడభూషి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం కమిషన్‌లో ఉన్న కమిషనర్లు ఇచ్చే ఉత్తర్వులపై అప్పీల్ చేసే విధంగా ఆర్టీఐ చట్టానికి సవరణలు తీసుకురావడం సరికాదని కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ మాడభూషి శ్రీధర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం చిక్కడపల్లిలో పీపుల్స్ ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో శ్రీధర్ మాట్లాడారు. ఆర్టీఐ యాక్టు సవరణ ముసాయిదాల్లో కొన్ని నిబంధనలు చట్టాన్ని నీరుగార్చేలా ఉన్నాయని చెప్పారు. ఆ నిబంధనలను వెనక్కి తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఆర్టీఐ కింద కోరిన సమాచారం ఇవ్వడంలో, దరఖాస్తును ఆమోదించడంలో ప్రభుత్వ అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్టీఐ చట్టాన్ని సమర్థంగా వినియోగించుకునేలా తెలుగు రాష్ట్రాల ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉందన్నారు.



దామలచెరువు రచ్చబండలో మాట్లాడుతున్న జగన్

అధికారం కోసం ఎంతకైనా తెగిస్తాడు

- సొంతూరినే అభివృద్ధి చేయలేదు.. రాష్ట్రానికేం చేస్తాడు?
- పాదయాత్రలో బాబుపై జగన్ ధ్వజం

దామలచెరువు, జనవరి 7: అధికారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతకైనా తెగిస్తాడని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విమర్శించారు. పాదయాత్రలో భాగంగా ఆదివారం ఆయన చిత్తూరు జిల్లా పాకాల మండలం దామలచెరువులో రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కూతురినిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు అధికారం ఇచ్చిన ప్రజలు ఓ లెక్కా? బాబు సొంతూరు నారావారిపల్లెలో ఆయన చదివిన పాఠశాల శిథిలావస్థలో ఉంది. సొంత జిల్లా, సొంత నియోజకవర్గం, సొంత ఊరినే ఆయన అభివృద్ధి చేయలేదు. రాష్ట్రాన్ని సింగపూర్, జపాన్ చేస్తానంటాడు. సొంతూరి బడిని బాగు చేయలేని చంద్రబాబు రాష్ట్రంలోని పాఠశాలలను ఎలా అభివృద్ధి చేస్తాడు' అని ప్రశ్నించారు. చంద్రబాబుకు అధికారం ఒక్కటే కావాలని.. ప్రజల బాగోగులు, అభివృద్ధి, ప్రజల సంక్షేమం ఇవేవీ కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, నారాయణస్వామి, వైసీపీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, జంగాలపల్లె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం పూడిబట్లబయలు గ్రామంలో 55వ రోజు పాదయాత్రను ప్రారంభించిన జగన్.. గుండ్లగుట్టపల్లి మీదుగా దామరచెరువు చేరి.. రచ్చబండలో పాల్గొన్నారు. మళ్లీ అక్కడి నుంచి గొట్టాల క్రాస్, చౌడేపల్లి క్రాస్‌మీదుగా మొరవపాటూరు వరకు 14.2 కిలోమీటర్లు నడిచారు.

బాబును బీజేపీ ముంచేస్తుంది

- దేశంలో ఎమర్జెన్సీ కంటే భయానక స్థితి
- ఇష్టానుసారంగా పాలన: శరద్‌యాదవ్



విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును బీజేపీ ఏదో ఒక రోజు ముంచేస్తుందని జేడీయూ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు శరద్‌యాదవ్ హెచ్చరించారు. ఆదివారం విశాఖలో కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్ స్మారక ఉపన్యాస సభలో ఆయన మాట్లాడుతూ గతంలో బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలతో కలిసి ఉండే చంద్రబాబు, 2014 నుంచి బీజేపీతో జత కట్టారని అన్నారు. ఆయన మలిదఫా వ్యాపార దృష్టితో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో ఎమర్జెన్సీ కాలం కంటే భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించి, ఇష్టానుసారంగా పాలిస్తున్నారన్నారు.

బీజేపీది బ్లాక్‌మెయిలింగ్: నారాయణ

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ సమితి సమావేశాలు సోమవారం నుంచి విజయవాడలో జరగనున్నాయి. భవిష్యత్ రాజకీయ విధానంపై ఈ భేటీలో ముసాయిదా రూపొందిస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చెప్పారు. సీబీఐ, ఈసీ, గవర్నర్ల వ్యవస్థలను మోదీ ప్రభుత్వం తన గుప్పిట్లో పెట్టుకుని ఆడిస్తోందని విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం విమర్శించారు. బీజేపీకి, మోదీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా దేశద్రోహం కేసు పెట్టి అరెస్ట్ చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక రకంగా దేశంలో బీజేపీ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతోందని నారాయణ ధ్వజమెత్తారు. బీజేపీని ఓడించడం సీపీఐ లేదా వామపక్షాల వల్ల సాధ్యం కాదని, దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించేందుకు వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక వేదిక ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిని విజయవాడ నుంచే ప్రారంభిస్తామన్నారు.

'పోలవరం'లో కీలక అడుగు

- నేడు జెట్ గ్రౌటింగ్ పనులు షురూ
- ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

అమరావతి/ఏలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగు పడనుంది. ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణం కోసం జెట్ గ్రౌటింగ్ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ప్రారంభించనున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన డ్యాం డిజైన్ రివ్యూ కమిటీ (డీడీఆర్‌సీ) సమావేశంలో కాఫర్ డ్యాంను గత డిజైన్ల మేరకే నిర్మించుకోవచ్చని ఆమోదం లభించింది. కాఫర్ డ్యామ్ ఎత్తుతో సహా .. పరిమాణమూ తగ్గిస్తూ ఎన్‌హెచ్‌పీసీ ఇచ్చిన డిజైన్‌ను ఆచరణలోకి తెస్తే పోలవరం ప్రాజెక్టుకు పెను ముప్పు వాటిల్లుతుందని డీడీఆర్‌సీ ముందు రాష్ట్ర జల వనరుల శాఖ వాదించింది. ఈ వాదనతో డీడీఆర్‌సీ ఏకీభవించింది. టెండర్లను ఆమోదించిన సమయంలో చేసుకున్న ఒప్పందాల మేరకు ఎగువ కాఫర్ డ్యామ్ పనులు చేపట్టాలని సూచించింది. దీంతో వెంటనే జెట్ గ్రౌటింగ్ పనులు చేపట్టాలని రాష్ట్ర జల వనరుల శాఖ నిర్ణయించింది. సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొంటున్న సీఎం చంద్రబాబు జెట్‌గ్రౌటింగ్ పనులను ప్రారంభించనున్నారు. అలాగే స్పిల్ వే, స్పిల్ చానల్ కాంక్రీట్ పనుల్లో కొంత భాగాన్ని కొత్త సంస్థకు అప్పగించేందుకు జల వనరుల శాఖ పిలిచిన టెండర్లను ఈ నెల నాలుగో తేదీనే తెరవచ్చని కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్ సూచించారు. అయితే ఈ టెండర్లను తెరవాలంటే పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశం జరగాలి. ఈ సమావేశంలో టెండర్లపై అధికారికంగా నిర్ణయం వస్తుంది. ఆ ఆదేశాలతో ఒకవైపు ఎగువ కాఫర్ డ్యాం, మరో వైపు స్పిల్ వే, స్పిల్ చానల్ కాంక్రీట్ పనులూ సమాంతరంగా జరిగితే.. లక్ష్యం మేరకు పూర్తికి వీలుంటుందని జల వనరుల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. సోమవారం ప్రాజెక్టు పనుల పురోగతిని సీఎం పరిశీలించనున్నారు. కాంట్రాక్టు ఏజెన్సీలు, ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయ్యి పనుల పురోగతి తెలుసుకుంటారు. జూన్ నాటికి కీలక పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. మరోవైపు గంటకు 600 టన్నుల మేర కాంక్రీట్ తయారు చేసేందుకు రూ.25 కోట్ల విలువైన అగ్రిటెక్ కూలింగ్ ప్లాంట్‌ను ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేసింది. దీని ద్వారా కాంక్రీట్ పనులను పరుగులు పెట్టించవచ్చని ఇంజనీర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్పిల్‌వే గేట్లకు నమూనా గేటును 2-1.6 మీటర్లతో తయారు చేశారు. ఈ గేటును కూడా సీఎం ప్రారంభిస్తారు. కేంద్ర జల వనరుల మంత్రి నితిన్ గడ్కరీ ఈసారి పోలవరం సందర్శనకు వచ్చినప్పుడు ఈ గేటును ఆయన తిలకించేలా ఏర్పాటు చేస్తున్నారు. పోలవరం ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కదలిక ఉన్నందున సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.



జెట్ గ్రౌటింగ్ యంత్రం

బస్సుల్లో సంక్రాంతి బాదుడు

- చార్జీలను 3 రెట్లు పెంచేశారు
- విజయవాడకు రూ.1500 గుంజుడు
- తత్కాల్ పేరిట 'ప్రైవేటు' దోపిడీ
- 50 శాతం పెంచిన ఆర్టీసీలు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ అంటే చాలు హైదరాబాద్ ఒక్కసారిగా ఖాళీ అయిపోతుంది. మూడు రోజుల పాటు సాగే పెద్ద పండుగకు తెలుగు రాష్ట్రాల్లో సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య చాలా ఎక్కువ. ఏడాది అంతా పడిన శ్రమను మర్చిపోయేందుకు అన్నట్లు లక్షలాది మంది పల్లె బాట పడతారు. ఇదే అదనుగా ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీకి తెర తీశాయి. పండుగ నేపథ్యంలో ఏపీ, తెలంగాణ ఆర్టీసీలు ప్రస్తుత టికెట్ ధరపై 50 శాతం అదనంగా వసూలు చేస్తుంటే, ప్రైవేటు ట్రావెల్స్‌కు మాత్రం అడ్డూ అదుపు లేదు. ఎవరికి తోచినట్లు వారు చార్జీలు పెంచుకుని సంక్రాంతి డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్నారు. సంక్రాంతికి మరో వారం రోజులే ఉండగా... ప్రైవేటు ఆపరేటర్లు తత్కాల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పండుగ పూట ఊరు వెళ్లాలంటే అడిగినంత చెల్లిస్తేనే టికెట్ రిజర్వు చేస్తున్నారని విజయవాడ వెళ్లాల్సిన రాంబాబు అనే వ్యక్తి వాపోయారు.

పట్టించుకోని ప్రభుత్వాలు

నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ధరలను పెంచేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాల్సిన రవాణా శాఖలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి, మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తూ దోపిడీకి పరోక్షంగా సహకరిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతితో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాలకు వెళ్లే బస్సులకు డిమాండ్ విపరీతంగా ఉంటుంది. సాధారణ రోజుల్లోనే ఈ ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. ఈ ప్రాంతాలకు డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వం బస్సులను నడపాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. మొక్కుబడిగా స్పెషల్ బస్సులు వేసి ఊరుకుంది. రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నా సరిపోవడం లేదు. ఇదే ప్రైవేటు ట్రావెల్స్‌కు వరంగా మారింది.



ప్రైవేటు సెమీ స్లీపర్ బస్సుల్లో చార్జీలు ఇలా

హైదరాబాద్ నుంచి	సాధారణ రోజుల్లో	సంక్రాంతికి (రూ.లలో)
విజయవాడ	500	1500
విశాఖపట్నం	940	2590
కాకినాడ	670	1800
గుంటూరు	550	1500
విజయనగరం	1190	2600

డిమాండ్‌ను బట్టి దోపిడీ

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి వెళ్లే వారు ఈనెల 12, 13, 14 తేదీల్లో ఎక్కువగా ప్రయాణమవుతుంటారు. తిరిగి 16, 17 18 తేదీల్లో నగరానికి తిరిగి వస్తుంటారు. ఈ తేదీల్లోనే బస్సుల టికెట్ల ధరలను రెట్టింపు, అంతకంటే ఎక్కువ పెంచేసి విక్రయిస్తున్నారు. ఈ ఆరు రోజుల్లో ఉన్న డిమాండును సొమ్ము చేసుకునేందుకు పగలూ రాత్రీ ప్రైవేటు బస్సులను నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు ప్రాంతాలకు పెద్ద సంఖ్యలోనే ప్రైవేటు బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. తెలంగాణ రవాణా శాఖ రికార్డు ప్రకారం కాంట్రాక్టు క్యారేజ్ పర్మిట్ ఉన్న బస్సులు 7,866 వరకు తిరుగుతున్నాయి. వీటిలో తెలంగాణ పరిధిలో రిజిస్టర్ అయిన బస్సులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వచ్చి వెళుతున్నవీ ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు నడుస్తున్నా అవి సరిపడా లేకపోవడంతో ప్రైవేటు ఆపరేటర్లు హైదరాబాద్ కేంద్రంగా బస్సులు నడుపుతున్నారు. రూట్లలో డిమాండును బట్టి బస్సులు నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

Dwaraka

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

15

విజయవాడ • సోమవారం 8 జనవరి 2018

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్
చెన్నై x బెంగళూరు
రా. 7.20 నుంచి

యాషెస్ సిరీస్
ఆస్ట్రేలియా x ఇంగ్లండ్
ఐదో టెస్ట్ -ఐదోరోజు
ఉ.5 నుంచి



మూడోరోజు ఆట వర్షార్పణం

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టు మూడోరోజు ఆటకు వరుణుడు అడ్డంకిగా మారాడు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షం కారణంగా ఆదివారం ఒక్క బంతి ఆట కూడా సాధ్యం కాలేదు. దీంతో ఆటను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. తొలి రెండు సెషన్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా మధ్యలో ఓసారి వర్షం ఆగడంతో సూపర్ సాపర్‌తో మైదానాన్ని సిద్ధం చేయాలని చూశారు. ఈప్రయత్నాలు సాగుతుండగానే మళ్లీ భారీ వర్షం పడింది. ఇక చివరి రెండు రోజులు వాతావరణం సాధారణంగానే ఉంటుందన్న సమాచారంతో రోజుకు 98 ఓవర్లు ఆడించనున్నారు. లంచ్, టీ సెషన్లను 15 నిమిషాల చొప్పున అదనంగా ఆడిస్తారు. మరోవైపు మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు ఒక్కసారిగా మైదానంలోనికి దూసుకురావడం కలకలం రేపింది. చిత్తడిగా ఉన్న అవుట్ ఫీల్డ్‌పై వీరు జారుతూ.. స్కేటింగ్ చేస్తూ కనిపించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది వారిని వెంటాడి బయటికి పంపారు. రెండోరోజు ముగిసేసరికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 2 వికెట్లకు 65 పరుగులు చేసింది. క్రీజులో రబాడ (2), ఆమ్లా (4) ఉన్నారు.



క్రికెటర్ల భార్యలకూ అధికారా?

● బోర్డు ప్రతిపాదనకు సీవోఏ చెక్

కేప్‌టౌన్: బీసీసీఐ సమర్పించిన ఓ వింత ప్రతిపాదనకు క్రికెట్ పాలక మండలి (సీవోఏ) నో చెప్పింది. ఇంతకీ ఆ ప్రతిపాదన ఏమిటంటే.. సౌతాఫ్రికా పర్యటనలో ఉన్న టీమిండియా క్రికెటర్ల భార్యలకు లైజన్ అధికారి నియామకం. క్రికెటర్ల భార్యలు సౌతాఫ్రికాలో విహారం కోసం ఏర్పాట్లు చేయడం అతడి విధులన్నమాట! అయితే రిషికేష్ ఉపాధ్యాయ అనే అధికారి ఇప్పటికే టీమిండియా వెంట ఉన్నందున మరొకరి అవసరం లేదన్న సీవోఏ.. బోర్డు ప్రతిపాదనను తిరస్కరించింది. లేదంటే జనవరి 4న ఆ అధికారి ముంబై నుంచి కేప్‌టౌన్ బయలుదేరేవాడే. భారత జట్టుతోపాటు కోహ్లీ భార్య అనుష్క, రోహిత్ శర్మ భార్య రితిక, భువనేశ్వర్ భార్య నుపుర్, మురళీ విజయ్ భార్య నికిత, రహానె భార్య రాధిక, సాహా భార్య రోమి సౌతాఫ్రికా వచ్చారు. వారంతా రెండు వారాలపాటు భర్తలతో ఉండేందుకు బోర్డు అనుమతించింది.

'నా 24 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో భారత జట్టు ఇంత సమతూకంతో ఉండడం చూడలేదు. ఎందుకంటే నాలుగో ఫాస్ట్ బౌలర్‌గా ఆల్‌రౌండర్ ఉండడమే దీనికి కారణం. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో అతడే జట్టుకు అదనపు బలం' తొలి టెస్టుకు ముందు యువ ఆటగాడు హార్దిక్ పాండ్యాను ఉద్దేశించి బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్న మాటలివి. ఈ అపార అనుభవజ్ఞుడు చెప్పింది అక్షరాలా నిజమని రెండోరోజు ఆటలోనే తను నిరూపించుకున్నాడు. జట్టులోని ఉద్దండ బ్యాట్స్‌మెన్ కనీసం 30 పరుగుల వ్యక్తిగత స్కోరును కూడా అందుకోలేని స్థితిలో.. పాండ్యా బుల్లెట్‌లాంటి షాట్లతో విరుచుకుపడి సఫారీ పేస్ బలగాన్ని చెల్లాచెదురు చేశాడు. ఆ తర్వాత వారి ఓపెనర్లను కూడా పెవిలియన్‌కు పంపి భారత శిబిరంలో ఆనందం నింపాడు. చాలాకాలం తర్వాత జగద్విఖ్యాత ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ సరసన చోటు దక్కించుకునే స్థాయి ఉన్న ఆటగాడిగా ఇప్పుడు ఈ బరోడా బాంబర్ కనిపిస్తుండడం టీమిండియాకు మేలు చేసే అంశం..

హార్దిక్.. ది ట్రంప్ కార్డ్



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

హార్దిక్ పాండ్యా.. 2015లో ఐపీఎల్ సంచలనం. బ్యాట్‌తోనూ బంతితోనూ అదే స్థాయిలో ప్రత్యర్థికి చుక్కలు చూపించే సత్తా కలిగి ఉండడంతో ఈ బక్కపలచని యువ ఆటగాడు అందరి దృష్టిలోనూ పడ్డాడు. అంతే.. నేరుగా టీమిండియాలోకి వచ్చేశాడు. లీగ్‌లో సత్తాచాటి జాతీయ జట్టులో చోటు దక్కాక పేలవ ప్రదర్శనతో తెరుమరుగయ్యే రకం కాదని అతడు ప్రారంభం నుంచే నిరూపించుకున్నాడు. వన్డే, టీ20ల్లో మెరుపులు మెరిపిస్తుండడంతో ఏకంగా టెస్టు ఫార్మాట్‌లోనూ గతేడాదే చోటు దక్కించుకున్నాడు. పరిమిత ఓవర్లలో మెరుగ్గా ఆడినంత మాత్రాన సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇతడికి చోటేమిటి? అని అప్పట్లో పలువురు విమర్శించారు. అయితే పేస్ బౌలింగ్ అతడికి అదనపు బలంగా మారింది. 2017 జూలైలో పాండ్యా తొలి టెస్టును శ్రీలంకపై ఆడాడు. ఎనిమిదో నంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగి అరంగేట్ర మ్యాచ్‌లోనే అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ 50 పరుగుల్లో 38 పరుగులు ఫోర్లు, సిక్సర్ల ద్వారానే వచ్చాయి. ఇక మూడో టెస్టులోనే 96 బంతుల్లో 108 పరుగులతో మొదటి శతకంతో తన రాకను ఘనంగా చాటుకున్నాడు. ఒక్క సెషన్‌లోనే ఇలా సెంచరీ చేసిన రెండో భారత ఆటగాడిగా పాండ్యా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లున్నాయి. ఇప్పుడు నాలుగో టెస్టులో రెండో శతకానికి 7 రన్స్ దూరంలో ఆగాడు.

కళ్లు చెదిరే ఇన్నింగ్స్...: ఉపఖండ పిచ్‌లపై అతడు ఆడింది గొప్ప ఇన్నింగ్స్‌గా పేర్కొనేందుకు ఇష్టపడని వారికి సఫారీ గడ్డపై తానేమిటో పాండ్యా నిరూపించుకున్నాడు. బంతి భీకరంగా బౌన్స్ అవుతున్న న్యూలాండ్స్ వికెట్‌పై సఫారీ పేస్ బలగానికి ఎదురొడ్డి నిలిచి ఆడిన ఇన్నింగ్స్ కచ్చితంగా గుర్తుంచుకునేదే. సుదీర్ఘంగా బంతులను ఎదుర్కొన్నది లేదు. సహజశైలినే నమ్ముకుంటూ.. బౌన్సర్లను కాచుకుంటూ ఆడిన ఆటతీరే పాండ్యాను సమున్నతంగా నిలిచేలా చేస్తోంది. కట్ షాట్లు, అప్పర్ కట్, లాఫ్టెడ్ షాట్లతో బంతులను పరిగెత్తించాడు. పాండ్యా క్రీజులోకి వచ్చిన సమయంలో జట్టు స్కోరు 81/6. అతడు పెవిలియన్‌కు చేరేసరికి 199/8.. దారుణ అవమానం ఎదురుకాకుండా జట్టు తరపున అతడు ఆడిన ఇన్నింగ్స్‌కు మచ్చుతునక ఇది. 153 నిమిషాలపాటు సాగిన పాండ్యా ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఎల్గర్ క్యాచ్ మిస్ చేశాడు. ఆ తర్వాత బంతి రాకెట్ వేగంతో ప్రమాదకరంగా వస్తూ ఒంటిని తాకుతున్నా నెరవకుండా మొండిగా క్రీజులో నిలిచాడు. ముఖ్యంగా రబాడ వేసిన ఓ బంతి నేరుగా వచ్చి అతడి కడుపును తాకడంతో విలవిల్లాడాడు.

అమితాబ్‌తో పోలిక



రెండోరోజు ఆటలో పాండ్యా చూపించిన తెగువను మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ బాలీవుడ్ దిగ్గజం అమితాబ్ బచ్చన్‌తో పోల్చాడు. 'అప్పట్లో అమితాబ్ ద్విపాత్రాభినయం అద్భుతంగా పండించేవాడు. అలాగే పాండ్యా కూడా తన ఇన్నింగ్స్‌లో రెండు పాత్రలను సూపర్‌గా చూపెట్టాడు. ఒకటి ఆధునిక టీ20 ఆటగాడిగా మరోటి సంప్రదాయ టెస్టు క్రికెటర్‌గా అందరినీ ఆకట్టుకున్నాడు' అని ట్వీట్ చేశాడు.

అందుకే ప్రత్యేకం

తుది జట్టులో ముగ్గురు ప్రధాన పేసర్లుంటారు. ఇక్కడ మరో పేసర్‌ను తీసుకోవాలనుకుంటే ఓ బ్యాట్స్‌మన్‌ను కోల్పోవాల్సి వస్తుంది. కానీ పాండ్యా రూపంలో ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదు. తను నాలుగో ప్రధాన పేసర్‌గా 20 ఓవర్ల వరకు వేయగలడు. అంతేకాకుండా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గానూ రాణించగలడు. అన్నింటికన్నా ముఖ్యంగా అద్భుత ఫీల్డర్. ఓ ఆటగాడిగా జట్టుకు ఇంతకన్నా కావాల్సింది ఏముంటుంది. ఇలాంటి సౌకర్యం కపిల్ డెవిల్ జమానాలో కూడా లేకపోవడం గమనార్హం. అందుకేనేమో.. నికార్సయిన ఆల్‌రౌండర్‌గా పాండ్యాను సచిన్ ప్రశంసిస్తున్నాడు.

కోహ్లీ ఔటయ్యాడని..

● అభిమాని ఆత్మహత్యాయత్నం

రట్లాం (మధ్యప్రదేశ్): దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తక్కువ స్కోరుకే ఔటవడంతో మనస్తాపం చెందిన ఓ అభిమాని ఆత్మహత్యాయత్నం చేశాడు. రైల్వే రిటైర్డ్ ఉద్యోగి బాబూలాల్ భైరవ (65) కోహ్లీకి వీరాభిమాని. కేప్‌టౌన్‌లో జరుగుతున్న టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ 5 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో మనస్తాపం చెందిన భైరవ శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం బాబూలాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు పవర్‌లిఫ్టర్ల మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీ శివార్లలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రపంచ చాంపియన్ సాక్షం యాదవ్ సహా ఐదుగురు పవర్‌లిఫ్టర్లు మృతి చెందారు. పానిపట్‌లో జరిగిన అథ్లెటిక్ మీట్‌లో పాల్గొని స్విఫ్ట్ కారులో ప్లేయర్లు తిరిగివస్తున్న సమయంలో దుర్ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు. పొగమంచు విపరీతంగా ఉండడంతో ఎదురుగా ఉన్నవేవీ కనిపించక పోవడంతో కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో లిఫ్టర్లు సాక్షం, హరీష్, టింకూ, సూరజ్‌లతో పాటు మరో వ్యక్తి మృతి చెందాడు. సాక్షం యాదవ్ గత ఏడాది మాస్కోలో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు.

నేటినుంచి వైజాగ్‌లో ముస్తాక్ అలీ టీ20

విశాఖపట్నం (స్పోర్ట్సు): ముస్తాక్ అలీ టీ20 టోర్నీ(సౌత్‌జోన్) సోమవారం ప్రారంభం కానున్నది. ఆతిథ్య ఆంధ్రతో పాటు కర్ణాటక, తమిళనాడు, గోవా, కేరళ, హైదరాబాద్ జట్లు లీగ్ పద్ధతిలో తలపడనున్న ఈ టోర్నీకి విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం, విజయనగరంలోని ఏసీఏ అకాడమీ గ్రౌండ్ వేదికలు కానున్నాయి.

విజయం దిశగా ఆసీస్

సిడ్నీ: యాషెస్ ఐదో, చివరి టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా విజయం దిశగా దూసుకుపోతోంది. 303 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకున్న కంగారూలు..అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లండ్ పని పట్టారు. ఫలితంగా ఆదివారం, నాలుగోరోజు ఆట ఆఖరికి ఇంగ్లండ్ 94 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి మరో ఓటమికి చేరువైంది. అంతకు ముందు ఓవర్‌నైట్ 479/4తో ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ కొనసాగించగా మార్ష్ సోదరులు సెంచరీలతో అదరగొట్టడంతో భారీ స్కోరు సాధించింది. షాన్ మార్ష్ (291 బంతుల్లో 18 ఫోర్లతో 156), మిచెల్ మార్ష్ (141 బంతుల్లో 15 ఫోర్లు, రెండు సిక్సర్లతో 101) అద్భుత ఆట ఫలితంగా ఆస్ట్రేలియా 649/7తో మొదటి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

'బ్రిస్బేన్' కింగ్ కిరియోస్



బ్రిస్బేన్: ఆస్ట్రేలియాకు చెందిన వివాదాస్పద టెన్నిస్ ఆటగాడు నిక్ కిరియోస్ ఎట్టకేలకు సొంతగడ్డపై టైటిల్‌తో మెరిశాడు. 22ఏళ్ల నిక్ బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ఓపెన్‌లో సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో కిరియోస్ 6-4, 6-2తో అమెరికాకు చెందిన ర్యాన్ హారిసన్‌పై గెలిచి ట్రోఫీ అందుకున్నాడు.

రసాభాసగా హెచ్‌సీఏ ఎస్‌జీఎం



వివేక్

● మైకులు విరగ్గొట్టిన వీహెచ్
● అజర్‌కు అనుమతి నిరాకరణ
● శివలాల్ నచ్చజెప్పడంతో అనుమతి
● లోధా సిఫారసులకు ఆమోదం
● అధ్యక్షుడు వివేక్ ప్రకటన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): లోధా కమిటీ సిఫారసులకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆమోదం తెలిపిందని అధ్యక్షుడు జి. వివేకానంద్ ప్రకటించారు. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం) జరిగింది. గత జూలైలోనే 16పాయింట్లను పాస్ చేసినా.. బీసీసీఐ పాలక మండలి (సీవోఏ) ఆదేశాల మేరకు లోధా సిఫారసులను మొత్తంగా అమలుచేసేందుకు భేటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అయితే, ఈ భేటీ రసాభాసగా మారింది. సభ్యుల ఆరోపణలు, నినాదాలు, వాయిదాలతో సభ దద్దరిల్లింది. లోధా సిఫారసులను అమలుచేసినట్టు గతంలోనే ప్రకటించినప్పుడు, మళ్లీ వాటిపై చర్చ ఎందుకని సభ్యులు ప్రశ్నలు లేవనెత్తడంతో సమావేశం వాయిదా పడింది. అయితే, అప్పుడు 16 పాయింట్లకే ఆమోదం తెలిపామని.. ఇప్పుడు ప్రతీ సిఫారసుపై కూలంకషంగా చర్చించి ఆమోదించాలని.. అప్పుడే సంఘానికి నిధులు వస్తాయని వివేక్ తెలిపారు. ఇక, ఈ సమావేశం కోసం మాజీ క్రికెటర్ మహమ్మద్ అజరుద్దీన్ స్టేడియానికి రాగా అతనికి అనుమతి ఇవ్వలేదు. దీనిపై అజర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దాదాపు గంటసేపు అజర్ గేటు బయటే వేచి ఉన్నాడు. అదే సమయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు హెచ్‌సీఏ పాలకవర్గం తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అజర్‌కు అనుమతి ఇవ్వకపోవడంపై కూడా వీహెచ్ నిలదీసినట్టు సమాచారం. ఒకదశలో సహనం కోల్పోయి మైకులను విరగ్గొట్టారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై విమర్శలు చేసిన వీహెచ్.. సభను అడ్డుకున్నారని వివేక్ తెలిపారు. సస్పెండైన నేషనల్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సంతకంతో కూడిన కార్డు తీసుకొని వచ్చినందుకే అజర్‌ను అనుతించలేదన్నారు. హెచ్‌సీఏకు వ్యతిరేకంగా ఉన్న తెలంగాణ క్రికెట్ సంఘం (టీసీఏ)ను అజర్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మరోవైపు అజర్ టీసీఏతో లేడని, తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)కు మాత్రమే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడని మాజీ క్రికెటర్ శివలాల్ యాదవ్ చెప్పాడు. హెచ్‌సీఏకు వ్యతిరేకం కాదని అజర్‌తో ప్రకటన ఇప్పిస్తానని శివలాల్ హామీ ఇవ్వడంతో అనుమతించినట్టు వివేక్ తెలిపారు. ఇక హెచ్‌సీఏ సెక్రెటరీ శేష్ నారాయణ్ భవితవ్యంపై అంబుడ్స్‌మన్‌దే తుది నిర్ణయమని వివేక్ ప్రకటించారు. లోధా సిఫారసులకు ఆమోదం తెలిపినట్టు పాలకవర్గం చెబుతున్నా.. సభ్యుల అరుపులు, నినాదాలతో భేటీ గందరగోళంగా మారడంతో తీర్మానం జరిగినట్టుగా అనిపించలేదు. రెండుగంటల పాటు జరిగిన ఈ సమావేశంలో తమ పంతం నెగ్గించుకునేందుకు పాలకవర్గం ప్రయత్నించగా.. ప్రత్యర్థులు ప్రతిఘటించారు. దాంతో, ఎస్‌జీఎం ఫలప్రదం కాలేదని మెజారిటీ సభ్యులు చెబుతున్నారు.

అంతా అనైతికం: అజర్



హెచ్‌సీఏ పాలకవర్గం తీరుపై అజరుద్దీన్ నిప్పులు చెరిగాడు. 'హెచ్‌సీఏలో అవినీతి రాజ్యమేలుతోంది. జట్టుకు ఎంపికచేసేందుకు క్రికెటర్ల నుంచి 5లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. పదేళ్లు కెప్టెన్‌గా భారత్‌కు సేవలందించా. ఇక్కడున్న వారికి క్రికెట్‌లో ఏబీసీడీలు కూడా తెలియవు. ఎప్పుడూ బ్యాట్, బాల్ కూడా పట్టుకోలేద'ని దుయ్యబట్టాడు. హెచ్‌సీఏ రాజకీయాలతో ఆటగాళ్లు ఇబ్బందిపడకూదని అజర్ పేర్కొన్నాడు. సరైన కారణం లేకుండానే చాలా లీగ్‌లు అర్ధంతరంగా నిలిచిపోయావని ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘంలో నెలకొన్న అనిశ్చితి తొలగించేందుకు తాను ఇక్కడకు వచ్చానని చెప్పాడు. హెచ్‌సీఏలో లోధా కమిటీ సిఫారసులను అమలు చేయడం లేదన్నాడు. ఎస్‌జీఎం అప్రజాస్వామికంగా జరిగిందని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శివలాల్ యాదవ్ ఆరోపించాడు. హెచ్‌సీఏపై బీసీసీఐ పెద్దలకు ఫిర్యాదు చేస్తామన్నాడు.

హైదరాబాద్‌లో జాతీయ దివ్యాంగుల టీ20



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఈ ఏడాది జాతీయ దివ్యాంగుల టీ20 టోర్నమెంట్‌కు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. ఏప్రిల్ 14 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని వివిధ మైదానాల్లో ఈ టోర్నీ జరగనుంది. ఈ మేరకు ఆదివారం ఇక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో జాతీయ దివ్యాంగుల క్రికెట్ (బీడీసీఏ) ప్రతినిధులు వెల్లడించారు. ఈ సందర్భంగా టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

సైనాపై మారిన్ గెలుపు

చెన్నై: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో అవధ్ వారియర్స్‌కు హైదరాబాద్ హంటర్స్ షాకిచ్చింది. ఆదివారం జరిగిన పోరులో హంటర్స్ 6-(-1)తో అవధ్ వారియర్స్‌ను చిత్తు చేసింది. ఈ పోరులో అన్ని మ్యాచ్‌లనూ హైదరాబాద్ నెగ్గడం విశేషం. ఎంతో ఆసక్తి రేకెత్తించిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ 15-5, 15-7 స్కోరుతో సైనా నెహ్వాల్‌ను ఓడించింది. హైదరాబాద్‌కు ఇది ట్రంప్ మ్యాచ్. అంతకుముందు అవధ్ వారియర్స్ ట్రంప్ మ్యాచైన పురుషుల సింగిల్స్‌లోనూ హైదరాబాద్‌దే పైచేయి అయింది. ఈ మ్యాచ్‌లో సాయిప్రణీత్ 15-10, 15-10తో అవధ్ షట్లర్ శ్రీకాంత్‌ను కంగుతినిపించాడు. మరో పురుషుల సింగిల్స్‌లో లీ హ్యాన్ 13-15, 15-9, 15-14తో పారుపల్లి కశ్యప్‌పై గెలుపొందాడు. పురుషుల డబుల్స్‌లో, మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ హైదరాబాద్ విజయాలు నమోదు చేసింది.



మారిన్



రద్దయిన పెద్ద నోట్లతో స్టేషనరీని తయారు చేసే పనిలో చెన్నై సెంట్రల్ జైలు ఖైదీలు

రద్దయిన నోట్లతో స్టేషనరీ

» తమిళనాడు జైలులో ఖైదీలతో తయారీ

చెన్నై, జనవరి 7: ఏడాది క్రితం పెద్ద నోట్లు రద్దుతో ఆర్బీఐ వద్ద టన్నులకొద్దీ పేరుకుపోయిన 1000, 500 నోట్లు ఇప్పుడు స్టేషనరీగా మారుతున్నాయి. కట్టలు కట్టలుగా వచ్చి చేరిన పాతనోట్లను వేస్ట్ చేయకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన స్టేషనరీ తయారీకి వినియోగిస్తున్నారు. తమిళనాడులోని పుజల్ సెంట్రల్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న సుమారు 25-30 మంది ఖైదీలు రోజూ ఇక్కడ పాత నోట్లతో 'ఫైల్ ప్యాడ్స్' తయారు చేస్తున్నారు. తద్వారా రోజుకు రూ. 160 నుంచి 200 వరకూ ఆర్జిస్తున్నారు. ఖైదీలకు కూడా నెలలో 25 రోజులు పని దొరుకుతోంది. 70 టన్నుల పాత నోట్లను పుజల్ జైలుకు ఇచ్చేందుకు ఆర్బీఐ సిద్ధమైంది. అందులో 9 టన్నులు డెలివరీ చేసింది. వాటితో జైలులోని ఖైదీలు ఫైల్ ప్యాడ్స్ తయారు చేస్తున్నారని తమిళనాడు జైళ్ల శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. రోజుకి 1000 ఫైల్ ప్యాడ్లు రూపొందిస్తున్న ఖైదీలు ఇప్పటికే 1.5 టన్నుల నోట్లను స్టేషనరీగా మార్చేశారని ఆయన చెప్పారు. తమిళనాడులోని వేలూర్, సేలం, మదురై వంటి మరో ఆరు జైళ్లలోనూ స్టేషనరీ రూపొందిస్తారు కానీ.. ఒక్క పుజల్ సెంట్రల్ జైలులోనే ఇలా పాతనోట్లతో ఫైల్ ప్యాడ్స్ తయారు చేస్తుండడం విశేషం.

హెల్మెట్‌తో బస్ డ్రైవింగ్

» రాళ్ల దాడి భయంతో ముందు జాగ్రత్త

» తమిళనాడులో నాలుగో రోజుకు 'రవాణా' సమ్మె



చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ పెట్టుకోవాలని ద్విచక్రవాహనదారులను పోలీసులు ఎంతమొత్తుకున్నా పట్టించుకోరు. కానీ తమిళనాట ఓ డ్రైవర్ హెల్మెట్ ధరించి బస్సు నడపాల్సిన పరిస్థితి ఎదురైంది. 13వ వేతన సిఫారసులు అమలు చేయాలంటూ తమిళనాడు ప్రభుత్వ రోడ్డు రవాణా సంస్థ కార్మికులు విధులు బహిష్కరించి నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయితే ఈ సమ్మెకు దూరంగా ఉన్న అన్నాడీఎంకే అనుబంధ అన్నా కార్మిక సంఘానికి చెందిన కార్మికులు విధుల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈరోడ్ జిల్లా గోపిశెట్టిపాళయం డిపోకు చెందిన అన్నా కార్మిక సంఘం సభ్యుడు, బస్సు డ్రైవర్ ఎస్ఎస్ శివకుమార్ శనివారం హెల్మెట్ ధరించి బస్సు నడిపారు. అతడిని చూసి ప్రయాణికులు ఆశ్చర్యపోయారు. దీనిపై శివకుమార్ స్పందిస్తూ... ప్రైవేటు డ్రైవర్లతో నడుపుతున్న బస్సులపై సమ్మెలో పాల్గొంటున్న కార్మికులు దాడులు చేస్తున్నారని, ఆ భయంతోనే రెండు రోజులుగా హెల్మెట్ ధరించి విధుల్లో పాల్గొంటున్నానని చెప్పారు. అతడితో పలువురు ప్రయాణికులు సరదాగా సెల్ఫీలు దిగారు.

ఆర్వో నీరు.. అటాచ్డ్ బాత్‌రూమ్!

» ఓపెన్ జైలులో లాలూకు సకల సౌకర్యాలు



హజారీబాగ్, జనవరి 7: దాణా కుంభకోణం కేసులో మూడున్నరేళ్ల జైలు శిక్ష పడిన లాలూ ప్రసాద్ జైల్లో రాజయోగం అనుభవించనున్నారు! తాగడానికి ఆర్వో నీరు.. ఉండడానికి కాటేజ్, వంటగది, అటాచ్డ్ బాత్‌రూం.. ఇలా సకల సదుపాయాలు ఉండనున్నాయి! ప్రస్తుతం రాంచీలోని బిర్సా ముండా జైల్లో ఉంటున్న లాలూను హజారీబాగ్‌లోని ఓపెన్ జైలుకు తరలించనున్నారు. దోషులుగా ప్రకటించిన 16 మందినీ ఓపెన్ జైలుకే తరలించాలని సీబీఐ ప్రత్యేక జడ్జి శివపాల్ సింగ్ ఆదేశించిన సంగతి తెలిసిందే. 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న హజారీబాగ్‌లోని ఓపెన్ జైలులో 100 కాటేజ్‌లు ఉన్నాయి. ఒక్కో కాటేజ్‌లో ఒక గది, వంట గది, అటాచ్డ్ బాత్‌రూం ఉంటాయి. ఈ కాటేజ్‌లో ఓ ఖైదీ తన భార్య, చిన్న పాప/బాబుతో ఉండొచ్చని జైలు అధికారులు తెలిపారు. జైల్లో ఆవులు, గేదెలు కూడా ఉంటాయని.. దోషులందరికీ అనుకూలంగా ఉంటుందని జడ్జి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు డజన్ల ఆవులు, గేదెలను తీసుకురానున్నట్లు జైలు అధికారులు తెలిపారు. బిర్సా ముండా జైల్లో తాగునీరు సరిగా లేదని లాలూ జడ్జికి ఫిర్యాదు చేశారు. దీంతో హజారీబాగ్ జైల్లోని కాటేజీల్లో ఆర్వో యంత్రాలను కూడా బిగిస్తున్నారు. కాగా, లాలూ ప్రసాద్ ఏకైక సోదరి గంగోత్రి దేవి(75) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం తుదిశ్వాస విడిచారు. విషయాన్ని లాలూకు తెలియజేశామని, పెరోల్‌పై వచ్చి సోదరి అంత్యక్రియల్లో పాల్గొంటారని ఆయన కుమారుడు తేజస్వి యాదవ్ వెల్లడించారు.

లాలూ తనయులపై ఐటీ నిఘా

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమారుడు, ఇద్దరు కుమార్తెలపై ఆదాయ పన్ను శాఖ నిఘా పెట్టింది. లెక్కచూపని నగదుతో ఢిల్లీలో 'ఏబీ ఎక్స్‌పోర్ట్స్' పేరిట రూ.40 కోట్ల విలువైన ఆస్తిని సొంతం చేసుకున్నారన్న ఆరోపణలపై లాలూ కుమారుడు తేజస్వి యాదవ్, ఇద్దరు కుమార్తెలపై ఐటీ శాఖ విచారణ జరపనుంది.

మరింత పటిష్ఠ పోలీసింగ్

» భద్రతను బలోపేతం చేయాలి

» డీజీపీలతో ప్రధాని మోదీ



డీజీపీ, ఐజీపీల సదస్సుకు విచ్చేసిన ప్రధాని మోదీని స్వాగతిస్తున్న రాజ్‌నాథ్, కిరణ్ రిజిజు

టేకన్‌పూర్, జనవరి 7: దేశంలో భద్రతా పరిస్థితులపై పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా చర్చించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. భద్రతను మరింత బలోపేతం చేయడం ఎలా? అనే అంశంపైనా విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని టేకన్‌పూర్‌లో జరుగుతున్న డీజీపీలు, ఐజీపీల వార్షిక సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. 'పటిష్ఠ పోలీసింగ్, భద్రతకు సంబంధించి ప్రత్యేకంగా పోలీసు ఉన్నతాధికారులతో చర్చలు జరిపాం' అని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా భద్రతా పరిస్థితులకు సంబంధించి ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించారు. గడిచిన మూడేళ్లలో తీసుకున్న పలు నిర్ణయాల అమలు పరిస్థితిపైనా వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి జమ్మూకశ్మీరు, ఈశాన్య రాష్ట్రాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని అధికారులతో పేర్కొన్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో తొలిరోజు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లోని ఉగ్రసంస్థలు జమ్మూకశ్మీరులోని యువతను తప్పుదారి పట్టిస్తూ దేశానికి వ్యతిరేకంగా తయారయ్యేలా మారుస్తున్నాయని ఆరోపించారు. అల్లర్లను అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. డీజీపీల వార్షిక సమావేశం 2వ రోజు ప్రధాని హాజరై భద్రతకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన సర్వేలో కేంద్ర పోలీసు సంస్థలకు చెందిన 5 ఉత్తమ వెబ్‌సైట్లలో సశస్త్ర సీమబల్ వెబ్‌సైట్ ఒకటిగా నిలిచిందని మోదీకి అధికారులు వివరించారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర భద్రతా బలగాలకు చెందిన 250 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఏటా ఢిల్లీలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ఈ సంప్రదాయానికి తెరదించారు. 2014 నుంచి ఏడాదికో చోట డీజీపీల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. మూడేళ్లు వరుసగా గువాహటి, కచ్, హైదరాబాద్‌ల్లో నిర్వహించారు.

'కశ్మీరు'పై మోదీ సర్కారు వైఫల్యం: చిదంబరం



న్యూఢిల్లీ, జనవరి 7: జమ్మూకశ్మీరులో శాంతిని పునరుద్ధరించడంలో మోదీ సర్కారు ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఆరోపించారు. కశ్మీరు లోయలో ఉగ్రవాదాన్ని నియంత్రించేందుకు కేంద్రం అనుసరించిన 'కఠిన, కండబలం ప్రదర్శించే, యుద్ధానికి పురిగొల్పే' విధానాల వల్ల సానుకూల ఫలితాలు రాకపోగా సమస్య మరింత పెరిగిందని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన కశ్మీరు అంశంపై వరుసగా తొమ్మిది ట్వీట్లు చేశారు. 2014 నుంచి 2017 మధ్య జమ్మూకశ్మీరులో ఉగ్రవాదంపై జరిగిన పోరులో మరణించిన ఉగ్రవాదులతో పాటు సాధారణ ప్రజల సంఖ్య కూడా రెట్టింపయిందన్నారు. మరో నేత కపిల్ సిబాల్ కూడా కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 'కశ్మీరులో దాదాపు రోజూ పోలీసులు, సైనికులు చనిపోతున్నారు. దీనికి కేంద్రం వివరణ ఇవ్వగలదా? ప్రాణ నష్టం ఎన్నడు ఆగుతుంది?' అని ప్రశ్నించారు.

నెహ్రూ వల్లే ఈ దుస్థితి: బీజేపీ

కశ్మీరులో శాంతిని పునరుద్ధరించడంపై కాంగ్రెస్ నేత చిదంబరం ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. జమ్మూకశ్మీరులో ప్రస్తుత పరిస్థితులకు కారణం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూనే అని ఆరోపించింది. చిదంబరం ఆరోపణలపై బీజేపీ నేత సంబిత్ పాత్రా స్పందించారు. కశ్మీరులో అశాంతికి కారణం.. తొలి ప్రధాని నెహ్రూ తీసుకున్న దౌర్భాగ్యకరమైన నిర్ణయాలేనన్నారు.

ఉపాధి హామీతో.. వలసలు తగ్గుముఖం

» కేంద్ర ప్రభుత్వ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన ప్రాంతాల్లో వలసలను నివారించి, అక్కడి ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించాలని 2006లో అప్పటి యూపీఏ సర్కారు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం ఇప్పుడు ఫలాలనిస్తోంది. 100 రోజుల పని నిబంధనను కరవు ప్రాంతాల్లో సడలించి, మరో 50 రోజుల అదనపు పని కల్పించడం వల్ల ఇది సాధ్యమైందని ఇటీవల కేంద్రం నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశంలో పెద్దఎత్తున వలసలు సాగుతున్న 30 జిల్లాల్లో ఈ సర్వే నిర్వహించగా.. తెలంగాణలోని మహబూబ్‌నగర్, ఏపీలోని అనంతపురం, విజయనగరం ఈ జాబితాలో ఉన్నాయి.

ఉపాధి హామీ పనుల్లో సహజ వనరుల నిర్వహణ (ఎన్ఆర్ఎం) వలసలకు అడ్డుకట్ట వేసేందుకు ఉపయోగపడింది. ఇందులో చెరువుగట్లపై చెట్ల పెంపకం, చెక్ డ్యాంల నిర్మాణం, నీటి కాలువలు, వరద నీటి కాలువలు, నీటి మళ్లింపు కాలువల నిర్మాణం, బోరు బావుల ఏర్పాటు, భూమి చదును తదితర పనులున్నాయి. కేంద్రం తన సర్వేలో ఎన్ఆర్ఎం పనులతో 2.5 శాతం వలసలు తగ్గాయని, జాబ్‌కార్డు ఉన్న కుటుంబాల ఆదాయం 11 శాతం పెరిగిందని గుర్తించింది. వ్యవసాయ ఉత్పాదకతలో వరి (11.7 శాతం), కూరగాయల సాగు (28శాతం) పెరిగింది. రుణాల తగ్గుదల, భూగర్భ జలాల పెరుగుదల వెనుక 'ఉపాధిహామీ' ఉందని సర్వే వెల్లడించింది.

సర్వే సాగిందిలా..

- ఎక్కడెక్కడ? - దేశంలోని 21 రాష్ట్రాల్లోని 30 జిల్లాల్లో.. 112 మండలాల పరిధిలోని అత్యంత వెనకబడిన 156 గ్రామాలలో ఈ సర్వే చేపట్టారు
- సర్వేలో ఎవరిని ఎంచుకున్నారు? - 66.6 శాతం సన్న, చిన్న కారు రైతులు, 24.5 శాతం నైపుణ్యం లేని కార్మికులు, 2.8 శాతం నైపుణ్యం ఉన్న కార్మికులు, 6.1 శాతం ఇతరులు
- సర్వే తీరు? - మూడు కేటగిరీల్లో (60, 60-90, 90కి పైగా పనిదినాలు)

వాహనాలకు బంపర్లు బిగించొద్దు

» రాష్ట్రాలకు కేంద్రం లేఖ

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మోటారు వాహనాలకు బంపర్లు, బుల్‌బార్లు, క్రాస్‌గార్డులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్రం ఒక లేఖ రాసింది. ఇవి వాహనాలకు బిగించటం మోటార్ వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 52కి విరుద్ధమని, దీన్ని అతిక్రమించిన వారికి సెక్షన్ 190, 191 ప్రకారం జరిమానా విధించవచ్చని లేఖలో పేర్కొంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం తెలిపింది.

ఆధార్ దుర్వినియోగం కథనంపై కేసు

పత్రిక, విలేకరిపై ఫిర్యాదు చేసిన యూఐడీఏఐ

న్యూఢిల్లీ, జనవరి 7: ఆధార్ సమాచారం దుర్వినియోగం అవుతోందంటూ కథనం ప్రచురించిన 'ది ట్రిబ్యూన్' వార్తాపత్రిక, ఆ పత్రిక విలేకరి రచనా ఖైరాపై భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశారు. ఆధార్ డేటాను గుర్తు తెలియని వ్యక్తులు నామమాత్రపు ధరకే వాట్సప్‌లో అమ్ముకుంటున్నారని ఈ నెల 3న 'ది ట్రిబ్యూన్' ప్రచురించింది. 500 రూపాయలు ఇస్తే గోప్యంగా ఉంచవలసిన ఆధార్ సమాచారమంతా 10 నిమిషాల్లో ఏజెంట్ అందజేసినట్లు పేర్కొంది. యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ బీఎం పట్నాయక్ ఫిర్యాదు మేరకు ఈ కథనం కోసం విలేకరికి సహకరించిన ముగ్గురిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రచన స్పందిస్తూ తన కథనంపై యూఐడీఏఐ కనీసం ఏదో ఒక చర్య తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆధార్ సమాచారమంతా కట్టుదిట్టమైన భద్రతతో ఉందని యూఐడీఏఐ పేర్కొంది. దుర్వినియోగం చేయడం సాధ్యం కాదంటూనే అనధికారికంగా ఆధార్ డేటాను యాక్సెస్ చేసినందుకే చర్యలు చేపట్టామని తెలపడం విశేషం.

అమెరికా కాంగ్రెస్ బరిలో తెలుగు మహిళ

» నామినేషన్ వేసిన అరుణ మిల్లర్



వాషింగ్టన్, జనవరి 7: ప్రతిష్ఠాత్మకమైన అమెరికా కాంగ్రెస్‌కు తెలుగు మహిళ అరుణ మిల్లర్ పోటీ చేస్తున్నారు. 53 ఏళ్ల వయసున్న ఆమె ప్రస్తుతం మేరీల్యాండ్ ప్రతినిధుల సభలో సభ్యురాలు. మేరీల్యాండ్ నుంచి అమెరికా కాంగ్రెస్‌కు ఎంపికయ్యేందుకు ఆదివారం అరుణ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నిక జూన్ 26న జరుగనుంది. సివిల్ ఇంజనీర్ అయిన అరుణ అభ్యర్థిత్వానికి 314-యాక్షన్ అనే రాజకీయ కార్యాచరణ కమిటీ మద్దతు తెలిపింది.

కిమ్‌తో చర్చలకు సిద్ధం: ట్రంప్

థర్మోంట్, జనవరి 7: ఉత్తరకొరియా పాలకుడు కిమ్ జోంగ్-ఉన్‌తో చర్చలకు తాను సిద్ధమేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. అయితే షరతులకు లోబడి ఇవి జరగాలని అన్నారు. రెండేళ్ల తర్వాత తొలిసారి ఉభయ కొరియా మధ్య మంగళవారం చర్చలు జరగనున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. దక్షిణకొరియాలోని ప్యోంగ్‌చాంగ్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు ఉత్తరకొరియా ఆసక్తి చూపుతోంది. దీనిపైనే రెండు దేశాలు మాట్లాడుకోనున్నాయి. ఇది మంచి ఆరంభమని ట్రంప్ అన్నారు. తనను విమర్శిస్తూ మైకేల్ ఉల్ఫ్ రాసిన పుస్తకంపై ట్రంప్ స్పందిస్తూ.. అమెరికా చట్టాలు బలహీనంగా ఉన్నాయని, అందుకనే ఇలాంటి వాళ్లు అడ్డగోలుగా రాస్తున్నారని ధ్వజమెత్తారు.

పాక్‌లో పాలస్తీనా రాయబారి పునర్నియామకం

ఇస్లామాబాద్, జనవరి 7: పాకిస్థాన్‌లో పాలస్తీనా రాయబారిగా వాలిద్ అబూ అలీ మళ్లీ నియమితులయ్యారు. బుధవారం నుంచి ఆయన తన విధుల్లో పాల్గొననున్నారు. ఇటీవల రావల్పిండిలో జరిగిన ఓ కార్యక్రమంలో ముంబైలో 26/11 ఉగ్రవాద దాడుల సూత్రధారి, అంతర్జాతీయ ఉగ్రవాదిగా ఐక్యరాజ్యసమితి పేర్కొన్న హఫీజ్ సయీద్‌తో అలీ వేదికను పంచుకోవడం, దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాలస్తీనా ప్రభుత్వం ఆయనను బాధ్యతల నుంచి తప్పించింది. పాకిస్థాన్ విదేశాంగ అధికారుల విజ్ఞప్తి మేరకు అలీని ఆదివారం తిరిగి రాయబారిగా నియమించినట్లు పాక్‌కు చెందిన ఓ వార్తా చానల్ తెలిపింది.

నరసింహన్ అసమర్థ గవర్నర్: శశిధర్‌రెడ్డి

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అసమర్థుడని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి విమర్శించారు. గవర్నర్ టీఆర్ఎస్‌కి తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గవర్నర్‌కు వేతనాన్ని కేసీఆర్ చెల్లిస్తున్నారన్నట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లేలా టీపీసీసీ అధ్యక్షునితోపాటు, టీకాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జితోనూ చర్చిస్తామని తెలిపారు.



లేక్ షికాగో తీరాన్ని కప్పేసిన మంచు

గడ్డ కట్టిన అమెరికా, కెనడా!

» మైనస్ 45 డిగ్రీలతో గజగజ..

» దారులను కప్పేసిన మంచు

న్యూయార్క్, జనవరి 7: అమెరికా తూర్పు తీరం, కెనడా చలికి గడ్డ కట్టుకుపోతున్నాయి. 'బాంబ్' మంచు తుఫాన్ తర్వాత 'ఆర్కిటిక్ బ్లాస్ట్'తో రికార్డు స్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కెనడా ఉత్తర ప్రాంతంలో ఉష్ణోగ్రతలు మైనస్ 50డిగ్రీలకు పడిపోయాయి. బాంబ్ తుఫాన్ ధాటికి అమెరికాలో వివిధ ప్రాంతాల్లో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉష్ణోగ్రతలు మైనస్ 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. శనివారం ఒక్క రోజే 2,250 విమానాల రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు గంటల తరబడి విమానాశ్రయాల్లో ఉండిపోవాల్సి వచ్చింది.

'యో డీడీ.. ఏందిది?' కీర్తనయ్యేదాకా ఆగలేరా?

దూరదర్శన్‌పై నిర్మల ఆగ్రహం



చెన్నై, జనవరి 7: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా జరిగిన ఓ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేసిన దూరదర్శన్.. పంచరత్న కీర్తనను మధ్యలోనే నిలిపేసి ప్రకటన ప్రసారం చేయడం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆగ్రహం తెప్పించింది. తమిళనాడులోని తిరువయ్యారులో జరుగుతున్న ఆరాధనోత్సవాలను శనివారం డీడీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఆ కీర్తనలను టీవీలో వీక్షిస్తున్న మంత్రి ట్విట్టర్ ద్వారా డీడీని అభినందించారు. అంతలోనే ప్రసారాన్ని నిలిపివేసి, ప్రకటన ఇవ్వడంతో ట్విట్టర్‌లో దూరదర్శన్‌ని ట్యాగ్ చేస్తూ.. 'యో డీడీ నేషనల్.. ఏందిది? కీర్తన పూర్తయ్యేదాకా ఆగలేరా? కీర్తన మధ్యలో ప్రకటన అవగాహనలేని చర్య' అని తన అసహనాన్ని వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ప్రసార భారతి సీఈఓ ఎస్ ఎస్ వేంపాటి స్పందిస్తూ, ఇది అనుకోకుండా జరిగిన పొరపాటని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సచిన్ కూతురుకు వేధింపులు.. అరెస్టు



కోల్‌కతా, జనవరి 7: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూతురు సారాను వేధించిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్‌లోని మిద్నాపూర్‌కు చెందిన దేవ్‌కుమార్ మైటీ(32) సచిన్ ఇంటి ఫోన్ నంబరు సంపాదించి.. ఫోన్ చేసి అసభ్యకర వ్యాఖ్యలు చేసేవాడు. ఆమెను కిడ్నాప్ చేస్తానని హెచ్చరించేవాడు. నిందితుడు సచిన్ ఇంటి నంబరుకు దాదాపు 20 సార్లు ఫోన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సచిన్ సహాయకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడ్ని అరెస్టు చేశామన్నారు. హల్దియా కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ నిమిత్తం ముంబయికి తరలిస్తామన్నారు. దీనిపై మైటీని ప్రశ్నించగా.. 'ఒక రోజు క్రికెట్ మ్యాచ్ వస్తున్నపుడు పెవిలియన్‌లో కూర్చున్న సారాను టీవీలో చూశా. అప్పుడే ప్రేమలో పడిపోయా. ఆమెను నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నా. సారాను వ్యక్తిగతంగా ఎప్పుడూ చూడలేదు.' అని తెలిపాడు. అయితే, మైటీ ఎనిమిదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని అతడి బంధువులు చెప్పారు. కాగా, ఎంతో గోప్యంగా ఉండే సచిన్ ఇంటి ఫోన్ నంబరు ఎలా సాధించాడనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు.

సరిహద్దుల్లో 14 వేల బంకర్లు

» పాక్ దాడుల నుంచి ప్రజలకు రక్షణ

» వ్యక్తిగత, సామూహిక బంకర్ల నిర్మాణం

» 415 కోట్లు మంజూరు చేసిన కేంద్రం



జమ్మూ, న్యూఢిల్లీ జనవరి 7: జమ్మూ డివిజన్‌లోని సరిహద్దు గ్రామాల ప్రజల కోసం భూగర్భ రక్షణ గృహాలు (బంకర్లు) నిర్మించనున్నారు. పాకిస్థాన్ తరచూ దాడులకు తెగబడి తూటాల వర్షం కురిపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు రక్షణ కవచంగా 14 వేలకు పైగా బంకర్లు నిర్మించాలని నిర్ణయించారు. పూంచ్, రజౌరి జిల్లాల్లో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి 7,298 బంకర్లను; జమ్మూ, కథువా, సాంబ జిల్లాల్లో అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వెంబడి మరో 7,162 బంకర్లను నిర్మిస్తారు. 160 చదరపు అడుగులు ఉండే వ్యక్తిగత బంకర్లలో 8 మంది, 800 చదరపు అడుగులు ఉండే సామూహిక బంకర్లలో 40 మంది ఉండేందుకు వీలుంటుందని అధికారులు వెల్లడించారు. ఈ బంకర్ల నిర్మాణానికి కేంద్రం రూ.415.73 కోట్లు మంజూరు చేసింది. భారత్, పాకిస్థాన్ మధ్య 3,323 కిలో మీటర్ల పొడవునా సరిహద్దు ఉంది. ఇందులో 221 కిలో మీటర్ల అంతర్జాతీయ సరిహద్దు, 740 కిలో మీటర్ల నియంత్రణ రేఖ జమ్మూ కశ్మీర్ పరిధిలో ఉన్నాయి. గత ఒక్క ఏడాదే పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో 19 మంది ఆర్మీ, నలుగురు బీఎస్ఎఫ్ సిబ్బంది, 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. కాగా, ఉత్తర కశ్మీర్‌లో బందిపొరా జిల్లాలో ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా కోసం పని చేస్తున్న ఇద్రిస్ అహ్మద్ బాబా అనే వ్యక్తిని భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, రాష్ట్ర ప్రజల కోసమైనా చర్చలు జరపాలని ప్రధాని మోదీ, పాకిస్థాన్‌లకు జమ్మూ కశ్మీర్ సీఎం మెహబూబా కోరారు.

వృద్ధుల కోసం ఐటీబీపీ విహార యాత్ర

భారత-చైనా సరిహద్దు గ్రామాల్లో నివసించే వృద్ధుల కోసం విహార యాత్రలు ఏర్పాటు చేయాలని ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు విభాగం నిర్ణయించింది. గత ఏడాది సెప్టెంబరులో సరిహద్దు గ్రామాలను సందర్శించిన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇక్కడ ప్రజలను 'వ్యూహాత్మక ఆస్తులు' అని పేర్కొన్న విషయం తెలిసిందే. వారిని ఎన్నటికీ నిర్లక్ష్యం చేయకూడదని ఐటీబీపీకి బోధించారు. ఈ నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలను విహార యాత్రలకు తీసుకెళ్లాలని ఐటీబీపీ నిర్ణయించింది.

నాసా వ్యోమగామి జాన్ యంగ్ కన్నుమూత



వాషింగ్టన్, జనవరి 7: ప్రముఖ వ్యోమగామి జాన్ యంగ్(87) కన్నుమూశారు. కొద్దిరోజులుగా నిమోనియాతో బాధపడుతున్న ఆయన శుక్రవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచినట్లు నాసా ఆదివారం ప్రకటించింది. నాసా నిర్వహించిన జెమిని, అపోలో, స్పేస్ షటిల్ వంటి కార్యక్రమాల్లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లిన ఒకే ఒక్క వ్యోమగామి జాన్ యంగ్ అని నాసా అడ్మినిస్ట్రేటర్ రాబర్ట్ లైట్‌ఫుట్ తెలిపారు. ఆరుసార్లు అంతరిక్షంలోకి వెళ్లొచ్చిన తొలి వ్యోమగామి యంగ్ అని.. అంతరిక్షంలో అత్యధిక సమయం గడిపిన వ్యక్తిగానూ ఆయన గతంలో రికార్డు సృష్టించారని పేర్కొన్నారు.

బంగళాలు ఖాళీ చెయ్యాల్సిందేనా?!

» మాజీ ప్రధానులు, రాష్ట్రపతులకు చేదువార్త

» 16న అత్యున్నత న్యాయస్థానంలో వాదనలు

న్యూఢిల్లీ, జనవరి 7: దేశ ప్రధానులు, రాష్ట్రపతుల హోదాలో అధికారిక నివాసాలు పొంది మాజీలైన వారు ఇప్పుడు వాటిని ఖాళీ చేయాల్సిన పరిస్థితులు రానున్నాయి. ఈ జాబితాలో హెచ్‌డీ దేవెగౌడ, వాజపేయి, మన్మోహన్‌సింగ్‌తో పాటు ప్రతిభా పాటిల్, ప్రణబ్ ముఖర్జీ తదితరులున్నారు. మాజీ సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రమణియం ప్రతిపాదనలను సుప్రీంకోర్టు ఆమోదిస్తే వీరు బంగళాలను వదిలిపెట్టాల్సిందే. 16న జస్టిస్ గొగోయ్, జస్టిస్ భానుమతితో కూడిన ధర్మాసనం దీనికి సంబంధించిన పిల్‌పై వాదనలు విననుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.